www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఫేస్ రికగ్నిషన్, ఫింగర్ ప్రింట్‌తోనూ ఇక యూపీఐ చెల్లింపులు

నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చిన ఎన్‌పీసీఐ

పిన్ ఆధారిత చెల్లింపుల్లో భారీ మోసాల నేపథ్యంలో మార్పుచేర్పులు 2



బుధవారం | 8-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 173 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.2:23 తదుపరి తదియ, నక్షత్రం: అశ్వని రా.10:45 తదుపరి భరణి, వర్జ్యం: రా.7:12-8:37, దుర్ముహూర్తం: ఉ.11:39-12:26, అమృతఘడియలు: సా.4:21-5:47, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:10, సూర్యాస్తమయం: 5:54 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కొండ చరియలు పడిన బస్సు వద్ద సహాయక చర్యలు

బస్సుపై పడిన కొండచరియలు

హిమాచల్‌లో 18 మంది మృతి

బస్సులో 35 మంది ప్రయాణికులు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం 2



ఎంత తేడా?

ములకలచెరువులో 'నకిలీ' మద్యం తయారీ కేంద్రాన్ని కనిపెట్టింది.. కేసు కట్టింది.. కూటమి ప్రభుత్వంలోని ఎక్సైజ్ అధికారులు! నిందితుల కోసం వేట మొదలుపెట్టింది.. ఏపీ పోలీసులు! ఈ దందాతో సంబంధమున్న టీడీపీ నేతలపై క్షణం ఆలోచించకుండా సస్పెన్షన్ వేటు వేసింది ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు! అయినా సరే.. నకిలీ మద్యం తయారీ వెనుక ప్రభుత్వ పెద్దలే ఉన్నారని చిలవలు పలవలు అల్లడం జగన్ రోత మీడియాకే చెల్లింది! అదంతా పక్కనపెట్టండి! ఇదే దందా వైసీపీ హయాంలో వైసీపీ నేతలు చేసి ఉంటే ఏం జరిగేది? ఒక్క క్షణం ఆలోచించండి! నాటి ప్రభుత్వ శాఖలు పట్టించుకునేవే కావు. మీడియా బయట పెట్టినా... స్పందించేవారూ కారు! పైగా... ఇలాంటి 'దందా'కోరులను పిలిచి పదవులిచ్చి సత్కరించిన నేపథ్యం వైఎస్ జగన్‌ది! నాటికీ... నేటికీ తేడా ఇది!



2022లో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబ సభ్యులు వీరంతా.. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును పరామర్శకు వచ్చిన సందర్భంగా వీరు బోరున విలపించడం నాడు అందరినీ కలచివేసింది.

మకిలి చరిత్ర మరిచి

నకిలీ మద్యంపై జగన్ రాజకీయం



ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వ పెద్దలకు ముడిపెట్టే ప్రయత్నాలు

- తయారీ కేంద్రాన్ని బయటపెట్టిందే నేటి ప్రభుత్వం
- వారూవీరూ అని లేకుండా సొంత నేతలపైనా చర్యలు
- క్షణం ఆలస్యం చేయకుండా ఇద్దరిపై సస్పెన్షన్ వేటు
- వివాదాస్పదులను ఏ మాత్రం ఉపేక్షించని చంద్రబాబు
- నాడు.. అరాచకవాదులకు జగన్ ప్రోత్సాహం
- దళిత డ్రైవర్ శవాన్ని డోర్ డెలివరీ చేసిన అనంతబాబు
- ఆయనను ఇంటికి పిలిచి భోజనం పెట్టిన జగన్
- చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగికి పదవి
- జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం చావులపై చర్యలు నిల్
- మల్లాది బార్‌లో ఆరుగురు మృతి.. ఆయనకు టికెట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మద్యాన్నే ఆదాయ మార్గంగా ఎంచుకుని.. కనీవినీ ఎరుగని రీతిలో ముడుపులు దండుకుని.. అదే సొమ్ములతో మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు స్కీములు రచించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే నేడు 'నకిలీ మద్యం' అంటూ రచ్చ చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో ఎక్సైజ్ అధికారులు బయటపెట్టిన నకిలీ/అనధికార మద్యం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ పెద్దలతో ముడిపెట్టేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు. 'దీని వెనక ఎవరున్నా వదలొద్దు' అని ప్రభుత్వం సూటిగా ఆదేశించడంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు పార్టీలతో సంబంధం లేకుండా నిందితుల కోసం వేట ప్రారంభించారు. జగన్ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా రాజకీయ కోణంలో బురదజల్లడంపైనే దృష్టి సారించారు. నాడు...

మిగతా 14వ పేజీలో...

కల్తీ కిక్కులో కొత్త కోణం!

నకిలీ డిస్టిలరీ ఏర్పాటులో వైసీపీ టైంలోనే జనార్దన్ యత్నాలు

ఎవ్వరినీ వదలొద్దు!

- నకిలీ మద్యం కేసులో ప్రభుత్వ ఆదేశాలు
- నిందితుల కోసం కొనసాగుతున్న వేట
- కమిషనరేట్‌కు ఎక్సైజ్ సీఐ హిమబిందు బదిలీ
- మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో

జాడలేని పక్షి రక్షణ పేరిట

రూ.7 కోట్లు భక్షణ!



- విద్యుత్ శాఖలో 'అరుదైన' అవినీతి
- అంతరిస్తున్న అరుదైన పక్షి బట్టమేక
- రోళ్లపాడులో మూడున్నరేళ్ల క్రితం దాని జాడ
- ప్రస్తుతం అవి లేవని డబ్ల్యూఐఐ నిర్ధారణ
- అయినా.. వాటి రక్షణ పేరుతో 'టెండర్'
- హెచ్‌టీ తీగలకు డైవర్టర్ల ఏర్పాటుకు నిర్ణయం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అరుదైన, అంతరించిపోతున్న పక్షి జాతిని కాపాడేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టొచ్చు! కానీ.. అసలు అక్కడ ఆ పక్షి ఉనికి లేనే లేదని నిర్ధారణ అయిన తర్వాత కూడా 'రక్షణ' పేరిట కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడితే? అది నిజంగానే 'అరుదైన' అవినీతే అవుతుంది. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ శాఖ బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ - జీఐబీ) రక్షణ పేరుతో ఇదే చేస్తోంది. వివరాల్లోకి వెళితే... అంతరించిపోతున్న పక్షి జాతి బట్టమేక! రాష్ట్రంలో చివరిగా మూడున్నరేళ్ల క్రితం ఈ అరుదైన

మిగతా 2వ పేజీలో...



పెట్రోల్ వాహనాల ధరలకు సమానంగా ఈవీలు!


- మరో 4-6 నెలల్లో అందుబాటులోకి..
- శిలాజ ఇంధనాలతో ఆర్థికంగా పెను భారం
- కాలుష్యరహిత ఇంధనాలతోనే దేశ పురోగతి
- వచ్చే ఐదేళ్లలో భారత వాహన రంగం ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలి
- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ 2

వద్దన్నా పెళ్లి చేసుకున్నాడని..

నవ వరుడిని చంపేశారు



- పెళ్లయిన 12 రోజులకే హత్య చేసిన బావమరిది
- మరో ఇద్దరితో కలిసి కత్తులతో పొడిచి..
- గుంటూరు జిల్లాలో ఘాతుకం 14
- పోలీసులను రక్షణ కోరినా దక్కని ఫలితం



జాన్ ఎం.మార్టినిస్, మైకెల్ హెచ్ డెవొరె, జాన్ క్లార్క్

క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనకు

భౌతికశాస్త్ర నోబెల్

జాన్ క్లార్క్, మైకేల్ హెచ్ డెవొరె, జాన్ ఎం మార్టినిస్‌కు సంయుక్తంగా ప్రకటించిన నోబెల్ కమిటీ

స్టాక్‌హోం, అక్టోబరు 7: అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలను.. భౌతిక శాస్త్రంలో ఈ ఏటి నోబెల్ వరించింది. ఆ ముగ్గురూ.. బ్రిటన్‌కు చెందిన జాన్ క్లార్క్ (83), ఫ్రాన్స్‌కు చెందిన మైకేల్ హెచ్ డెవొరె (72), అమెరికాకు చెందిన జాన్ ఎం.మార్టినిస్ (67). డిజిటల్ టెక్నాలజీకి మరింత ఊతమిచ్చే క్వాంటమ్ టన్నెలింగ్‌పై వీరు 1980ల్లో కీలక పరిశోధనలు చేశారు. సాధారణంగా ఏదైనా ఒక కణం వెళ్లే మార్గంలో ఒక

మిగతా 2వ పేజీలో...

కనీస పింఛన్

రూ.2500!

- 11 ఏళ్ల తర్వాత పెంపు దిశగా సంకేతాలు
- 10న ఈపీఎఫ్‌వో ట్రస్టీల భేటీలో నిర్ణయం!
- 7,500 చేయాలంటున్న ఉద్యోగ సంఘాలు
- 10 ఏళ్ల రెగ్యులర్ సర్వీసు, 58 ఏళ్లు పూర్తిచేసుకున్న వారు పింఛన్‌కు అర్హులు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) త్వరలోనే ఈపీఎఫ్ చందాదారులకు శుభవార్త చెప్పనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. 11 ఏళ్ల సుదీర్ఘ ఎదురుచూపుల అనంతరం పింఛను మొత్తాన్ని పెంచే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద నెలవారీ రూ.1000 పింఛన్ ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని 2014లో

మిగతా 2వ పేజీలో...



వారి వివరాలివ్వండి

- బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది పేర్లను రేపట్లోగా ఇవ్వండి
- చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా.. కొత్తవా?
- ఆ వివరాలు వెల్లడించి గందరగోళం తొలగించండి
- ఎన్నికల కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 7: బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను గురువారంలోగా ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ... అందులో చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా లేక కొత్త ఓటర్లవా అని ప్రశ్నించింది. ఈ విషయంలో

మిగతా 2వ పేజీలో...

బిహార్‌లో 'సీటు' పోరు!

ఎన్నికల్లో సీట్లు, సీఎం పదవిపై పార్టీల వ్యూహాలు

బీపీసీఎల్‌కు 6 వేల ఎకరాలు

రామాయపట్నం ఓడరేవు సమీపంలో కేటాయింపు

96 వేల కోట్లతో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు



- భారీగా ప్రోత్సాహకాలు ప్రకటించిన ప్రభుత్వం
- త్వరలోనే పట్టాలెక్కనున్న మెగా ప్రాజెక్టు
- 2029 జనవరికి వాణిజ్య కార్యకలాపాలు
- వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓ భారీ ప్రాజెక్టు పెట్టుబడులు సాకారం కావడానికి చకచకా అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రూ. 96,862 కోట్ల పెట్టుబడితో రామాయపట్నం ఓడరేవు సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ (భారీ చమురు శుద్ధి కర్మాగారం) ఏర్పాటు చేయనుంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం 6 వేల ఎకరాలను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ఆర్థిక ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఏడాదికి 9 నుంచి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో

మిగతా 11వ పేజీలో...

కారవాన్ టూరిజానికి ఓకే.. ఉత్తర్వులు జారీ 11



13

సోదరుడు రామ్మూర్తి నాయుడి సంవత్సరీకం సందర్భంగా నారావారిపల్లి స్మృతివనంలోని సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్, కుటుంబ సభ్యులు నారా రోహిత్, ఇందిర, గిరీశ్

మోహన్‌బాబు వర్సిటీని మూసేయండి!

ఆ బాధ్యతలు ఎస్వీయూకు అప్పగించండి

- విద్యార్థుల నుంచి 26 కోట్ల అదనపు వసూళ్లు 12
- సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర వేధింపులు
- 15 రోజుల్లో అదనపు ఫీజులు వెనక్కి ఇవ్వాలి
- ఉన్నత విద్యా కమిషన్ సంచలన ఉత్తర్వులు
- 15 లక్షల జరిమానా చెల్లించిన విశ్వవిద్యాలయం
- గుర్తింపు రద్దు, వసూళ్లపై హైకోర్టుకు వర్సిటీ

MBU MOHAN BABU UNIVERSITY



పాదచారుల భద్రతపై

నిబంధనలు రూపొందించండి

రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం 2

భారత విద్యార్థులకు అమెరికా

మొండిచెయ్యి!

- గతేడాదితో పోలిస్తే వీసాల్లో 44.5% తగ్గుదల
- ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయ విద్యార్థుల్లో 17% పెరుగుదల 2

రోడ్డు ప్రమాద బాధితులను

ఆదుకుంటే 25 వేలు

ప్రకటించిన యూపీ సర్కారు

మహిళలకు 'సఖి సురక్ష'

- 35 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు 11
- రేపు విశాఖలో ప్రారంభించనున్న మెప్మా

అమరావతిలో ప్రత్యేక ప్రాజెక్టుల కోసం ఎస్పీవీ

కంపెనీల చట్టం కింద రిజిస్టర్ చేసేందుకు అనుమతి 13

రీసర్వే పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్

2,096 గ్రామాల్లో జనవరి నుంచి రీసర్వే 2.0

మొదటి దశలో 628.. రెండో దశలో 748 గ్రామాల్లో.. ఈ నెల 3 నుంచి మరో 720 గ్రామాల్లో శ్రీకారం.. రైతులతో నేరుగా మాట్లాడనున్న బృందాలు

సవేంద్రరెడ్డి కేసులో సీబీఐ దర్యాప్తుపై సుప్రీం స్టే 14

- ఎస్‌ఎల్‌పీ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి
- గత నెల 22న గంజాయితో అరెస్టయిన వైసీపీ నేత సవేంద్రరెడ్డి
- అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో భార్య పిటిషన్
- సీబీఐకి అప్పగిస్తూ 26న హైకోర్టు తీర్పు.. ఇప్పుడు సుప్రీం స్టే

భారత విద్యార్థులకు అమెరికా మొండిచెయ్యి!

» గత ఏడాది కంటే 44.5% తక్కువ వీసాలు జారీ

» ఫ్రాన్స్ వెళ్లే భారత విద్యార్థుల్లో 17% పెరుగుదల

న్యూఢిల్లీ, అక్టోబరు 7: విదేశీ విద్యార్థులకు అమెరికా జారీ చేసే వీసాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది ఆగస్టులో అమెరికా దాదాపు ఐదో వంతు తక్కువ విద్యార్థి వీసాలను జారీ చేసిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీని ప్రభావంతో అక్కడికెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. సాధారణంగా అమెరికాలో యూనివర్సిటీలు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ఈ నెలకు గాను ట్రంప్ యంత్రాంగం 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. 2024 ఆగస్టుతో పోలిస్తే ఇది 19.1% తక్కువని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ పేర్కొంది. గత ఏడాది అమెరికాకు వెళ్లిన విదేశీ విద్యార్థుల్లో భారత్ టాప్‌లో నిలిచింది. గత ఆగస్టుతో పోలిస్తే భారతీయులకు ఈసారి ఏకంగా 44.5% తక్కువ వీసాలు జారీ చేయడంతో మన దేశ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసాల కంటే రెట్టింపు సంఖ్యలో చైనీయులకు 86,647 వీసాలు జారీ అయ్యాయి. మరోవైపు ఇరాన్ నుంచి కూడా ప్రవేశాలు 86% తగ్గాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లాలని భావిస్తున్న భారతీయ విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. వందలాది మంది విద్యార్థుల వీసాలు రద్దు చేయడం, వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయడం, ఆంక్షలు, అరెస్టులు, సోషల్ మీడియా వెట్టింగ్, హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును పెంచడం వంటి చర్యలతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

ఢిల్లీలో 'చూజ్ ఫ్రాన్స్ టూర్-2025'

2024-25 సంవత్సరానికి గాను ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయ విద్యార్థులు 17% పెరిగారు. 2030 నాటికి వీరి సంఖ్యను 30వేలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫ్రాన్స్ రాయబార కార్యాలయం తెలిపింది. తమ దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలకు అవగాహన కల్పించేందుకు 'చూజ్ ఫ్రాన్స్ టూర్-2025' పేరిట మంగళవారం ఢిల్లీలో కార్యక్రమం నిర్వహించింది. అక్టోబరు 5న చెన్నైలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 9న కోల్‌కతాలో, 11న ముంబైలో నిర్వహించనున్నారు. ఫ్రాన్స్‌లోని అగ్రశ్రేణి వర్సిటీలతో పాటు ఇంజనీరింగ్, బిజినెస్, ఆర్ట్స్ విభాగాల్లోని 50కి పైగా ప్రముఖ విద్యాసంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి.

దేవుడే నాతో చేయించాడు!

» నేను నిమిత్త మాత్రుడిని

» సీజేఐపై బూటు విసిరేయత్నంపై న్యాయవాది రాకేశ్ కిశోర్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై కోర్టు రూమ్‌లో సోమవారం బూటు విసిరేసిన ఘటనపై(భద్రతా సిబ్బంది అడ్డు కున్నారు.) న్యాయవాది రాకేశ్ కిశోర్ స్పందించారు. ఈ విషయంలో తనకు ఎలాంటి చింతా లేదని పేర్కొన్నారు. "తొలుత ఆయన సనాతనుడు. తర్వాత బౌద్ధంలోకి మారారు. ఇప్పుడు ఆయన దళిత బిడ్డనని చెప్పుకొంటారు. ఆయన దళితుడా?. ఇదీ వాళ్ల రాజకీయం" అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో తాను అవసరమైతే జైలుకైనా వెళ్తానని, క్షమాపణలు మాత్రం చెప్పేది లేదని తేల్చి చెప్పారు. "ఎట్టి పరిస్థితిలోనూ క్షమాపణలు చెప్పను. భగవంతుడే నాతో ఈ పనిచేయించాడు. నేను నిమిత్త మాత్రుడిని. ఆయన(దేవుడు) నన్ను జైలుకు పంపించినా వెళ్తా. లేదా.. ఉరి వేయించినా భరిస్తా. అంతా ఆయన ఇష్టం" అని చెప్పారు. "విష్ణుమూర్తి విగ్రహం' పిల్‌పై సీజేఐ చేసిన వ్యాఖ్యలతో నా మనసు గాయపడింది. 'వెళ్లు.. తలను పునరుద్ధరించమని ఆ విగ్రహాన్నే వేడుకో!.' అని సీజేఐ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయి. నా వెనుక ఎలాంటి గ్రూపులు లేవు" అని రాకేశ్ వ్యాఖ్యానించారు.



ఫేస్ రికగ్నిషన్.. ఫింగర్ ప్రింట్‌తోనూ
యూపీఐ చెల్లింపులు

ముంబై, అక్టోబరు 7: యూపీఐ చెల్లింపులను ఇకపై ముఖ ధ్రువీకరణ (ఫేస్ రికగ్నిషన్), వేలిముద్రల (ఫింగర్ ప్రింట్స్)తో చేసే అవకాశాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కల్పిస్తోంది. మంగళవారం ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. యూపీఐ చెల్లింపులకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న పిన్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొస్తున్న ఈ విధానం సురక్షితమైన, యూజర్ ఫ్రెండ్లీ విధానమని ఎన్‌పీసీఐ తెలిపింది. ప్రత్యేకించి యూపీఐ చెల్లింపుల విధానాన్ని కొత్త వినియోగదారులకు, వృద్ధులకు బయోమెట్రిక్ విధానం మరింత సులభతరమవుతుందని పేర్కొంది.

పాదచారుల భద్రతకు రూల్స్ పెట్టండి: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాదచారుల భద్రత, ఫుట్‌పాత్‌లు, రోడ్ డిజైన్‌ల కోసం మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 138 (1ఏ) కింద నిబంధనలు రూపొందించాలని సుప్రీంకోర్టు మంగళవారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. 2023నాటి రోడ్డు ప్రమాదాల నివేదికలో పేర్కొన్నట్టుగా 50 నగరాల్లోని ఫుట్‌పాత్‌ల ఆడిట్‌ను ప్రారంభించాలని ఆదేశించింది. ఇప్పటికే ఉన్న ఫుట్‌పాత్‌ల్లోని లోపాలను గుర్తించాలని, వెడల్పు, ఎత్తు ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సూచించింది. రోడ్డు ప్రమాదాల సమస్యలపై కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ రాజశేఖరన్ దాఖలు చేసిన 'పిల్'పై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు ఇచ్చింది.

ప్రమాద బాధితులకు సాయం చేస్తే రూ.25 వేలు

లఖ్‌నవూ, అక్టోబరు 7: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను ఆదుకొని, సకాలంలో ఆస్పత్రికి తరలించే వారికి బహుమతి ఇవ్వాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాదం జరిగిన గంట వ్యవధిలో ఆస్పత్రికి తరలిస్తే తీవ్రంగా గాయపడిన వారు కూడా కోలుకునే అవకాశం ఉంది. అందువల్ల ప్రమాద బాధితులను సకాలంలో ఆదుకొనే దిశగా ప్రజలను ప్రోత్సహించాలని సర్కారు నిర్ణయించింది. ఆదుకున్న వారికి రూ.25వేల నగదు బహుమతిని, 'రాహ్-వీర్' పురస్కారాన్ని ఇవ్వనుంది. ఈ మేరకు యూపీ రవాణా కమిషనర్ కింజాల్ సింగ్ సోమవారం ఆదేశాలు ఇచ్చారు.

బస్‌పై కొండచరియలు.. 18 మంది మృతి

సిమ్లా, అక్టోబరు 7: హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో కొండచరియలు విరిగి ప్రైవేటు బస్సు మీద పడిన ప్రమాదంలో 18 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కేవలం ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు బాలూఘాట్ కొండల్లో ఈ సంఘటన జరిగింది. ప్రమాద సమయంలో 30-35 మంది బస్సులో ఉంటారని అంచనా. శిథిలాల నుంచి ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికితీశారు. సోమవారం నుంచి ఈ ప్రాంతం లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కొండ మొత్తం కూలిపడటంతో బస్సు పూర్తిగా శిథిలాల్లో కూరుకుపోయింది. ప్రధాని మోదీ ఈ సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించారు.

కనిపించని పక్షి రక్షణకు రూ.7కోట్లు భక్షణ!

(మొదటి పేజీ తరువాయి)

పక్షి కనిపించింది. ఈ పక్షి సుమారు మూడు అడుగుల ఎత్తు.. 18 కేజీల బరువు ఉంటుంది. ఈ పక్షి రెక్కలు విప్పితే ఏడు అడుగులు ఉంటాయి. నంద్యాల జిల్లాలోని రోళ్లపాడు వైల్డ్ లైఫ్ శాంక్చురీలో చివరిసారిగా ఈ పక్షి 2022 మార్చి 15న కనిపించిందని అటవీశాఖ రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత దీని జాడే లేదు. 'రోళ్లపాడులో జీఐబీ పునరుద్ధరణ సాధ్యం కాదు. కొన్నేళ్లుగా ఈ పక్షి ఆనవాళ్లు లేవు' అని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) తన నివేదికలో ధ్రువీకరించింది. దేశంలోని జాతీయ పార్కులు, వైల్డ్ లైఫ్ శాంక్చురీల పనితీరుపై 2020-25 సంవత్సరాలకు సంబంధించి రూపొందించిన నిర్వహణ ప్రభావ అంచనా నివేదికలో ఈ విషయాన్ని డబ్ల్యూఐఐ ప్రస్తావించింది. అంటే... రోళ్లపాడులో బట్టమేక పక్షి లేనట్లే!

దోపిడీకి 'రక్షణ' ముసుగు

బట్టమేక పక్షులు ఎక్కువగా రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతంలో, గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో అతి తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఈ పక్షికి కళ్లు తలకు చెరోవైపు ఉంటాయి. అందువల్ల దగ్గరకు వచ్చే వరకు అది కరెంటు తీగలను గుర్తించ లేదు. చివరి నిమిషంలో గుర్తించినా శరీర బరువు కారణంగా దిశను మార్చుకోలేక తీగలను ఢీకొని చనిపోతుంటాయి. రాజస్థాన్, గుజరాత్‌లోని జీఐబీ ఆవాసాల వద్ద ఉన్న హైటెన్షన్ తీగల కారణంగా ఈ పక్షులు చనిపోతున్నాయని, వాటిని సంరక్షించాలంటూ 2009లో పర్యావరణ వేత్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై 2012లో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ... రాజస్థాన్, గుజరాత్ ప్రభుత్వాలకు జీఐబీల సంరక్షణలకు చర్యలు తీసుకోవాలని కోరింది. జీఐబీలు నివసించే ప్రాంతంలో హైటెన్షన్ వైర్లను భూగర్భంలో వేయాలని, సంచరించే ప్రాంతంలో బర్డ్ డైవర్టర్లను పెట్టాలని ఆదేశించింది. రాష్ట్ర విద్యుత్తు అధికారులు ఈ ఆదేశాలనే అడ్డు పెట్టుకున్నారు.

అయినా రక్షిస్తారట...

కనిపించని బట్టమేక పక్షిని సంరక్షించేందుకు విద్యుత్తు శాఖ రూ.7.80 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమైంది. అప్పుడెప్పుడో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఇప్పుడు అమలు చేసేందుకు ముందుకొచ్చింది. రోళ్లపాడు వైల్డ్‌లైఫ్ శాంక్చురీ మీదుగా వెళ్లే ఈహెచ్‌టీ లైన్లకు పక్షులు ఢీకొనకుండా 40,522 బర్డ్ ఫ్లైట్ డైవర్టర్లను (నాన్ ఎల్‌ఈడీ) ఏర్పాటు చేయాలంటూ టెండర్లు పిలిచింది. విద్యుత్తు శాఖ పేర్కొన్న స్టాండర్డ్ రేట్ టారిఫ్ ప్రకారం, డైవర్టర్లను కొనడం.. ఏర్పాటు చేయడం ఒక్కరే చేయాలి. దీనికిగాను యూనిట్‌కు రూ.1,470గా నిర్ణయించారు. కానీ విద్యుత్తు శాఖ పిలిచిన టెండర్‌లో డైవర్టర్ల కొనుగోలుకు.. ఏర్పాటు చేసేందుకు వేర్వేరుగా టెండర్లు పిలవడం గమనార్హం. ఈ ముసుగులో భారీగా జేబులు నింపుకొనేందుకు సిద్ధమయ్యారనేది సుస్పష్టం. 40,522 డైవర్టర్లకు ఒక్కో దానికి రూ.1091.80 చొప్పున రూ.4.42 కోట్లకు టెండరు పిలిచారు. ఈ మొత్తానికి జీఎస్టీ కలిపి రూ.5.22 కోట్లు అవుతుంది. వీటిని ఏర్పాటు చేసేందుకు లేబర్ రేటు ఒక్కో దానికి రూ.410 చొప్పున రూ.1.66 కోట్లకు టెండరు పిలిచారు. దీనికి జీఎస్టీ కలిపి రూ.1.96 కోట్లు అవుతుంది. అయినవారికి టెండర్లు కట్టబెట్టేందుకే ఇలా విడగొట్టి పిలిచారని స్పష్టంగా తెలుస్తోంది. అదే సమయంలో రోళ్లపాడు శాంక్చురీ విస్తీర్ణం సుమారు 6 చదరపు కిలోమీటర్లు మాత్రమే. కానీ, అధికారులు రోళ్లపాడుకు 41 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం వరకు డైవర్టర్లను ఏర్పాటు చేసేందుకు టెండరు పిలవడం గమనార్హం. అసలు రోళ్లపాడులోనే బట్టమేక పక్షులు లేవని డబ్ల్యూఐఐ స్పష్టం చేసినా... వాటి సంరక్షణకు శ్రీశైలం వరకు డైవర్టర్లను ఏర్పాటు చేయాలనుకోవడం విడ్డూరం!

బట్టమేక పక్షి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రోళ్లపాడులో 1984లో తొలిసారి కనిపించింది. అప్పటి వరకు రాజస్థాన్, గుజరాత్‌లోనే తక్కువ సంఖ్యలో ఉన్నాయని భావిస్తున్న ఈ పక్షులు 35 వరకు రోళ్లపాడులో కనిపించాయి. అంతరించిపోతున్న జాతి పక్షుల జాబితాలో ఉన్న బట్టమేకను సంరక్షించేందుకు 1998లో రోళ్లపాడు వైల్డ్ లైఫ్ శాంక్చురీని ఏర్పాటు చేశారు. ఇక్కడ చివరిసారిగా ఈ పక్షి 2022 మార్చిలో కనిపించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

బిహార్‌లో సీటు పోరు!

కూటముల్లో పెద్దన్న పాత్ర కోసం పార్టీల పట్టు.. సీట్ల పంపకంపై విస్తృతంగా చర్చలు



పట్నా/న్యూఢిల్లీ, అక్టోబరు 7: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే సీట్ల పంపకాల రాజకీయం మొదలైంది. పెద్దన్న పాత్ర కోసం కూటముల్లోని పార్టీల్లో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఎన్డీయే కూటమిలో ప్రధానమైన బీజేపీ, జేడీయూ సమాన సంఖ్యలో సీట్లలో పోటీచేయాలనే భావనకు వచ్చినట్టు తెలిసింది. మరోవైపు మహాఘట్‌బంధన్ కూటమిలో సీట్ల లెక్కతోపాటు సీఎం అభ్యర్థి అంశమూ సందిగ్ధత రేపుతోంది. ఇక చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ తాజాగా ఎన్డీయే కూటమిని వీడి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ జన సురాజ్ పార్టీతో జట్టుకట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బిహార్ ఎన్నికలు మూడు కూటముల ముక్కోణపోటీగా మారవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ, జేడీయూ.. సమానంగా సీట్లు!

బిహార్‌లో ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీయూతోపాటు లోక్‌జనశక్తి (ఎల్‌జేపీ), హిందుస్థానీ అవామీ మోర్చా (హెచ్‌ఏఎం), రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎం) భాగస్వాములుగా ఉన్నాయి. ఇందులో బీజేపీ, జేడీయూతోపాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ కూడా కీలకం. ప్రతిసారి కూటమిలో భాగంగా బీజేపీ కంటే జేడీయూ ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తూ వస్తోంది. అయితే ఈసారి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు కేటాయించే సీట్లు పోగా.. మిగతా సీట్లలో ఇరు పార్టీలు సమానంగా పోటీచేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఎల్‌జేపీకి 25, హెచ్‌ఏఎంకు ఏడు, ఆర్‌ఎల్‌ఎంకు ఆరు సీట్లు ఇస్తామని బీజేపీ, జేడీయూ ప్రతిపాదించినట్టు సమాచారం. ఎల్‌జేపీ ఎక్కువ సీట్లు ఇవ్వాలని కోరుతోందని, అదే జరిగితే హెచ్‌ఏఎం, ఆర్‌ఎల్‌ఎంల సీట్లకు కోతపడవచ్చని.. వాటికి రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ఆఫర్ చేయవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఎన్డీయే కూటమి మళ్లీ గెలిస్తే ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చని చర్చ కూడా జరుగుతోంది. నితీశ్‌కుమార్ కాకుండా బీజేపీ నేత సీఎం అయ్యే అవకాశాలూ ఉన్నాయని, అందులో భాగంగానే బీజేపీ, జేడీయూ సమానంగా సీట్లలో పోటీచేయాలనే నిర్ణయానికి వచ్చాయని కమలం వర్గాలు పేర్కొంటున్నాయి.

మహాఘట్‌బంధన్‌లో సీఎం గిరీకి పోటీ!

విపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో సీఎం అభ్యర్థి ఎవరనే అంశంతోపాటు సీట్ల పంపకాల విషయంలోనూ భేదాభిప్రాయాలు పొడసూపుతున్నాయి. కూటమి తరఫున తేజస్వియాదవ్ సీఎం అభ్యర్థి అని ఆర్జేడీ ధీమాగా ఉండగా, కాంగ్రెస్ ఇంకా దీనికి బహిరంగంగా అంగీకారమేదీ తెలపకపోవడంతో సందిగ్ధత నెలకొంది. దీనికితోడు మంగళవారం బిహార్ కాంగ్రెస్ నేత ఉదిత్‌రాజ్ చేసిన చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. "తేజస్వి యాదవ్ ఆర్జేడీ వాళ్లకు సీఎం అభ్యర్థి కావొచ్చు. కానీ కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనేది అంతా కలిసి నిర్ణయం తీసుకుంటారు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు దీటుగా నిలబడేది తేజస్వియాదవ్ మాత్రమేనని ఆర్జేడీ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ బహిరంగంగా ఆ పార్టీ తరఫున ఎవరూ దీనిపై స్పందించలేదు.

రాజకీయాల్లోకి మైథిలీ ఠాకూర్!



అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శబరిపై పాట పాడి, ప్రధాని మోదీ ప్రశంసలు పొందిన జానపద గాయని మైథిలీ ఠాకూర్‌ను బీజేపీ బిహార్ ఎన్నికల బరిలోకి దింపనుంది. ఇటీవల ఆమె బిహార్ బీజేపీ ఇన్‌చార్జి వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్‌లతో సమావేశమయ్యారు కూడా. దీనిపై మీడియా ఆమెను ప్రశ్నించగా.. ఎన్నికల్లో పోటీపై తుది నిర్ణయమేదీ రాలేదన్నారు. తన స్వస్థలం బిహార్‌లోని మధుబని జిల్లా బేణిపట్టికి వెళుతున్నానని.. ప్రజలను కలిసి, మాట్లాడాలని చెప్పారు.

ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ జట్టు?

జన సురాజ్ పార్టీతో తెరపైకి వచ్చిన ప్రశాంత్‌కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీ జట్టు కట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న ఎల్‌జేపీ ఈసారి ఎక్కువ సీట్ల కోసం డిమాండ్ చేస్తోంది. 25 సీట్లు ఇస్తామని బీజేపీ ప్రతిపాదించగా.. 40కిపైనే ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. రాష్ట్రంలోని ప్రతినియోజకవర్గంలో 20,25 వేల ఓట్లను తాము ప్రభావితం చేయగలమని.. తాము బయటికి వెళ్తే కూటమికి ఇబ్బందులు తప్పవని చిరాగ్ పాశ్వాన్ ఇప్పటికే స్పష్టంచేశారని ఎల్‌జేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సీట్ల లెక్కపై సయోధ్య కుదరలేదని.. ఎన్డీయే నుంచి ఎల్‌జేపీ బయటికి రావొచ్చని అంటున్నాయి. అదే జరిగితే ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ జట్టుకట్టి కూటమిగా ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

పెట్రోల్ వాహనాల ధరలకు
సమానంగా ఈవీలు!

» మరో 4-6 నెలల్లో అందుబాటులోకి..

» కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 7: మరో నాలుగు నుంచి ఆరు నెలల్లో దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) ధరలు పెట్రోల్ వాహనాల ధరలకు సమానం అవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటం దేశానికి ఆర్థికంగా పెను భారంగా మారుతోందని, ఏటా ఆ ఇంధనాల దిగుమతికి రూ.22 లక్షల కోట్ల వ్యయం అవుతోందన్నారు. పర్యావరణ పరంగానూ శిలాజ ఇంధనాలు తీవ్ర సమస్యగా మారాయని.. ఈ నేపథ్యంలో, దేశ పురోగతికి కాలుష్య రహిత ఇంధనాల వాడకం కీలకమని గడ్కరీ పేర్కొన్నారు. ఫిక్కీ 20వ ఉన్నతవిద్యా సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. వచ్చే ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ రంగాన్ని ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా మలచటం మన లక్ష్యమని గడ్కరీ ఉద్ఘాటించారు. తాను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.14 లక్షల కోట్లుగా ఉన్న దేశ వాహన రంగం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. అమెరికా వాహనరంగం విలువ రూ.78 లక్షల కోట్లు కాగా, చైనా వాహనరంగం విలువ రూ.47 లక్షల కోట్లని తెలిపారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయటం ద్వారా రైతులు సగటున రూ.45 వేల చొప్పున అదనంగా సంపాదించుకున్నారని గడ్కరీ పేర్కొన్నారు. వేరు పరిచిన ఘన వ్యర్థాలను 2027 నాటికి రోడ్ల నిర్మాణంలో పూర్తిగా వినియోగించే పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతే భారతదేశ ప్రధాన బలమని, వారికి తగిన నైపుణ్య శిక్షణ, విద్య అందిస్తే ప్రపంచంలో మనకు తిరుగు ఉండదని ఆయన చెప్పారు.

కనీస పింఛన్ రూ.2500!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. అయితే, దీన్ని రూ.7500కు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత 11ఏళ్లుగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్న కనీస నెలవారీ పింఛన్‌ను పెంచే అంశంపై ఈపీఎఫ్‌వో చర్చలు జరుపుతోంది. నెలవారీ పింఛన్‌ను రూ.2500కు పెంచనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 10, 11 తేదీల్లో బెంగళూరులో జరగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఇందులో పింఛను పెంపుతోపాటు సేవలను డిజిటలీకరణ చేసే ఈపీఎఫ్‌వో 3.0 విధానం, పరిపాలనా సంస్కరణలపైనా చర్చించనున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాలు పింఛన్‌ను రూ.7500కు పెంచాలని డిమాండ్ చేస్తుండగా.. ఈపీఎఫ్‌వో రూ.2500 చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. బెంగళూరులో జరిగే కీలక సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు సమావేశంలో పింఛను పెంపుపై నిర్ణయం తీసుకుంటే, దానికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కనీసం పదేళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్ పూర్తి చేసుకోవడంతో పాటు 58 ఏళ్లు నిండిన వారు ఈపీఎస్ కింద నెలవారీ పింఛనుకు అర్హులు.

వారి వివరాలు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళం నెలకొందని, దాన్ని తొలగించాలంటే కొత్తగా చేర్చిన పేర్లను వెల్లడించాలని కూడా స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం విచారణను కొనసాగించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ముఖ్యమని, ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను కూడా సంబంధిత కార్యాలయాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. కాగా, తుది జాబితాలో చేర్చిన పేర్లు చాలావరకు కొత్త ఓటర్లవేనని ఈసీ తరఫున న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు. తొలగించిన ఓటర్ల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆగస్టు 1న బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ఎస్ఐఆర్ అనంతరం వివిధ కారణాలతో 65 లక్షల పేర్లను తొలగించామని, రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.24 కోట్లుగా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 7.89 కోట్లుగా ఉంది. ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తొలగించిన ఓటర్ల వివరాలను వెల్లడించాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ సెప్టెంబరు 30న తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 21.53 లక్షల పేర్లను చేర్చగా.. 3.66 లక్షల పేర్లను తొలగించింది. దాంతో ముసాయిదా జాబితాలో కంటే ఓటర్ల సంఖ్య 17.87 లక్షలు పెరిగి.. 7.42 కోట్లకు చేరింది.

ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు!

మోదీ అరుదైన ఘనత



న్యూఢిల్లీ, అక్టోబరు 7: ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఘనత సాధించారు. ప్రభుత్వాధినేతగా పాతికేళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతున్నారు. 2001 అక్టోబరు 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2014 మే 22 వరకు ఆ పదవిలో ఉన్నారు. అదే నెల 26న ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన మోదీ 11 ఏళ్లకుపైబడి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంపై మంగళవారం ఆయన స్పందించారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు.. ఇంత గొప్పదేశం పురోగతిలో పాలుపంచుకోవడానికి నిరంతరాయంగా తాను కృషి చేస్తున్నానని 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. 2001లో ఇదే రోజు తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణం చేశాను. మొదట స్వరాష్ట్రంలో.. ఇప్పుడు దేశంలో మార్పులకు శ్రమిస్తున్నాను. సహచర భారతీయులు నిరాటంకంగా ఆశీర్వదిస్తున్నందుకు ధన్యవాదాలు. ప్రభుత్వాధినేతగా 25వ ఏట అడుగుపెడుతున్నాను. భారత ప్రజలకు కృతజ్ఞుడిని' అని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు 2013లో బీజేపీ తనను ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేసేనాటికి దేశం పాలన, విశ్వాస సంక్షోభంలో పడి ఉందని చెప్పారు. యూపీఏ హయాంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, విధాన పక్షవాతంతో విలవిలలాడిన భారత్.. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ, సామాజిక భద్రత పథకాలకు నెలవుగా మారిందన్నారు. 'దేశం స్వావలంబన సాధించేందుకు మన రైతులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. భారత్ అన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధించేందుకు (ఆత్మనిర్భర భారత్) ప్రభుత్వం విస్తృత సంస్కరణలు చేపడుతోంది. 'ఇది స్వదేశీ వస్తువని గర్వంగా చెప్పండి' అన్న నినాదంలో అవి ప్రతిబింబిస్తున్నాయి. 11 ఏళ్లుగా భారత ప్రజలందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఎన్నో పరివర్తనలు తీసుకొచ్చాం. విప్లవాత్మక చర్యలతో దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను.. ముఖ్యంగా నారీశక్తి, యువ శక్తి, అన్నదాతలను సాధికారత దిశగా నడిపిస్తున్నాం. 25 కోట్ల మందికిపైగా ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేశాం. ప్రధాన ప్రపంచ ఆర్థిక శక్తుల నడుమ చోటు సంపాదించాం' అని మోదీ వివరించారు. క్లిష్ట సమయంలో గుజరాత్ సీఎంగా తాను నియమితుడినయ్యానని గుర్తుచేసుకున్నారు. నాడు భారీ భూకంపంతో రాష్ట్రం కుదేలైందని.. పెను తుఫాను, అంతకుముందు వరుస కరువులు, రాజకీయ అస్థిరతతో ప్రజలు బాధలు పడుతున్నారని.. ఈ సవాళ్లు ప్రజాసేవ, గుజరాత్‌ను పునర్నిర్మించాలన్న తన సంకల్పాన్ని బలోపేతం చేశాయని తెలిపారు.

క్వాంటమ్ టెక్నాలజీపై పరిశోధనకు
భౌతికశాస్త్ర నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

గోడలాంటిది ఉంటే.. ఆ కణం దాన్ని దాటి వెళ్లలేదు. కానీ క్వాంటమ్ మెకానిక్స్ ప్రకారం.. కణం ఆ అడ్డంకిని కూడా దాటి వెళ్లగలదు. అలా వెళ్లడాన్నే 'క్వాంటమ్ టన్నెలింగ్' అంటారు. అయితే ఒకటికిమించిన అణువులు ఉన్నప్పుడు అలా వెళ్లలేవు (అంటే ఎక్కువ అణువులుంటే క్వాంటమ్ ప్రభావాలు కనపడవు). గరిష్ఠంగా ఎంత పరిమాణం వరకూ ఈ క్వాంటమ్ ప్రభావాలు కనపడతాయనే అంశంపై క్లార్క్, మైకేల్, మార్టినిస్ చేసిన పరిశోధనలకే నోబెల్ కమిటీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ప్రత్యేకమైన సర్క్యూట్ల సహాయంతో.. పెద్ద సంఖ్యలో కణాలు ఉన్నప్పటికీ, వాటి క్వాంటమ్ లక్షణాలు బయటపడతాయని 1984-85లో నిర్వహించిన ప్రయోగాల ద్వారా వారు నిరూపించారు. తమ ప్రయోగాల్లో భాగంగా వారు సూపర్‌కండక్టర్లతో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను అభివృద్ధి చేశారు (సూపర్ కండక్టర్లంటే విద్యుత్తు ఏ అడ్డంకీ లేకుండా సులభంగా ప్రవహించే పదార్థం). ఆ సర్క్యూట్‌లో సూపర్ కండక్టర్ల మధ్య అత్యంత పలుచనైన ఇన్సులేటర్ పొర (నాన్ కండక్టివ్ మెటీరియల్)ను పెట్టారు. దీన్ని 'జోసెఫ్‌సన్ జంక్షన్'గా వ్యవహరిస్తారు. అనంతరం ఆ సర్క్యూట్‌లోకి విద్యుత్తును ప్రవహింపజేయగా.. ఎలక్ట్రాన్‌లన్నీ విడివిడిగా కాకుండా ఒక సమూహంలా కదలడాన్ని గమనించారు. అంటే.. దేనికదే విడివిడిగా ఉండాల్సిన ఎలక్ట్రాన్లన్నీ ఒక్క పెద్ద కణంలా ప్రవర్తించాయన్నమాట. మనం వాడే సాధారణ కంప్యూటర్లలో ఉండే బిట్‌లకు భిన్నంగా.. క్వాంటమ్ కంప్యూటర్లలో 'క్విబిట్'లు ఉంటాయి. ఒక బిట్ అంటే.. 0 లేదా 1లో ఏదో ఒకటి మాత్రమే. కానీ క్విబిట్ ఒకే సమయంలో సున్నాగానూ, ఒకటిగానూ ఉండగలదు. అలాంటి క్విబిట్లను తయారుచేయడం జోసెఫ్‌సన్ జంక్షన్ వల్ల సాధ్యమవుతుంది. సూపర్‌కండక్టింగ్ సర్క్యూట్లను జోసెఫ్‌సన్ జంక్షన్‌తో నిర్మిస్తే అవి క్విబిట్లుగా ప్రవర్తిస్తాయి. ఇలా తయారుచేసిన క్విబిట్లతో శాస్త్రవేత్తలు క్వాంటమ్ ఆపరేషన్లు చేయగలిగారు. భవిష్యత్తులో ఇలాంటి క్విబిట్లను వందల సంఖ్యలో తయారుచేసి పెద్ద క్వాంటమ్ ప్రాసెసర్లను నిర్మించవచ్చు. ప్రస్తుతం గూగుల్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటివి తయారుచేస్తున్న క్వాంటమ్ కంప్యూటర్లకు గుండె ఈ జోసెఫ్‌సన్ జంక్షన్‌లే. ఉదాహరణకు.. గూగుల్ 2019లో సికమోర్ అనే క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారుచేసింది. ఆ చిప్‌లో మొత్తం 54 క్విబిట్లు ఉన్నాయి. వాటిలో 53 క్విబిట్లను ఉపయోగించి.. అత్యంత క్లిష్టమైన గణిత సమస్యను 200 సెకన్లలో పరిష్కరించారు.

పప్పు దినుసుల
ట్రేడర్లపై ఐటీ దాడులు

» తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల సోదాలు

» రూ.300 కోట్ల పన్ను ఎగవేత ఆరోపణలు

హైదరాబాద్, అలంపూరు చౌరస్తా, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పప్పు దినుసుల ట్రేడింగ్‌లో దాదాపు రూ.300 కోట్లకు పైగా పన్ను ఎగవేతకు పాల్పడ్డారన్న ఆరోపణలపై హైదరాబాద్‌లోని ఆదాయం పన్ను(ఐటీ) శాఖ ఇన్వెస్టిగేషన్ వింగ్ అధికారులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 25 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, కర్నూలు, విజయవాడ, కర్నూలులోని పలువురు వ్యాపారులు, హిందుస్థాన్ ట్రేడర్స్, వి కేర్ గ్రూపు కంపెనీల యజమానులు, వారి కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. 2022 నుంచి ఈ ట్రేడింగ్ కంపెనీలవారు ముఖ్యంగా కందిపప్పు అమ్మకాల లెక్కలు చూపించడంలో విఫలమయ్యారని, గిడ్డంగుల్లో ఉన్న సరుకు, ప్రభుత్వ నిత్యావసర వస్తువుల పంపిణీ పథకానికి ఇచ్చిన పప్పులకు సంబంధించిన లెక్కల్లో గోల్‌మాల్ జరిగిందని ఆదాయం పన్ను శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా ఏపీలో గత ప్రభుత్వ హయాంలో ఈ దాల్ ట్రేడర్స్ పెద్ద ఎత్తున బహిరంగ విక్రయాలు జరిపారని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇది జరిగిందనే అనుమానాలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో పౌర సరఫరాల శాఖ కోసమంటూ కందిపప్పు ఆర్డర్లు తీసుకుని ఆ మొత్తాన్ని సేకరించి గిడ్డంగుల్లో దాచి, ప్రభుత్వానికి సరఫరా చేయకుండా బయట అమ్ముకున్నారనే ఆరోపణలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఎస్వీ జూపార్కులో జాగ్వార్ కుశ మృతి



మంగళం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో కుశ అనే మగ జాగ్వార్ మంగళవారం మృతి చెందినట్లు జూక్యూరేటర్ సెల్వం తెలిపారు. 'కుశను 2019లో హైదరాబాద్ నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి తీసుకొచ్చాం. దీని వయసు 15 సంవత్సరాల మూడు నెలలు. ఎప్పటిలాగే ఆవరణలోకి ఈ జాగ్వార్‌ను పెట్టగా ఒక చెట్టుకు చిక్కుకొని చనిపోయి కనిపించింది' అని ఆయన వివరించారు. కుశ మృతికి హైపర్ వాల్మిక్ షాక్, ఆస్ఫీజియా కారణమని ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజిస్టులు పోస్టుమార్టం నివేదికలో పేర్కొన్నారు.

క్వారీలో పిడుగుపడి ముగ్గురు కార్మికుల మృతి

మెళియాపుట్టి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం గంగరాజపురం పంచాయతీ పరిధిలోని రాజీయోగ్ గ్రానైట్ క్వారీలో మంగళవారం సాయంత్రం పిడుగుపడి ముగ్గురు మృతి చెందగా మరో నలుగురికి గాయాలు అయ్యాయి. మృతుల్లో బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రావణ్‌కుమార్(45), రాజస్థాన్ రాష్ట్రం జాగూర్ జిల్లా ముఖన గ్రామానికి చెందిన హేమరాజ్ (25), మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పింటు(30) ఉన్నారు. గాయపడిన మరో నలుగురు కార్మికులను టెక్కలి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ బి.పాపారావు, సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ మధుసూదనరావు పరిశీలించారు. టెక్కలి ఆసుపత్రిలో క్షతగాత్రులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో కృష్ణమూర్తి పరామర్శించారు.



అశేష భక్త జనం నడుమ సాగుతున్న సిరిమానోత్సవం

వైభవంగా సిరిమానోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

విజయనగరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, విజయనగరం పైడిమాంబ సిరిమానోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. విజయనగరంతో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉత్సవాన్ని తిలకించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. హోంశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. వీరి వెంట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి చదురు గుడి నుంచి ప్రారంభమైన సిరిమాను.. కోట వరకు మూడు పర్యాయాలు తిరిగింది. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమాను అధిరోహించి రాజ కుటుంబీకులు, భక్త జనాన్ని ఆశీర్వదించారు. కోట బురుజుపై ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు దంపతులు, ఆయన కుమార్తె.. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఆనంద గజపతిరాజు సతీమణి సుధా గజపతిరాజు, కుమార్తె ఊర్మిళ గజపతిరాజు తదితరులు సిరిమానోత్సవాన్ని ఆసక్తిగా తిలకించారు.

కుంగిన బొత్స వేదిక

పైడిమాంబ సిరిమానోత్సవాన్ని తిలకిస్తుండగా పాత కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులు కూర్చున్న వేదిక కుంగిపోయింది. వేదిక మీద ఎక్కువమంది కూర్చోవడంతో పాటు వర్షం కారణంగా బల్లలు కుంగిపోయాయి. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ అశోక్‌తో పాటు, మరో చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి.

ఆలయాల విధ్వంసం కేసులు
పునర్విచారణ చేయిస్తాం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా 1000 ఆలయాలకు నిధులు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం

వైసీపీ హయాంలో హిందూ దేవాలయాల విధ్వంసం కేసులను పునర్విచారణ చేస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఇందుకు బాధ్యులైన వారికి చట్ట ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ హయాంలో ఇలాంటి ఘటనలు మూడు వందలకు పైగా జరిగాయన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి కట్టుబడి ఉన్నామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో దళిత, గిరిజన, బహుజన వాడల్లో 1000 ఆలయాలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. అలాగే దీనావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విజయనగరం పైడిమాంబ ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

12 రోజుల్లో 8.90 లక్షల మందికి శ్రీవారి దర్శనం



రింగురోడ్డులోని సర్వదర్శన క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెరిగిన రద్దీ కొనసాగుతూనే ఉంది. ప్రతిరోజు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోతున్నాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్, బాట గంగమ్మ సర్కిల్, ఆక్టోపస్ భవనం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు క్యూ వ్యాపిస్తోంది. రద్దీ రోజుల్లో అర్ధరాత్రి దాటాక భక్తులు క్యూలైన్‌లోకి చేరి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత బాటగంగమ్మ ఆలయ సర్కిల్ సమీపంలోని క్యూలైన్‌కు తాళం వేసి.. అర్ధరాత్రి తర్వాత భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత క్యూలైన్ వద్దకు వచ్చే భక్తులు అర్ధరాత్రి వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక, క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులకు 14 నుంచి 20 గంటల దర్శన సమయం పడుతోంది. కాగా, గత నెల సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 7వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు.. 12 రోజుల్లో 8,90,500 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గడిచిన 11 రోజుల్లో రూ.37.32 కోట్ల హుండీ ఆదాయం లభించగా, 3,33,234 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

20న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 20న దీపావళి ఆస్థానం జరుగనుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామి సహస్ర దీపాలంకార సేవలో పాల్గొని నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతారు. దీపావళి ఆస్థానం నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

తిప్పేస్వామి.. తప్పు సామీ..!

- చైర్ పర్సన్ పదవికి రూ.25 లక్షలు తీసుకున్నారు
- అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు 75వేలు లాగేశారు
- పదవీ దక్కలేదు.. డబ్బులూ వెనక్కి ఇవ్వడంలేదు
- మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి మోసగించారు
- వైసీపీ డిజిటల్ బుక్‌లో ఆ పార్టీ నేతల ఫిర్యాదులు



తిప్పేస్వామి

మడకశిర, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఎవరు వేధించినా ఫిర్యాదు చేయాలని వైసీపీ అధినేత జగన్ ప్రారంభించిన డిజిటల్ బుక్‌లో ఆ పార్టీ నేతలపైనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిపై మంగళవారం ఇద్దరు వైసీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన కుమార్తె ప్రియాంకకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తానని రూ.25 లక్షలు తీసుకుని అప్పటి ఎమ్మెల్యే తిప్పేస్వామి మోసగించారని వైసీపీ నాయకుడు విక్రమ్ డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేశారు. ఆ పదవి ఇతరులకు ఇచ్చారని, తొలిసారి అవకాశం రాలేదని, రెండోసారి (సగం పదవీకాలం) ఇస్తామని నమ్మబలికారని ఆరోపించారు. తాము ఇచ్చిన డబ్బులు వెనక్కి అడిగితే పార్టీ కోసం ఖర్చు పెట్టానని బుకాయిస్తున్నారని వాపోయారు. ఒకసారి రూ.10 లక్షలు, మరోసారి రూ.15 లక్షలు ఇచ్చానని బాధితుడు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పుల్లో ఉన్నానని, తన డబ్బులు తిరిగి ఇప్పించాలని పార్టీ అధినేతకు విన్నవించారు. కాగా, జగన్ దినపత్రికలో గతంలో పనిచేసిన విలేకరి కామరాజు కూడా తిప్పేస్వామికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. అగళి మండలం దొక్కలపల్లిలో తన మరదలికి అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగం ఇచ్చేందుకు తిప్పేస్వామి తన వద్ద రూ.75వేలు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తరువాత ఆమెకు ఉద్యోగోన్నతి అవకాశం వచ్చిందని, దానికి రూ.5 లక్షలు ఇవ్వాలని బేరం పెట్టారని తెలిపారు. డబ్బు ఇవ్వకపోతే కొత్తవారికి అవకాశం ఇస్తానని బెదిరించారని, తాను అంత మొత్తం ఇవ్వలేనని చెప్పినా వినిపించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బేరసారాలపై ఆడియో, వీడియో రికార్డు చేశానని, విషయాన్ని బయటి వ్యక్తులకు చెప్పినందుకు తనను ఉద్యోగం నుంచి తీసేయించారని వాపోయారు. తన డబ్బులు నేటికీ తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. డిజిటల్ బుక్‌లో సొంత పార్టీ నాయకుడిపైనే ఫిర్యాదులు రావడంతో వైసీపీ నేతలు ఇరకాటంలో పడ్డారు.

'ఈ-పంట' నమోదు లక్ష్యాన్ని సాధించాలి

- 25వ తేదీలోపు పూర్తి చేయాలి: వ్యవసాయ స్పెషల్ సీఎస్


అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ, వ్యవసాయ, పథకాలు, జాతీయ స్థూల విలువ లెక్కింపునకు డిజిటల్ పంటల సర్వే డేటా మూలాధారమైనందున ఈ-పంట నమోదు ద్వారా కచ్చితమైన సమాచారం సేకరించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. ఈ-పంట నమోదుపై జిల్లా, మండల వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళిక, గణాంక శాఖ అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 100 ల్యాండ్ పార్శిల్స్ (భూకమతాలు)ను ఈ నెల 25లోపు ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో 2,90,89,048 భూ కమతాల్లో ఇప్పటికి 1,06,73,636 నమోదుకాగా, సగటున 37% పూర్తైందని చెప్పారు. గడువులోపు రోజుకు 12,27,694 భూకమతాలను నమోదు చేసి, లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ నోటిఫైడ్ పంటలకు కూడా ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ భూకమతాల నమోదుకు రూ.10 ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం బకాయిల కోసం రూ.వెయ్యి కోట్ల రుణం

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులకు బకాయిలు చెల్లించడానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) నుంచి రూ.1,000కోట్ల అదనపు రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సొమ్మును పౌర సరఫరాల సంస్థకు ఇంటర్ కార్పొరేట్ లోన్‌గా బదిలీ చేయనున్నారు. 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం అమ్మిన రైతులకు పౌర సరఫరాల సంస్థ బకాయిలు చెల్లించనున్నది. ధాన్యం సేకరణ కోసం రూ.7,609 కోట్ల రుణం పొందేందుకు ఇప్పటికే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు గ్యారెంటీ ఇచ్చింది. ఈ అదనపు రుణం పొందేందుకు ఇటీవల రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

నెల్లూరులో జంట హత్యల కలకలం

- విచక్షణారహితంగా కొట్టి.. కాలువలో పడేసిన ఆగంతకులు
- స్థానికుల సమాచారంతో మృతదేహాల వెలికితీత



జాఫర్‌సాహెబ్ కాలువ నుంచి మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో మంగళవారం జంట హత్యలు వెలుగు చూశాయి. పోలీసుల కథనం మేరకు.. పెన్నా బ్యారేజీ సమీపంలో తిక్కన పార్కు ఎదుట రక్తం ధారలుగా ఉందని, జాఫర్ కాలువలో ఓ మృతదేహం ఉన్నట్టు నెల్లూరు నగరంలోని సంతపేట పోలీసులకు మంగళవారం ఉదయం ఫోన్ వచ్చింది. వెంటనే ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి జాఫర్ సాహెబ్ కాలువలోని మృతదేహాన్ని వెలికి తీశారు. అదే కాలువలో వంద మీటర్ల రూపంలో మరో మృతదేహాన్ని పోలీసులు గుర్తించి బయటకు తీశారు. మృతుల్లో ఒకరు బాపట్ల ప్రాంతానికి చెందిన సంచార జీవి ఎం.పోలయ్యగా గుర్తించారు. తన రెండవ భార్య లక్ష్మితో కలిసి పెన్నా నదిలో ఓ చిన్న గుడారం వేసుకొని పోలయ్య జీవిస్తున్నాడు. మరో మృతుడిని కూడా సంచార జీవి శివగా పోలీసులు గుర్తించారు. పెన్నా నదిలో చేపలు పట్టుకునే వారిని ఇంత కిరాతకంగా హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఉండే స్థానికులు మాత్రం నదిలో గంజాయి సేవించే వారే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని, గంజాయి మత్తు లో చేపల వేటకు వెళుతున్న వారిపై దాడి చేసి హత్య చేసి ఉంటారని చెబుతున్నారు. మరోవైపు దాడి చేసిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా పనిచేయట్లేదు. ఐదుగురికిపైగా ఈ దారుణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

కులగణన తరువాతే స్థానిక ఎన్నికలు : సీపీఐ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కులగణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని... బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కులగణన జరిగితే కులాల వారీగా జనాభా, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని, తద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని చెప్పారు.

16న శ్రీశైలానికి ప్రధాని మోదీ

- భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష
- హెలీప్యాడ్, శివాజీ స్ఫూర్తి కేంద్రం పరిశీలన
- ప్రధాని రాకతో శ్రీశైలానికి మరింత వైభవం: పీవీఎన్ మాధవ్

శ్రీశైలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైలం పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రధాని పర్యటన స్పెషల్ అధికారి వీరపాండియన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు, పోలీసు ఉన్నతాధికారులు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సున్నిపెంట హెలీప్యాడ్ పరిసరాలను, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడినుంచి మల్లికార్జునస్వామి ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్దకు చేరుకుని ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపైనా ఆరా తీశారు. మోదీ సున్నిపెంట హెలీప్యాడ్ నుంచి రోడ్డుమార్గాన శ్రీశైలానికి రానున్నారు. దీంతో ఈ రహదారికి మరమ్మతులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవనంలో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా, ప్రధాని మోదీ పర్యటనతో శ్రీశైలం వైభవం మరింత పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మంగళవారం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ తొలిసారి ఇక్కడి జ్యోతిర్లింగ క్షేత్రానికి వస్తున్నారని, ఆయన రాకతో ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జీవశాస్త్రంలో విప్లవాల గురించి తర్కిస్తూ 'ఏదైనా కొత్త విప్లవం స్వభావం ఎలా ఉంటుందని ఒకరు ముందుగా ఊహించలేరు. అయితే అవగాహన కొరవడిన శాస్త్ర అంశాలను అర్థం చేసుకోవడంలో మౌలిక మార్పు తప్పకుండా వస్తుందని ఆశించగలం' అని 1960లో వైద్య, శరీర ధర్మ శాస్త్రాలలో నోబెల్ పురస్కార గ్రహీత పీటర్ మెడావర్ అన్నారు. 2025 నోబెల్ పురస్కారానికి సంయుక్తంగా ఎంపిక అయిన షిమోన్ సకగుచి, మేరీ బ్రంకో, ఫ్రెడ్ రామ్స్ డెల్ మూడు దశాబ్దాల పరిశోధన జీవశాస్త్రంలో విప్లవాన్ని కాకపోయినప్పటికీ రోగ నిరోధక వ్యవస్థను అర్థం చేసుకోవడంలో మౌలిక మార్పును తీసుకువచ్చింది.

రోగనిరోధక వ్యవస్థను జీవ పరిణామ ఉత్కృష్ట కళాకృతిగా భావిస్తారు. నిత్యం మన దేహాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుండే సంఖ్యానేక వైరస్‌లు, బేక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల నుంచి రోగనిరోధక వ్యవస్థ మనలను రక్షిస్తూ ఉంటుంది. జీవితం ఒక వరమైతే, మనకు దాన్ని సుసాధ్యం చేస్తోంది రోగ నిరోధక వ్యవస్థే. ఈ జైవిక వ్యవస్థ అద్భుతాలలో ఒకటి రోగకారక సూక్ష్మజీవులను, గుర్తించి, ఇతర కణాల నుంచి వాటిని వేరుచేయగల సామర్థ్యం. మన శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మజీవులు వేర్వేరు రూపాలలో ఉంటాయి. మానవ కణాలతో సాదృశ్య రూపును నిగూఢంగా సంతరించుకుంటాయి. రోగనిరోధక వ్యవస్థ వ్యాధి కారకాలపై దాడి ఎలా చేయగలుగుతుంది? అదే సమయంలో ఆరోగ్యకరమైన మన జీవకణాలను ఎలా రక్షించగలుగుతుంది? ఈ భక్షణ, రక్షణ చర్యల మధ్య సమతౌల్యత ఉండేలా వ్యవహరిస్తుంది కాబట్టే రోగనిరోధక వ్యవస్థను జీవ పరిణామం సృష్టించిన అద్భుత కళాకృతిగా అభివర్ణిస్తారు. అయితే ఈ అద్భుతం ఎలా జరుగుతుందనే విషయమై జీవశాస్త్రవేత్తలు దశాబ్దాలుగా అధ్యయనం

రక్షణ కవచం

చేస్తున్నారు. ఎట్టకేలకు ఈ పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించిన ఘనత ఈ ఏడాది వైద్యశాస్త్ర నోబెల్ పురస్కార విజేతలకు దక్కింది.

రోగ నిరోధక వ్యవస్థలోని టి సెల్స్ అనబడే తెల్ల రక్తకణాలు రోగ కారక క్రిముల కణాలు, ఆతిథేయి దేహ కణాల మధ్య తేడాను గుర్తించగలుగుతాయి. షిమోన్ సకగుచి 1995లో అంతకు ముందు ఎవరికీ తెలియని ఒక కొత్త రోగ నిరోధక కణాలను కనుగొన్నారు. ఆయన వాటిని నియంత్రిత టి కణాలుగా పిలిచారు. ఇవి, శరీరంపై దాడి చేయగలిగే రోగ నిరోధక వ్యవస్థలోని కొన్ని భాగాలను తొలగించే సంరక్షణ కణాలు. 2001లో బ్రంకో, రామ్స్‌డెల్‌లు వేర్వేరు ప్రయోగ శాలల్లో స్వతంత్రంగా పనిచేస్తూ సకగుచి కనుగొన్న కణాలకు జన్యు ప్రాతిపదికలను ఆవిష్కరించారు. ఆ జన్యు ప్రాతిపదికలే తాను కనుగొన్న నియంత్రిత టి కణాలను నియంత్రిస్తాయని షిమోన్ సకగుచి నిర్ధారించారు. ఈ ముగ్గురి పరిశోధనలు రోగ నిరోధక వ్యవస్థ స్వరూపస్వభావాలను వినూత్నంగా, సమగ్రంగా అర్థం చేసుకునేందుకు విశేషంగా దోహదం చేశాయి. ఒక జీవిలోని రోగ నిరోధక కణాలు ఇతర కణాలను అన్యమైనవిగా, హానికరమైనవిగా గుర్తించకుండా, వాటితో సామరస్యంగా జీవించే ఒక సహజ ప్రక్రియ 'పరిధీయ సహనం' (పెరిఫెరల్ టాలరెన్స్)ను ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు వివరించారు. తద్వారా అప్పటి వరకు ఒక అమూర్త ఊహగా మాత్రమే ఉన్న రోగ నిరోధక సంయమనాన్ని అణు జీవశాస్త్ర భావనగా రూపొందించారు.

వైద్య, శరీర ధర్మశాస్త్రాలలో నోబెల్ పురస్కారం మొదటి నుంచీ మానవ ఆరోగ్యం, జైవిక వ్యవస్థల గురించిన అవగాహనను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్న ఆవిష్కరణలకు గుర్తింపుగా కీర్తికెక్కింది. 2025 పురస్కారం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. కేన్సర్ చికిత్సలో ఇమ్యూనో థెరపీ, టార్గెటెడ్ థెరపీ మొదలైన వినూత్న చికిత్సలకు సకగుచి, బ్రంకో, రామ్స్ డెల్ పరిశోధనలు పునాదులు వేశాయి. అలాగే అవయవాల మార్పిడి ప్రక్రియలలో మార్పులకు కూడా అవి దోహదం చేశాయి. 'విజ్ఞానశాస్త్రం ప్రపంచాన్ని వివరించడమే కాకుండా మానవ జీవితాలను మార్చివేస్తుందని 2025 నోబెల్ వైద్యశాస్త్ర పురస్కారం మనకు స్పష్టం చేసిందన్న ఒక విజ్ఞుని వ్యాఖ్య పూర్తి సత్యం.

జాతి సంస్కారానికి భావోద్వేగాల కళంకం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కొన్ని సంఘటనలు యాదృచ్ఛికంగా జరగవు. అదే సమయంలో ఫలానా సంఘటన వెనుక కొన్ని ప్రేరేపిత శక్తులున్నాయని కూడా చెప్పడం సరైనది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించిన సంఘటనకు కూడా ఇదే వర్తిస్తుంది. భారత దేశంలో ఎలాంటి భావోద్వేగ పరిస్థితులు నెలకొన్నాయో, ప్రజలు ఏ మనోభావాలకు ప్రేరితులవుతున్నారో చెప్పేందుకు ఇది ఉదాహరణ. అంతే కాదు, మీడియా ఒక వ్యాఖ్యను సమగ్రంగా ప్రసారం చేసేందుకు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఏం జరుగుతుందో కూడా ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేనప్పుడు, దేశంలో ఉన్న ప్రజాస్వామిక సంస్కృతి, దాని చరిత్ర గురించి అవగాహన లేనప్పుడు, భారత రాజ్యాంగం స్ఫూర్తిని జీర్ణించుకోలేనప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్నది. కొన్ని వందల సంవత్సరాల పాటు అనేక శక్తులతో పోరాడిన తర్వాత దేశానికి ప్రజాస్వామిక వ్యవస్థ లభించింది. అనేక మంది మేధావులు చర్చించిన తర్వాత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. రాజ్యాంగంలోని ప్రగతిశీల అంశాల ఆధారంగానే కాలం చెల్లిన దురాచారాల్ని, అన్యాయాల్ని అనేకం మనం వదుల్చుకోగలిగాం. నిజానికి మతాల్లోని దుర్మార్గాలను కూడా తొలగించుకుని కాలానికి తగ్గట్లుగా మార్చుకునేందుకు కూడా రాజ్యాంగ వ్యవస్థలే దోహదం చేశాయి. అందువల్లే మనం సంప్రదాయాల్ని పాటించినా ఆధునిక జీవన విధానాలను అనుసరిస్తున్నాం. నాయకులు రాజకీయ ప్రయోజనాలు ఆశించి కాలాన్ని వెనక్కి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు కానీ రాజ్యాంగం ప్రగతిశీలంగానే ఉంటుంది. అంతే కాదు, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైనప్పటికీ అనేక దేశాల మాదిరి మన దేశంలో అల్లకల్లోలాలు, అస్థిరత ఏర్పడలేదంటే ఇది కొన్ని వేల శతాబ్దాలుగా మనం రూపొందించుకున్న వ్యవస్థలు ఎప్పటికప్పుడూ మారుతూ పరిపక్వంగా రూపొందుతున్నాయనే అర్థం. మన సంప్రదాయం సహనాన్ని బోధిస్తుంది. మన తత్వశాస్త్రం సహనాన్ని బోధిస్తుంది. మన రాజ్యాంగం సహనాన్ని ఆచరిస్తుంది. దీన్ని పలుచన చేయవద్దు.. అని జస్టిస్ చిన్నప్పరెడ్డి అన్నారు. ఎందుకో కానీ దేశంలో అసహనం విపరీతంగా పెరిగిపోతున్నదని కొన్ని సంఘటనలు నిరూపిస్తున్నాయి.

మన దేశానికి ప్రజాస్వామ్యం కొత్తది కాదని, బుద్ధుడి కాలంలోనే సంఘాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాలను పాటించాయని అంబేడ్కర్ రాజ్యాంగ సభలో చెప్పారు. తమిళనాడులో కంజీవరం సమీపంలోని గ్రామాల్లో అనేక ఆలయాల గోడలపై బ్యాలెట్ బాక్స్ బ్యాలెట్ పేపర్‌ల గురించి ప్రస్తావన ఉన్నదని టంగుటూరి ప్రకాశం కూడా రాజ్యాంగ సభలో తెలిపారు. ఆధునిక ప్రజాస్వామ్య పద్ధతులు దేశానికి కొత్త కాదని అన్నారు. నిజానికి జనసంఘ్ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రజాస్వామ్యం సహజంగా ఇమిడిపోయినందువల్లే దేశం ఇంత సజావుగా నడుస్తోందని అభిప్రాయపడ్డారు. వేదిక్ సభలు, సమితిలు ప్రజాస్వామ్యయుతంగా జరిగేవని ఆయన చెప్పారు. దేశ సమైక్యతకు ప్రజాస్వామ్యం ఒక సమర్థమైన సాధనమని దీనదయాళ్ చెప్పారు. కాని ఈ ప్రజాస్వామిక స్ఫూర్తి రోజురోజుకూ తగ్గిపోతోందా?

నిజానికి జస్టిస్ గవాయ్ ఎక్కడా ఒక మతాన్ని విమర్శించినట్లు దాఖలాలు లేవు. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో శిల్ప కళాఖండాలలో భాగమైన జవారీ ఆలయంలో ఏడు అడుగుల ఖండిత విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలని దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలను పూర్తిగా ఉటంకించనందువల్లే ఈ వివాదం తలెత్తింది. ఈ విగ్రహాన్ని మళ్లీ యథాతథంగా పునర్నిర్మించి ప్రాణప్రతిష్ఠ చేయాలని రాకేశ్ దలాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకూ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకూ వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. చివరకు సుప్రీంకోర్టు తలుపు కూడా తట్టారు. 'ఇది ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలోనిది. అలాంటిది ఆ సంస్థ అనుమతిస్తుందో లేదో తెలియదు. అందులో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సెప్టెంబర్ 16న స్పష్టంగా చెప్పారు. అంతటితో ఊరుకోకుండా 'వెళ్లి మీ దేవుడినే ఏమైనా చేయమని అడగండి.. మీరు విష్ణు భగవానుడి పరమభక్తుడైతే ఆయననే ప్రార్థించి ధ్యానం చేయండి.. లేకపోతే ఖజురాహోలో అతి పెద్ద శివలింగం ఉన్నది కదా.. మీరు శైవమతానికి వ్యతిరేకం కాకపోతే అక్కడకు వెళ్లి ప్రార్థన చేయొచ్చు' అని సలహా ఇచ్చారు. గవాయ్ మనస్ఫూర్తిగానే ఈ సలహా ఇచ్చి ఉండవచ్చు. ఖజురహో నిజానికి ఒక తత్వానికి కట్టుబడి ఉన్నది కాదు. అక్కడి శిల్పాల్లో వైష్ణవం, శైవంతో పాటు, జీవితంలో ఇమిడిపోయిన ప్రేమ, ప్రకృతి, కామం, స్వలింగ సంపర్కం, తంత్ర మొదలైనవన్నీ మిళితమై ఉంటాయి. మొత్తం భారతీయ జీవన విధానం, సంస్కృతి, స్వేచ్ఛలకు అది ప్రతిబింబం. దట్టమైన అడవుల్లో మునిగిపోయిన ఈ అమూల్యమైన శిల్పసంపద గురించి మనకు బ్రిటిష్ వారే తెలిపారు. మతపరమైన భావోద్వేగాల కంటే మన భారతీయ సంస్కృతిలోని ఔన్నత్యానికి మనం ప్రాధాన్యత నీయాల్సిన అవసరం ఉన్నది.

> **మతపరమైన భావావేశాల కంటే భారతీయ సంస్కృతిలోని ఔన్నత్యానికి మనం ప్రాధాన్యత నీయాల్సిన అవసరం ఉన్నది. రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారంలో ఉన్నవారిపై లేదా?**



నిజానికి గవాయ్ వ్యాఖ్యలు సంచలనం కావాల్సిన అవసరం లేదు. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు. అయోధ్య కేసులో విచారణ జరుగుతున్నప్పుడు శ్రీరాముడు కచ్చితంగా ఎక్కడ పుట్టారో చెప్పగలరా? రఘువంశానికి చెందినవారెవరైనా అక్కడున్నారా? ఆ ప్రాంతానికి దైవత్వం ఎందుకు ఆపాదిస్తున్నారు? అన్న ప్రశ్నలు వేశారు కాని అప్పుడెవరూ న్యాయమూర్తులను నిందించలేదు. శబరిమల కేసులో సుప్రీంకోర్టు భక్తి శ్రద్ధల విషయంలో లింగవివక్ష కూడదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎన్నో వాద వివాదాలు జరిగాయి. నాడు జస్టిస్ గొగోయ్, జస్టిస్ దీపక్ మిశ్రాలపై ఎవరూ దాడి చేయలేదు. కాని ఇప్పుడెందుకు గవాయ్‌పై దాడి జరిగింది? ఆయన దళితుడైనందుకా అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. జస్టిస్ గవాయ్ సాధారణ నేపథ్యం ఉన్న వ్యక్తి కాదు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ అంబేడ్కర్‌తో పాటు బౌద్ధమతాన్ని స్వీకరించిన వేలాది మందిలో ఒకరు. జస్టిస్ గవాయ్ కూడా బౌద్ధ మతస్థుడే. నిజానికి బుద్ధుడిని కూడా దశావతారాల్లో ఒకరిగా హిందూమతం స్వీకరించింది.

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు చేసిన రోజునుంచే సోషల్ మీడియాలో ఆయనపై దాడులు మొదలయ్యాయి. నిజానికి ఆయన మాటల్ని ఎవరూ పూర్తిగా ఉటంకించలేదు. ప్రధాన న్యాయమూర్తి హిందూ మనోభావాలను దెబ్బతీశారని, సీజేఐ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఒక న్యాయవాది ఆయనకు లేఖ కూడా రాశారు. ఇలాంటి వ్యాఖ్యలు హిందూయేతర మతాలపై ఆయన చేయగలరా? అని ప్రశ్నించిన వారూ ఉన్నారు. విషయంలోని తీవ్రతను గ్రహించిన జస్టిస్ గవాయ్ తన మాటలకు సెప్టెంబర్ 18న కోర్టులోనే వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తన మాటలను వక్రీకరించారని, తాను అన్ని మతాలనూ గౌరవిస్తానని చెప్పారు. కోర్టులోనే ఉన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా సోషల్ మీడియాలో అతిగా ప్రతిస్పందనలు వస్తున్నాయి అని చెప్పారు.

కానీ సోమవారం కోర్టు గదిలో రాకేశ్ కిశోర్ అనే సీనియర్ న్యాయవాది తన స్పోర్ట్ షూస్‌లో ఒకటి విప్పి ప్రధాన న్యాయమూర్తిపై విసిరేందుకు ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది ఆయనను నిలువరించారు. సనాతన ధర్మాన్ని అవహేళన చేశారని ఆయన ఆరోపించారు. అయితే ఆయనను వదిలివేయమని జస్టిస్ గవాయ్ చెప్పడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేయకుండా వదిలివేశారు.. భావోద్వేగాల వల్ల జరిగిన సంఘటనలను మరింత ప్రేరేపించడం మంచిది కాదని ఆయన భావించి ఉండవచ్చు. గతంలో బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేయకుండా కాపాడతానని మాట ఇచ్చి మరీ విఫలమైన ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్‌ను లాంఛనంగా ఒకరోజు నిర్బంధించి రూ. 20వేల ఫైన్ వేసి వదిలేసిన సంఘటన ముందు ఇదెంత? నిజానికి కేంద్రంలోనూ, మధ్యప్రదేశ్‌లోనూ బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నది. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో ఆలయాల సముదాయాల్లో దెబ్బతిన్న విష్ణుమూర్తి ప్రతిమనొకదానికి ప్రాణప్రతిష్ఠ చేసి అతి పెద్ద ఆలయాన్ని నిర్మించడం బీజేపీ తలుచుకుంటే పెద్ద పని కాదు. కాని అక్కడ పురాతత్వ శాఖకు ఏ నిబంధనలు అడ్డువచ్చాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

నిజానికి ఇవాళ దేశ రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం వ్యవస్థలు ఎంతో కొంత సవ్యంగా నడుస్తున్నందువల్లే దేశం చెక్కుచెదరకుండా ఉన్నది. ఎమర్జెన్సీలో రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారు. దేశంలో అనేక చోట్ల నియంతృత్వ ప్రభుత్వాలను ప్రజలు మార్చివేశారు. రాజ్యాంగ బద్ధంగా నిర్వహించిన ఎన్నికల వల్లే ఇవాళ మెజారిటీ ప్రజలు భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. మూడు సార్లు బీజేపీ అధికారంలోకి రావడానికి రాజ్యాంగం ఏర్పర్చిన వ్యవస్థలే కారణం. ఈ విషయం తెలిసినందువల్లే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండించారు. ప్రతి భారతీయుడికీ ఈ చర్య ఆగ్రహం తెప్పించిందని, ఇలాంటి గర్హనీయమైన చర్యలకు మన సమాజంలో స్థానం లేదని అన్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ కూడా ఈ చర్య నిందనీయమని, ఏ భారతీయుడూ దీనికి మద్దతు నీయడని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ సంఘటనలో వ్యవహరించిన తీరు చాలా హుందాగా ఉన్నదని ఆయన అన్నారు. వాట్సాప్ యూనివర్సిటీల విద్యే అసలైన విద్యగా చలామణి అవుతున్న కాలంలో అదే రాజ్యాంగం ప్రమాదంలో పడకుండా, రాజ్యాంగ విలువలైన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారంలో ఉన్నవారిపై ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఈసారి సాహిత్య నోబెల్ ఎవరికి?

ఇదొక గమ్మత్తయిన ప్రశ్న. చాలా సంవత్సరాలుగా ఈ ప్రశ్నకు సమాధానంగా అంచనాలు కట్టినవారంతా కచ్చితంగా నూటికి నూరు శాతం తప్పుగానే రుజువయ్యారు. ఫలానావారికి సాహిత్య నోబెల్ రాబోతోంది అని వార్తల్లో ఎక్కువగా నలిగిన ఏ పేరూ పురస్కారం అందుకున్న చరిత్ర లేదు. 2024లో హాన్ కాంగ్ పేరును ఎవరూ ఊహించనేలేదు, అంచనా కట్టలేదు. అదీ నోబెల్ కమిటీ అంటే! నోబెల్ నామినేషన్లు అత్యంత గోప్యంగా ఉంటాయి కనుక అంచనాలూ అంతే ఎక్కువగా ఉంటాయి.

అక్టోబర్ 9న సాహిత్య నోబెల్ పురస్కారాన్ని ప్రకటిస్తారు. గెరాల్డ్ మర్నేన్, లాస్లో క్రాస్నహోర్కాయ్, క్రిస్టినా రివెరా గార్జా, హరుకి మురకామీ, మిర్చియా కార్టారెస్కు, ఎన్రికే విలా మటాస్, థామస్ పించన్, కేన్ ష్యూయ్, మిగెల్ హౌల్బెక్, అలక్సిస్ రైట్ ఈసారి వినిపిస్తున్న పేర్లు. గూగీ వా థియాంగో కూడా జాబితాలో ఉన్నాడు.

ఈసారి మురకామీ పేరు ఎక్కువ వినపడుతోంది. వార్తల్లో ఉన్న పేరు వెనక్కు వెళ్లిపోతుంది అనే మూఢనమ్మకం ప్రకారం మరి మురకామీకీ రాకపోవచ్చు. పైగా నోబెల్ కమిటీ ఆలోచనలు వేరుగా ఉంటాయి. మురకామీ తరహా రచనలు నోబెల్ కమిటీ ఇష్టాలకు తగినవి కావు. గార్షియాకు వచ్చినపుడు మురకామీకి ఎందుకు రాదూ అన్నది మరో వాదన. నోబెల్ కమిటీకి కేవలం సాహిత్యమే కాక రాజకీయ, భౌగోళిక లెక్కలు కూడా ప్రధానం. నిజానికి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని చాలా సందర్భాలలో సాహిత్యం కంటే రాజకీయాలే ఎక్కువ ప్రభావితం చేస్తాయి. "మోస్ట్ అవుట్‌స్టాండింగ్ వర్క్" అంటూనే "ఇన్ ఐడియల్ డైరెక్షన్" అని



నిజానికి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని చాలా సందర్భాలలో సాహిత్యం కంటే రాజకీయాలే ఎక్కువ ప్రభావితం చేస్తాయి. "మోస్ట్ అవుట్‌స్టాండింగ్ వర్క్" అంటూనే "ఇన్ ఐడియల్ డైరెక్షన్" అని కూడా ఆల్‌ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో రాసిన వాక్యం రచయిత ఎంపికలో చాలా కీలకం.

కూడా ఆల్‌ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో రాసిన వాక్యం రచయిత ఎంపికలో చాలా కీలకం. శైలీ నైపుణ్యం, ప్రజాదరణ మాత్రమే కాక, మానవతా విలువల ప్రతిరూపంగా ఉన్న రచనలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యతనివ్వాలి. ఈ "ఐడియల్ డైరెక్షన్" అనే మాటకు కమిటీ తనదైన అర్థాలను చెపుతూంటుంది. అయినప్పటికీ ఇప్పటి వరకూ అధిక సంఖ్యలో పురస్కారాలు అందుకున్నది యూరోపియన్లే. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు దక్కింది చాలా తక్కువ. ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ ఆధిపత్యం ఎక్కువ.

ఈసారి పురస్కారం విషయంలో కమిటీ రాజకీయ కోణంలో ఆలోచిస్తే గార్జాకు, సృజనాత్మకత కోణంలో ఆలోచిస్తే అనీ కార్సన్‌కు ఊహించని పేర్ల జాబితాలో చోటు దక్కే అవకాశం ఉంది. సల్మాన్ రష్దీ పేరు కూడా జాబితాలో ఉంది. కానీ ఆయనకు వచ్చేదయితే ఈ పాటికే వచ్చివుండాలి. రాలేదు కనుక ఇప్పుడూ రాదు అని ఒక అంచనా. పైగా గత దశాబ్ద కాలంగా రష్దీ పేరు ప్రధానంగా వినపడడమే తప్ప, ఎప్పుడూ తుది జాబితాకు చేరింది లేదు. గత సాహిత్య నోబెల్ మహిళకు వచ్చింది కనుక ఈ విడత పురుషుడిదే అన్నది మరో తర్కం. కొన్ని మినహాయింపులతో నోబెల్ కమిటీ ఒకసారి మహిళ, ఒకసారి పురుషుడు అనే సమతుల్యాన్ని పాటిస్తూ ఉంటుంది. గత రెండు పురస్కారాలు వరుసగా మహిళలకే దక్కాయి. అయితే చైనాకు చెందిన కాన్స్యు ఈ అడ్డంకులను అధిగమించి పురస్కారం అందుకోగల శక్తి ఉన్న రచయిత్రి అని ఒక వాదన. ఆమె రచనల్లోని తాత్వికత, సంస్కృతీ ప్రతిఫలనాలు, గాఢత, మానవీయ విలువలు కమిటీని కొన్ని సంప్రదాయాలను దూరం పెట్టేట్టుగా చేస్తాయని సాహిత్య లోకం నమ్ముతోంది. ఇటీవలి పురస్కారాలు ఆసియాకు దక్కాయి కనుక ఈసారి యూరప్, దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా, ఇటలీ, ఆఫ్రికన్ సృజనకారులకు ఎక్కువ అవకాశాలున్నాయి. కవి, గాయకుడిగా బాబ్ డిలాన్ విషయంలో జరిగిన గొడవ నేపథ్యంలో క్నాస్గార్డ్ పేరు తుది జాబితాలో పరిశీలనకు రావడం కష్టమే. కార్టరెస్కుకు యూరోపియన్ సాహిత్య ప్రపంచంలో పెద్ద పేరు. గొప్ప గౌరవం. అంతేగాక గత మూడేళ్లుగా ఈ పేరు జాబితాలోని మొదటి మూడు స్థానాల్లో ఉండడంవల్ల అవకాశం ఎక్కువగా ఉందన్న చర్చ జరుగుతోంది.

అంచనాల్లో ఉన్న పేర్లన్నింటిలో మురకామీకి పురస్కారం దక్కితే భారతీయులు ఎక్కువ సంతోషిస్తారేమో. ఎందుకంటే ఆయన ఇండియాలో అత్యంత ఎక్కువమంది పాఠకులను సంపాదించుకున్న రచయిత.


ఒక ఆశ్చర్యం ఏమిటంటే– ఎక్కడో చివరనే కావచ్చు, స్టేక్స్ తక్కువే కావచ్చు కానీ– అంచనాల జాబితాలో స్టీఫెన్ కింగ్ పేరు కూడా ఉంది. మన జ్ఞానపీఠ జాబితాలో యండమూరి లాంటి పేరు ఊహించగలమా. ఇదీ అలాంటిదే!

మొత్తంగా చూస్తే ఎంత అంచనాలు కట్టి, ఎన్ని ఊహాగానాలు చేసినా నోబెల్ కమిటీ సాహిత్య ప్రపంచాన్ని ప్రతీసారీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూనే ఉంటుంది. ఆ ఆశ్చర్యం ఏమిటో తెలియడానికి మరో 36 గంటలు. అంతే.

• ప్రసేన్

భారతీయ విద్యార్థులకు రక్షణ లేదా?

అమెరికా ఎందరో భారతీయ విద్యార్థులకు, నిపుణులకు ఉన్నత భవిష్యత్తును అందించే కలల దేశం. టెక్నాలజీ, వైద్యం, విద్య, వ్యాపారం వంటి కీలకమైన రంగాల్లో అమెరికా అభివృద్ధికి భారతీయులు ఎనలేని సేవలందిస్తున్నారు. తమ మేధస్సుతో, కృషితో ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆశావహులకు ఈ 'అమెరికన్ డ్రీమ్' ఒక పీడకలగా మారుతోందా? అనే ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. భారతీయ విద్యార్థులపై పెరుగుతున్న నేరాలు, జాతి వివక్ష దాడులు వారి భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఒక భారతీయ మేనేజర్‌ను అత్యంత కిరాతకంగా శిరచ్ఛేదం చేసిన ఘటన, మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న ఒక తెలుగు దంత వైద్యుడిని గ్యాస్ స్టేషన్‌లో కాల్చి చంపిన విషాద ఘటనలు కేవలం వార్తలు కావు. అవి అమెరికాలో నివసిస్తున్న భారతీయ వలసదారుల ప్రమాదకర పరిస్థితులకు నిలువుటద్దం. తుపాకులు సులభంగా లభించే సమాజంలో, ఆత్మరక్షణకు పరిమిత అవకాశాలున్న భారతీయ విద్యార్థులు ఎంత బలహీనంగా ఉన్నారో ఈ విషాద ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికా రాజ్యాంగ రెండో సవరణ ప్రకారం, అమెరికన్ పౌరులు చట్టబద్ధంగా తుపాకులను కలిగి ఉండవచ్చు. కానీ ఎఫ్–1 వీసాలపై ఉన్న అంతర్జాతీయ విద్యార్థులకు ఆ హక్కు లేదు. కేవలం శాశ్వత నివాసితులు (గ్రీన్‌కార్డ్ హోల్డర్లు) మాత్రమే తుపాకులను చట్టబద్ధంగా కొనుగోలు చేయగలరు. చిన్న నేరస్థులు కూడా తేలికగా ఆయుధాలు పొందగలిగే దేశంలో ఈ అసమానతే విదేశీ విద్యార్థులను నిస్సహాయ బాధితులుగా మారుస్తోంది. ఈ నేపథ్యంలో పౌరులు తుపాకులను కలిగి ఉండటాన్ని అమెరికా పూర్తిగా నిషేధించాలి, లేదా విదేశీ విద్యార్థులకు కూడా పరిమితంగానైనా ఆత్మరక్షణ హక్కును కల్పించాలి. ఈ పరిమితుల మధ్య కూడా విద్యార్థులకు ఆత్మరక్షణ కోసం కొన్ని చట్టబద్ధమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. పెప్పర్ స్ప్రే, స్టన్‌గన్, టేజర్ వంటి ప్రాణాంతకం కాని పరికరాలు అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో చట్టబద్ధమైనవి. ఇవి దాడి చేసేవారిని తాత్కాలికంగా నిలువరించి, బాధితులు తప్పించుకోవడానికి లేదా సహాయం కోసం అరవడానికి విలువైన సమయాన్ని అందిస్తాయి. ఈ పరికరాలు ఉపయోగించడానికి సులభమైనవి, సురక్షితమైనవి.

భారతీయులు బాగా సంపాదిస్తారని, శారీరకంగా బలహీనులని, ఎదురు తిరగరని ఒక ప్రమాదకరమైన అపోహ దుండగులలో ప్రచారంలో ఉంది. ఈ కారణంగానే భారతీయులను సులభ లక్ష్యాలుగా ఎంచుకుంటున్నారు. ఈ దృక్పథం మారాలి. అమెరికా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయులు కేవలం ఆర్థిక వనరులు కాదు, ఆ దేశ సమాజంలో అంతర్భాగం. కేవలం పెప్పర్ స్ప్రేలు, స్టన్‌గన్‌లు మాత్రమే దీనికి శాశ్వత పరిష్కారం కాదు. కాబట్టి భారతీయ సమాజం సంఘటితంగా తమ భద్రతపై గళం విప్పాలి. భారత ప్రభుత్వం కూడా అమెరికా ప్రభుత్వంతో దౌత్యపరమైన మార్గాల ద్వారా ఈ సమస్య తీవ్రతను తెలియజేసి, తమ పౌరుల రక్షణకు కఠినమైన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలి. అమెరికాలో భారతీయులు కేవలం అతిథులు కారు, ఆ దేశ ప్రగతిలో భాగస్వాములు. వారి భద్రతను నిర్లక్ష్యం చేయడం అంటే, ఆ దేశం తన భవిష్యత్తును తానే ప్రమాదంలో పడేసుకోవడమే.

– శ్రీనివాస్ మాధవ్

తరం తరం సమాజ మేధోవనరు

తెలుగు నేలకు, హక్కుల ప్రజానీకానికి పరిచయం అవసరం లేని పేరు బాలగోపాల్. హక్కుల దిక్సూచిగా, ప్రజల న్యాయవాదిగా ఆయన సాధించిన మైలురాళ్ళు ఎన్నో; ప్రజా విజయాలు, ప్రజాధర్మానికి గీటురాయిగా నిలిచిన సందర్భాలు మరెన్నో. నేను 2021 నుంచి మానవ హక్కుల వేదికతో పని చేస్తున్నాను. బాలగోపాల్ సంస్మరణ సభలకు 2019 నుంచి వెళ్తున్నాను. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో బాలగోపాల్ సార్ యాదిలో మానవ హక్కులవేదిక హైదరాబాద్‌లో నిర్వహించే సంస్మరణ సభకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి సామాజిక కార్యకర్తలు హాజరవుతారు. మనల్ని వదిలివెళ్ళి పదహారేళ్ళయినా బాలగోపాల్ సార్‌కు ఉన్న కరిష్మా అది.

అయితే ఎప్పుడూ ఒక ప్రశ్న నన్ను వేధిస్తూ ఉండేది. బాలగోపాల్ గురించి ఇప్పటి యువతకు తెలుసా? విశ్వవిద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయన చేసిన వందలాది నిజనిర్ధారణల గురించి అవగాహన ఉందా? ప్రజాసమస్యల పట్ల పాతతరం ఒక ఎరుకతో ఉండేది, ఏదో ఒక ప్రజా ఉద్యమంతో పని చేయటం వల్ల వారికి బాలగోపాల్ గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పుడున్న యువత మాటేమిటి? ఆయన వేసిన కొత్త దారులు, రాసిన రాతలు, చేసిన పోరాటాలు, గెలిచిన కేసులు... వాటి గురించి వీరికి ఎంత తెలుసు అనిపించేది. ఆయన్ని పోగొట్టుకున్న రోజు విషాదంతో కూరుకుపోయిన తెలుగునేల గురించి, ఆయన విలువ గురించి తర్వాతి తరాలకు ఎప్పటికైనా పూర్తిగా తెలుస్తుందా? అనుకునేవాడిని.

గత సంవత్సరం సంస్మరణ సభకు ముందు హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టర్స్ అతికించే కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు, నాకు మరింత స్పష్టంగా జవాబులు దొరికాయి. 'టిస్'కు వెళ్ళినపుడు, అక్కడి విద్యార్థులకు ఆయన ఒక ప్రజా మేధావిగా పరిచయం అని అర్థమయింది. ఈపీడబ్ల్యూలో రాసిన వ్యాసాల వల్ల కూడా వారికి ఆయన సుపరిచితుడే. ఆయన గురించి తెలిసిన విద్యార్థులు చాలామందే కనిపించారు. అలాంటి అభిప్రాయాలే మేం 'ఇఫ్లూ'లో కూడా విన్నాం. 'హెచ్‌సీయూ'లో బాలగోపాల్ ఆదివాసుల కోసం చేసిన పనుల వల్ల ఎక్కువ పరిచయం. లెఫ్ట్ సంఘాలకు ఆయన రాసిన మార్క్సిజం రచనలతో పరిచయం. దళిత సంఘాలకు ఆయన వారి గురించి చేసిన రచనల వల్ల పరిచయం. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘ్ పరివార్‌కి వ్యతిరేకంగా రాసిన రచనల వల్ల, సచార్ కమిటీ నివేదికపై వ్యాసాల వల్ల, కశ్మీర్‌పై చేసిన పనుల వల్ల పరిచయం.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల స్పందన నాకు ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగించింది. మండల్ ఉద్యమ సమయంలో రిజర్వేషన్ల మీద రాసిన వ్యాసాల వల్ల, దళితుల కోసం, ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన కృషి వల్ల అక్కడి విద్యార్థులకు బాలగోపాల్ సుపరిచితుడు. ఒక విద్యార్థి మాట్లాడుతూ "ఆర్ట్స్ కాలేజీ లాన్‌లో మా సీనియర్ పాలస్తీనా ప్రజాపోరాటం వ్యాసం మొత్తం చదివి వినిపించాడు" అని చెప్పాడు. చివరగా నల్సార్‌కి వెళ్ళినపుడు అక్కడి బి.ఎ+ఎల్.ఎల్.బి చదివే మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా బాలగోపాల్ వాదించిన కేసుల వివరాలు తెలుసు. మేమందరం బాలగోపాల్‌కి రుణపడి ఉన్నాం అని చెప్పకనే చెప్పారు. అదీ, ఆయనకు ఇప్పటి తరంతో ఉన్న అనుబంధం. ఆయన ఆలోచనలకు ఇప్పటి విద్యార్థుల దగ్గర కూడా ఎంత ప్రాసంగికత ఉన్నదో అర్థమైంది.

బాలగోపాల్ చేసిన పనులు చాలా విస్తారమైనవి. వైవిధ్యమైనవి, విలక్షణమైనవి. ఎక్కువమంది కార్యకర్తలు ఒక నేపథ్యంతో కూడుకున్న సమస్యల మీదనే పని చేయడానికి ఇష్టపడతారు, దానికి వాళ్లకు ఉన్న కాలపరిమితి కూడా ఒక ముఖ్య కారణం. కానీ బాలగోపాల్ ఆ అడ్డంకులు అధిగమించి కాలానికే పరిమితి పెట్టే విధంగా పని చేశారు. ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, మహిళలు, నక్సలైట్ల గురించి మాట్లాడుతూనే అభివృద్ధి విధ్వంసం, పర్యావరణం, అణచివేత, విస్థాపన, నదులు, సైన్స్, సాహిత్యం, కోర్టు తీర్పులు ఇలా దేనినీ వదలలేదు. కశ్మీర్ నుంచి కందమాల్ వరకు నిజ నిర్ధారణలు చేయడమే కాక, పాలస్తీనాతో పాటు అనేక అంతర్జాతీయ విషయాల మీద కూడా రచనలు చేసారు.

> **బాలగోపాల్ చేసిన పనులు చాలా విస్తారమైనవి. వైవిధ్యమైనవి, విలక్షణమైనవి. ఎక్కువ మంది కార్యకర్తలు ఒక నేపథ్యంతో కూడుకున్న సమస్యల మీదనే పని చేయడానికి ఇష్టపడతారు, దానికి వాళ్లకు ఉన్న కాలపరిమితి కూడా ఒక ముఖ్య కారణం. కానీ బాలగోపాల్ ఆ అడ్డంకులు అధిగమించి కాలానికే పరిమితి పెట్టే విధంగా పనిచేశారు.**



బాలగోపాల్ మరణించిన తరువాత ఆయన రచనలను పుస్తక రూపంలో అందుబాటులోకి తెచ్చిన పబ్లిషర్స్ కృషి ఎనలేనిది. అవి అందుబాటులోకి రావడం మూలానే ఆయన కొత్త తరానికి చేరువవుతున్నారు. బాలగోపాల్ చేసిన పనిని అధ్యయనం చేసి, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం ఇంకా జరగాలి, ఈ తరానికి అది సాధ్యమే. ఇప్పటితరం దృష్టిలో ఆయన ఖ్యాతి ఎవరూ ఊహించనిది, ఎవరూ సాధించనిది కూడా. బహుశా అమరత్వం అంటే ఇదేనేమో!

నేడు బాలగోపాల్ వర్ధంతి. కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో, నల్సార్ వీసీ శ్రీకృష్ణ దేవరావు వక్తగా బాలగోపాల్ స్మారకోపన్యాసం జరుగుతుంది. 12వ తేదీన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నందిని సుందర్, యోగేంద్ర యాదవ్, అపర్ గుప్తా, పి.ఎస్. అజయ్‌కుమార్ వక్తలుగా మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో సంస్మరణ సభ. బాలగోపాల్ పుస్తకం 'రాజ్యాంగాన్ని ఎలా చూడాలి' ఆవిష్కరణ, పాలస్తీనా మీద లఘుచిత్ర ప్రదర్శన ఉంటాయి.

■ రోహిత్ తాళ్ళ
మానవ హక్కుల వేదిక







స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం

నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో స్వచ్ఛ కలెక్టరేట్, స్వచ్ఛ పోలీస్ కమిషనరేట్ అవార్డులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి చేతుల మీదుగా అందుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, డీసీపీ కేజీవీ సరిత

దుర్గగుడి మహామండపంలో కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శీనానాయక్



హుండీ ఆదాయం రూ.10.30 కోట్లు

దుర్గగుడిలో దసరా ఉత్సవాల హుండీల లెక్కింపు

- బంగారం 387 గ్రాములు.. వెండి 19.450 కేజీలు
- వివరాలు వెల్లడించిన ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరిగిన దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించు కున్న భక్తులు సమర్పించిన హుండీల ఆదాయం రూ.10,30,95,521 వచ్చింది. ఈ వివరాలను ఈవో వి.కె.శీనానాయక్ మంగళవారం వెల్లడించారు. మహా మండపం ఆరవ అంతస్తులో భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు రెండు రోజుల పాటు లెక్కించారు. మొదటి రోజు సోమవారం రూ.3,57,92,708 నగదు, మిగతా 6లో..

నిమ్మకాయలు, కంకణాలు కొంటున్న భక్తులు



కంకణాల మహిమ!

ఇంద్రకీలాద్రిపై జోరుగా వ్యాపారం

- ఒక్కోటి రూ.100కు విక్రయం
- నిమ్మకాయలపైనా వ్యాపారమే
- శఠారీల వద్ద భక్తుల నుంచి దోపిడీ
- అమలు కాని అధికారుల నిర్ణయం

పూజలో పెట్టిన కంకణం ఇది. ఒకటి రూ.100. దీన్ని పెద్దలు కట్టుకోవచ్చు. పిల్లలకూ కట్టొచ్చు. ఇది భూతవైద్యులు చెప్పిన మాట కాదు. సాక్షాత్తు కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రిపై పురోహితులు చెబుతున్న మాట. ఇంద్రకీలాద్రిపై ఈ కంకణాల మాటున పెద్ద వ్యాపారమే జరుగుతోంది. అధికారులు తనిఖీలు చేసినప్పుడు మాత్రం ఇవి మాయమవుతాయి. మిగిలిన సమయాల్లో శఠారీ ఉండే పళ్లాల్లో దర్శనమిస్తాయి. కొంతమంది భక్తులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యాపారమంతా కనకదుర్గమ్మ ప్రధానాలయం నుంచి ఉపాలయాల వరకు కొనసాగుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. రోజుకు 30 వేల నుంచి 40వేల మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఆది, మంగళ, శుక్రవారాల్లో 50వేల మంది భక్తులు వస్తుంటారు. తొలుత అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాత ఉపాలయాలకు వెళ్తారు. కనకదుర్గమ్మ ఆలయంతో పాటు మల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో నటరాజస్వామి ఆలయం, దీనికి వెనుక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. అమ్మవారిని దర్శించుకున్న కొంతమంది భక్తులు మల్లేశ్వరస్వామి మిగతా 6లో..

రూ.5 నిర్ణయం ఏమైంది?

కంకణాల వ్యాపారం అధికారుల దృష్టికి వెళ్లడంతో దీనికి అడ్డుకట్ట వేయాలని భావించారు. కంకణం ఐదు రూపాయలకు విక్రయించాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఇంతకుముందున్న ఈవో ఈ నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత పురోహితుల గొంతులో వెలక్కాయపడినట్టయింది. తర్వాత కొన్నాళ్లపాటు కంకణాలను విక్రయించడం ఆపేశారు. ఆయన వెళ్లిపోయిన తర్వాత తిరిగి మళ్లీ ప్రారంభించారు. భక్తుల సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని జరిగే వ్యాపారానికి బ్రేకులు వేయాలని పలువురు కోరుతున్నారు. కంకణాలకు అధికారులే ఒక ధరను నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇంకెంత కాలం!

అందుబాటులోకి రాని విజయవాడ వెస్ట్ బైపాస్

- 97 శాతం వరకు పూర్తయిన పనులు
- వేధిస్తున్న కోర్టు కేసులు
- మోర్తు దగ్గర ఫైల్స్ పెండింగ్‌లోనే..
- ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తేనే పరిష్కారం



సూరంపల్లి దగ్గర టవర్ల ఎత్తు తక్కువగా ఉండటంతో రోడ్డు వేయలేని పరిస్థితి... ఇక్కడ 500 మీటర్ల మేర రోడ్డును నిర్మించాల్సి ఉంది.

విజయవాడ పశ్చిమ బైపాస్ వ్యవహారం విచిత్రంగా మారింది. దాదాపుగా పనులు పూర్తి అయినా అందుబాటులోకి రాలేని దైన్య పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ (మోర్తు) కొన్నింటికి అనుమతులు ఇవ్వడంలో జాప్యం, కోర్టు కేసులు ప్రధాన కారణంగా తెలుస్తోంది. వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రాకపోవడంతో విజయవాడలో ట్రాఫిక్ అంతకంతకూ పెరిగిపోతోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపించకపోతే వెస్ట్ బైపాస్ సమస్యలు పరిష్కారమయ్యేలా కనిపించటం లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పశ్చిమ బైపాస్ వ్యవహారం ఓ కొలిక్కిరావడం లేదు. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు) నుంచి ఓ పట్టాన అనుమతులు రాకపోవటంతో.. పూర్తి చేయాల్సిన పనులు ఎక్కడవక్కడే అన్నట్టుగా ఉంది. మోర్తు ఇచ్చే అనుమతుల మీద అరకొరగా ఉన్న కోర్టు కేసులు కూడా వీగిపోయే అవకాశం ఉంది. ఇప్పటికిప్పుడు మోర్తు కనుక అనుమతులు ఇస్తే నాలుగు నెలల్లో పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి ప్రధాన ప్రతిబంధకంగా హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల ఎత్తు పెంపు అంశాలు ఉన్నాయి. నైనవరం-జక్కంపూడి మధ్యలో మూతపడిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పిడితో వివాదం మొదలైంది. ఈ లైన్‌ను స్క్రాప్‌కు విక్రయించటం జరిగింది. విద్యుదుత్పత్తే చేయలేని సంస్థకు ఆయాచిత ప్రయోజనం చేకూర్చేలా పాత అలైన్‌మెంట్ ప్రతిపాదనను ముందుకు తీసుకురావటంతో స్థానికంగా రైతులు హైకోర్టులో 12 కేసులు వేశారు. దీంతో పెద్ద వివాదం రేగింది. దాదాపుగా ఆరు నెలలు ఈ వివాదం కొనసాగింది. ప్రభుత్వ జోక్యంతో రైతులతో జిల్లా యంత్రాంగం జరిపిన చర్చలు ఫలించాయి. అలైన్‌మెంట్‌ను మార్చకుండా ఇప్పుడున్న చోటే టవర్ల ఎత్తు పెంపునకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అంగీకరించింది. దీంతో రైతులు కూడా సానుకూలంగా స్పందించారు. తమ అంగీకారాన్ని కూడా తెలిపారు. సమస్య పరిష్కారమైందనుకుంటే.. ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు టవర్ల ఎత్తు పెంపుతో కూడిన నిర్మాణ పనుల అనుమతుల కోసం మోర్తుకు నివేదించారు. మోర్తు నుంచి అనుమతులు వస్తే.. వెంటనే టవర్ల ఎత్తు పెంపు కార్యక్రమాన్ని కాంట్రాక్టు సంస్థ చేపడుతుంది. టవర్ల ఎత్తును 14 మీటర్ల ఎత్తున లేపాల్సి ఉంది. ఎందుకంటే పాముల కాలువకు వెళ్లే మార్గంలో ఆర్‌వోబీని నిర్మించాల్సి ఉంది. ఈ సమస్య కారణంగా ఇప్పటి వరకు ఇక్కడ ఆర్‌వోబీని నిర్మించలేదు.

సూరంపల్లి దగ్గర కోర్టు కేసుల గొడవ

సూరంపల్లిలో విషయమై పలుకోర్టు కేసులు నడుస్తున్నాయి. ఇవి కూడా టవర్ల ఎత్తు పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు కావటం గమనార్హం. సూరంపల్లిలో నాలుగు మీటర్ల ఎత్తున అత్యంత దిగువన ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్లు ఉన్నాయి. ఇంత దిగువన వెళితే వాహనదారులకు విద్యుత్ షాక్ తగులుంది. దీంతో కాంట్రాక్టు సంస్థ నిర్ణీత దూరం కోసం భూమిని తవ్వి లోతును పెంచింది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించగలుగుతున్నాయి. ఇక్కడ 500 మీటర్ల ఫైబడి విజయవాడ బైపాస్ పనులు పూర్తి చేయలేదు. ఈ టవర్ల ఎత్తుకు సంబంధించి కూడా ఎన్‌హెచ్ అధికారులు మోర్తుకు అనుమతుల కోసం నివేదిక పంపి చాలాకాలమవుతున్నా స్పందన లేదు. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ ఈ ప్రాంతలో అటువైపు ఒక ముక్క, ఇటువైపు ఒక ముక్కగా ఉండిపోయింది. ఇదే ప్రాంతంలో మరికొన్ని టవర్ల అలైన్‌మెంట్ మార్పుకు సంబంధించి కూడా కోర్టు వివాదాలు ఉన్నాయి. కొన్ని టవర్లు వేసి వదిలేశారు. వీటికి సంబంధించి కూడా సమస్య అపరిష్కృతంగా ఉంది. ఈ చిక్కుముడులను ఎంత త్వరగా తేల్చితే.. అంత త్వరగా విజయవాడ పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వస్తుంది. ఈ రెండు చోట్ల తప్పితే విజయవాడ బైపాస్‌లో చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ - 3లో ఎలాంటి సమస్యా లేదు.



లీజు మాయ!

అభయాంజనేయ స్వామి ఆలయం ఆదాయానికి గండి!



దేవస్థానం వెనుక నూతనంగా నిర్మించిన షాపులు (ఇన్‌సెట్‌లో) అభయాంజనేయ స్వామి దేవస్థానం

- ధర్మసత్రం స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు వేలం
- ఆదాయం వచ్చే అవకాశాలున్నా.. ఒక్కో షాపునకు రూ.10 వేలుగా నిర్ణయం
- సిండికేట్ అయి రూ.7,500లకే దక్కించుకున్న పాటదారులు
- అధిక ధరలకు సబ్‌లీజులకు ఇచ్చి అక్రమార్జన
- అధికారులు, నూతన పాలక వర్గం తీరుపై సర్వత్రా విమర్శలు

హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయ ఆదాయానికి అధికారులే గండికొడుతున్నారు. ధర్మసత్రం స్థలంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలను కారుచౌకగా కట్టబెట్టారు. సిండికేట్‌గా ఏర్పడి షాపులు దక్కించుకున్నవారు అధిక ధరలకు సబ్ లీజులకు ఇచ్చి అక్రమార్జన చేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన నూతన పాలకవర్గం పట్టనట్టు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, హనుమాన్ జంక్షన్): హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయం రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచింది. దేవస్థానానికి చెందిన ధర్మస్థలం స్థలంలో ఇటీవల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. షాపులను అద్దెకు ఇచ్చే విషయంలో అధికారులు ఉదాసీనవైఖరి అవలంబించడంతో పాటదారులు కారు చౌకగా వాటిని దక్కించుకున్నారు. ఆదాయం రాగలిగే పరిస్థితి ఉందని తెలిసినా కూడా అధికారులు అతి తక్కువగా అద్దెలను నిర్ణయించారు. పోనీ నిరుద్యోగులకు ఉపాధి కల్పన నిమిత్తం అతి తక్కువ ధరకు అద్దెకు ఇచ్చారా అంటే అదీ లేదు. వ్యాపారం చేసేవారికి కారు చౌకగా కట్టబెట్టారు.

ఆలయ ఆదాయ వనరుగా ఉంటుందనుకుంటే..

అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఆదాయం అవసరం. ఈ క్రమంలో ధర్మసత్రం స్థలంలో వ్యాపారాలు నిర్వహించుకోవడానికి రూ.30 లక్షలు వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. స్వామి వారి నిత్య నైవేద్యాలు, పూజా కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాలు, వివిధ వేడుకల నిమిత్తం ఖర్చు చేయటానికి వీలుగా ఆదాయార్జన కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను అధికారులు కొందరి ప్రయోజనాల కోసం మిగతా 6లో..



ఆధ్యాత్మిక వైభవం దుర్గమ్మ గిరిప్రదక్షిణ

దుర్గగుడి ఘాట్ రోడ్డు టోల్ గేట్ వద్ద గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవదాయ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ భ్రమరాంబ, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి తదితరులు 6

ఎట్టకేలకు స్వాధీనం..!

- లిడ్‌క్యాప్ నియంత్రణలోకి ఆటోనగర్‌లోని రూ.100 కోట్ల విలువైన స్థలం
- కోర్టుల్లో లిడ్‌క్యాప్‌కు ఉపశమనం


8

మొక్కజొన్నకు కష్ట కాలం!

- పదివేల ఎకరాల్లో సాగు
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆవేదన
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్

6

మొక్కజొన్నకు కష్ట కాలం!



కంచికచర్ల వద్ద సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

- పదివేల ఎకరాల్లో సాగు..
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆవేదన
- అకాల వర్షాలతో పంటకు నష్టం
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

మార్కెట్లో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధర క్వింటా రూ. 2400 కాగా.. బయట మార్కెట్లో రూ.1900లకు మించి ధర పలకటం లేదు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా రైతులు కోరుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లో ఈ ఏడాది తొలకరిలో రైతులు పదివేల ఏకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. రైతులు ఎకరం రూ.15 వేల నుంచి రూ.20వేలకు కౌలుకు తీసుకుని ఆశతో మొక్కజొన్న వేశారు. ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి అయింది. కొద్ది రోజులుగా మొక్కజొన్న కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలతో కోయిస్తే ఎకరానికి రూ.5వేలకు పైగా ఖర్చు అవుతోంది. 20 నుంచి గరిష్ఠంగా 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నది. ఎక్కువగా కోళ్ల దాణా, మద్యం తయారీకి వినియోగిస్తుండటంతో మొక్కజొన్నకు డిమాండ్ ఉంది. పంట నాణ్యత కూడా బాగుంది. అయితే ప్రస్తుతం మార్కెట్లో మాత్రం గిట్టుబాటు ధర లభించటం లేదు. మద్యం కంపెనీలు, దాణా తయారీ సంస్థలు కావాలనే ధర తగ్గించాయని రైతులు చెబుతున్నారు. వ్యాపారులు, రైతుల వద్దకు వచ్చి క్వింటా రూ.1900కి కొంటున్నారు. మించి ఒక్క పైసా కూడా అదనంగా ఇచ్చేందుకు ముందుకురావటం లేదు. ఒక మద్యం కంపెనీ నిర్వాహకులు మాత్రం కంపెనీ వద్దకు తీసుకువెళితే, క్వింటాకు రూ.1950లు ఇస్తున్నారు. రవాణా ఖర్చులు రైతులే భరించాల్సి ఉంది.



చెల్లాచెదురైన మొక్కజొన్నను పోగు చేస్తున్న రైతులు

క్వింటాకు రూ.500 నష్టం

కేంద్ర ప్రభుత్వం 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్నకు ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.2400. మార్కెట్ ధర రూ.1900. బయటి వ్యాపారులకు విక్రయిస్తే రైతులు నికరంగా క్వింటాకు రూ.500 నష్టపోవాల్సి వస్తున్నది. ధర విషయంలోనే ఎకరానికి రూ.8000 నుంచి రూ.10 వేలవరకు రైతులకు నష్టం కలుగుతోంది. వేలల్లో నష్టపోతున్నప్పటికీ మరో గత్యంతరం లేనందున రబీసీజన్ పెట్టుబడుల కోసం ఎక్కువ మంది రైతులు పంటను తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మొక్కజొన్న కొనుగోలు చేసి ఆదుకోవాల్సిందిగా రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

తడిసిన మొక్కజొన్నలు

కంచికచర్ల, బత్తినపాడు, పరిటాల, నక్కలంపేట, గొట్టుముక్కల, గనిఆత్కూరు తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు బైపాస్‌కు ఇరువైపులా పది కిలోమీటర్ల పొడవున సర్వీస్ రోడ్లపై మొక్కజొన్నలు ఆరబోశారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్నలు తడిసాయి. పలువురు రైతులు టార్పాలిన్లు కప్పినప్పటికీ పంట తడిసింది. వర్షపు నీటి ఉధృతికి పలుచోట్ల మొక్కజొన్నలు డ్రెయినేజీలోకి కొట్టుకుపోయాయి. మంగళవారం ఉదయం రైతులు, కూలీలు సర్వీస్ రోడ్లకు వచ్చి మొక్కజొన్నలు ఆరబెడుతున్నారు. ఒకవైపు మార్కెట్లో ధరలేక కుదేలైన రైతులు, మరోవైపు పంట తడవటంతో నిలువునా కుంగిపోయారు.

వర్షపు నీటిలో పత్తి చేను..

- దెబ్బతింటున్న పూత, పిందె
- ఆందోళనలో రైతులు

కంచికచర్ల : నందిగామ డివిజన్ పరిధిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వత్సవాయిలో 30.2 మిల్లీమీటర్లు, జగ్గయ్యపేటలో 24.8, పెనుగంచిప్రోలులో 5.8, నందిగామలో 22.4, కంచికచర్లలో 40.6, వీరులపాడులో 52.2, చందర్లపాడులో 15.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. డివిజన్‌లో సగటున 27.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. ఎడతెగని వర్షాల వల్ల పత్తిచేలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు తోడు గాలులకు ముఖ్యంగా పూత, గూడ, పిందెలు రాలుతున్నాయి. చేలల్లో తేమ ఆరకపోవటంతో అడుగు భాగంలో కాయలు దెబ్బతింటున్నాయి. బూజు తెగులు వ్యాపిస్తున్నది. కాయలు నల్లగా, గుడ్డికాయలుగా మారుతున్నాయి. దీంతో పత్తి దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.



పరిటాల వద్ద నీటిలో నానుతున్న పత్తిచేను



గిరి ప్రదక్షిణలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు

ఆధ్యాత్మిక వైభవం దుర్గమ్మ గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణను శోభాయమానంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. ఈవో వీకే శీనానాయక్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవదాయ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ డి.భ్రమరాంబ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి తదితరులు కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు భక్తిపారవశ్య వాతావరణంలో అమ్మవారి గిరిప్రదక్షిణ సాగింది. వందలాది మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

26 నుంచి ఐఆర్‌సీటీసీ గుజరాత్ టూర్

రైల్వేస్టేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26 నుంచి ఐఆర్‌సీటీసీ భవ్య గుజరాత్ టూర్ పేరిట ప్యాకేజీని ప్రకటించినట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రేణిగుంట నుంచి బయలుదేరుతుంది. ద్వారకాదీశ్ ఆలయం, నాగేశ్వరాలయం, బేటీ ద్వారక, సోమనాథ్, సబర్మతి, మోతిరా సూర్యదేవాలయం, పటాన్‌లోని రాణీకివావ్, స్టాట్యూ ఆఫ్ యూనిటీ వంటి ప్రముఖ ప్రదేశాలకు ఈ టూర్ నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, తెలంగాణలోని ఖమ్మం కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, మహారాష్ట్రలోని అజూర్ సాహెబ్, నాందేడ్, పూర్ణ స్టేషన్‌లలో ఎక్కవచ్చు. దిగవచ్చు. రైలు, రోడ్డు వసతి, ఉదయం టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం వంటి క్యాటరింగ్ ఏర్పాట్లు ఉంటాయి. అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ప్రయాణికులకు బీమా సౌకర్యం ఉంటుంది. నవంబరు 4 వరకు తొమ్మిది రాత్రులు, పది పగళ్లు సాగే ఈ టూర్ ప్యాకేజీలో స్లీపర్ క్లాస్ (ఎకానమీ రూ.18,400), త్రీఏసీ స్టాండర్డ్ రూ.30,200లు, టూఏసీ కంఫర్ట్ రూ.39,900లు, 11 సంవత్సరాల వయస్సు పిల్లలకు స్లీపర్‌క్లాస్ రూ.17,300లు, త్రీఏసీకి రూ.28,900లు, టూఏసీకి రూ.38,300లు బడ్జెట్ హోటల్‌లో వసతి ఏర్పాటు చేస్తారు. ఎకానమీ వారికి నాన్‌ఏసీ గదులు, స్టాండర్డ్, కంఫర్ట్ కేటగిరిలో ఏసీ గదుల వసతి ఉంటుంది. ఎంచుకున్న ప్యాకేజీని బట్టి వారి గమ్యస్థానాలకు నాన్ ఏసీ, లేదా ఏసీ వాహనాల ద్వారా రవాణా సౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల ప్రయాణికులు 9701360701, 9281030749, 9281030750, 9281495843 నెంబర్లలో సంప్రదించవచ్చు. అధికారిక వెబ్‌సైట్ ఐఆర్‌సీటీసీ టూరిజంలో కూడా వివరాలను తెలుసుకోవచ్చు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బండి రామకృష్ణ

ఎంపీ బాలశౌరిని విమర్శించే హక్కు పేర్నినానికి లేదు

- డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కౌన్సిలర్లతో నిరసన ప్రదర్శన చేయించిన మాజీ మంత్రి పేర్నినానికి ఏవిధంగాను బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిని విమర్శించే హక్కు లేదని డీసీఎంఎస్ అధ్యక్షుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ధ్వజమెత్తారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి కార్యక్రమాలకు వెళుతున్న ఎంపీ బాలశౌరిపై ప్రదర్శనలు నిర్వహించడం ఎంతవరకు సబబన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఏనాడూ బాలశౌరిని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించలేదన్నారు. బ్యాంకర్లతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించిన ఎంపీని బ్రోకర్‌గా చిత్రీకరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బ్యాంకర్లు వివిధ అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారన్నారు. పేర్నినాని సురక్ష గ్రానైట్‌తో లక్షలాది రూపాయలు ఇప్పటికీ సంపాదిస్తున్నారని ఆరోపించారు. కాకినాడలో పెట్రోల్ బంక్ ఎవరిదని.. అక్రమంగా కోట్లాది రూపాయలు బినామీలతో ఆర్జిస్తున్న పేర్నినాని బాలశౌరిని విమర్శించడం తగదన్నారు. పవర్ స్టేషన్ నుంచి నెలనెలా డబ్బులు గుంజుతున్న మాట వాస్తవం కాదా అన్నారు. జగనన్న కాలనీల పేరుతో బినామీలు ఎంత సొమ్ము రైతుల నుంచి స్వాహా చేశారో ప్రజలకు తెలుసన్నారు. అక్రమార్జనలు చేయడం వల్లే పేర్నినాని, కొడాలినాని వంశీలను ప్రజలు ఛీకొట్టారన్నారు. మెడికల్ కళాశాలకు నిధులు బాలశౌరి తీసుకొచ్చారన్నారు. గుడివాడ నేషనల్ హైవేకి బాలశౌరి నిధులు తీసుకొచ్చిన సంగతిని ఎవరూ మరచిపోలేదన్నారు. పవన్ కల్యాణ్‌ని విమర్శించే హక్కు పేర్నినానికి లేదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, మాదివాడ రాము, సర్పంచ్ గళ్లా తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరణకు 287 రైతుసేవా కేంద్రాలు

- జేసీ నవీన్ వెల్లడి

కానూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో ధాన్యం సేకరణకు 287 రైతుసేవా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఉయ్యూరు డివిజన్ పరిధిలోని గ్రామ, మండల, జిల్లా అధికారులకు ధాన్యం సేకరణపై అవగాహన, సాంకేతిక శిక్షణ కార్యక్రమం మంగళవారం కానూరులోని వీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జేసీ అధ్యక్షత జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం సేకరణకు వినియోగించే పరికరాలతోపాటు సిబ్బందిని కూడా నియమించినట్టు తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు సంబంధిత అధికారులు ధాన్యం సేకరణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర అమలుచేయాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి రైతులు ఆరబెట్టుకొని, శుద్ధిపరుచుకొని ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర రైతులు పొందే విధంగా గ్రామస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని జేసీ నవీన్ తెలిపారు. అదే విధంగా జిల్లాలోని జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి కమిటీలు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలా షారోన్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతితోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

కంకణాల మహిమ!

(5వ పేజీ తరువాయి)

ఆలయానికి వెళ్తారు. మరికొంతమంది మాత్రం ఉపాలయాలను దర్శించుకుని మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్తారు.

రావిచెట్టు దగ్గర నుంచి మొదలు..

అమ్మవారి దర్శనం చేసుకుని బయటకు వచ్చిన భక్తులు రావిచెట్టు వద్దకు వెళ్తారు. ఇక్కడ పురోహితులు శఠారీ ఇస్తారు. పళ్లెంలో ఎరుపు రంగు దారం కట్టిన కంకణాలు కుప్పలుగా ఉంటాయి. ఈ కంకణాలు అమ్మవారి పూజల్లో పెట్టినవి, కట్టుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తులకు చెబుతున్నారు. ఒక్కో కంకణం రూ.100కు విక్రయిస్తున్నారు. ఇక్కడ కంకణాలతో పాటు నిమ్మకాయలు ఉంటాయి. వాటినీ భక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా విక్రయించిన డబ్బులు పురోహితుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై కంకణాల వ్యాపారం రావిచెట్టు దగ్గర నుంచే ప్రారంభమవుతోంది. ఆ తర్వాత నటరాజస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోనూ సాగుతోంది. పురోహితులు సొంతంగా ఈ కంకణాల వ్యాపారం చేస్తున్నారని ఆలయ వర్గాలే చెబుతున్నాయి. దీనికి ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై కంకణాల వ్యాపారం మంచి జోరుగా జరుగుతోంది. అమ్మవారికి నిత్యం ఆర్జిత సేవలు జరుగుతాయి. తెల్లవారుజామున అమ్మవారికి ఖడ్గమాలార్చన జరుగుతుంది. ఇది కాకుండా కుంకుమ పూజలు జరుగుతాయి. ఇందులో ఏ ఆర్జిత సేవలో, ఏ పూజలో ఈ కంకణాలు పెడుతున్నారో ఎవరికీ తెలియదు. అమ్మవారి పూజలో ఉంచిన కంకణాలు కట్టుకుంటే అంతా మంచే జరుగుతుందన్న మాటలు చెప్పి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. నిత్యం ఈ కంకణాల ముసుగులో వేలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. అమ్మవారిపై భక్తులకు ఉన్న భక్తిని కొంతమంది పురోహితులు క్యాష్ చేసుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

లీజు మాయ!

(5వ పేజీ తరువాయి)

కట్టబెట్టడం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది. కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం మూడు షాపులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇవ్వడానికి నెల రోజుల కిందట దేవస్థానం అధికారులు వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారులు నెలకు రూ.10 వేలు దేవుడి పాటగా నిర్ణయించి పాట నిర్వహించారు. పాడుకున్నవారు ఏడాది అద్దెను డిపాజిట్‌గా చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. అధికారులు వేలం పాట నిర్వహిస్తుండగా వేలం పాటకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించకుండా, ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పాట నిర్వహించడమేమిటని స్థానిక అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వారం రోజులు వాయిదా వేసి మళ్లీ పాట నిర్వహించారు.

సిండికేట్ అయిన పాటదారులు

అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో పాటదారులు సిండికేట్‌గా మారిపోయారు. నెలకు కనీసంగా రూ.10వేలు రావాల్సిన అద్దెను రూ.7,500కు కైవసం చేసుకున్నారు. దీంతో దేవస్థానానికి రావాల్సిన మెరుగైన ఆదాయాన్ని అధికారులు రాబట్టుకోలేకపోయారు. ఈ వ్యవహారంలో దేవస్థాన అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సిండికేట్‌గా మారి షాపులు దక్కించుకున్న వారు ఆ షాపుల్లో వ్యాపారాలు చేస్తున్నారా అంటే అదీ లేదు. తాము దక్కించుకున్న దుకాణాలను వారు సబ్ లీజులకు ఇచ్చారు. రూ.7,500 అద్దెకు దక్కించుకున్న దుకాణాలను రూ.12,500కు సబ్‌లీజులకు ఇచ్చుకున్నట్టు తెలుస్తోంది. దేవుడికి రావాల్సిన ఆదాయాన్ని పాటదారులు సిండికేట్‌గా మారి పోటీ లేకుండా తక్కువ అద్దెకు కైవసం చేసుకున్నారు. అందరి కళ్ల ముందే దేవుడి ఆదాయానికి గండి కొట్టి ఒక్కొక్కషాపు మీద నెలకు రూ.5వేలు మూడు షాపులు మీద ఏడాదికి రూ.1.80 లక్షల ఆదాయాన్ని దేవస్థానం కోల్పోయింది. అధికారులకు ఏమాత్రం పట్టలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇటీవలే నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. దేవుడి ఆదాయాన్ని పెంచాల్సిన పాలకవర్గం ఆదిలోనే ఆదాయానికి గండి పెట్టే విధానాలపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

హుండీ ఆదాయం రూ.10.30 కోట్లు

(5వ పేజీ తరువాయి)

122 గ్రాముల బంగారు ఆభరణాలు, 9 కేజీల 700 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. ఇంకా వివిధ దేశాల కరెన్సీలు భక్తులు అమ్మవారికి సమర్పించారు. రెండవ రోజు మంగళవారం 56 హుండీలు, 243 సంచులలో కానుకలు లెక్కించగా రూ.6,73,02,813 నగదు, 265 గ్రాముల బంగారు ఆభరణాలు, 9 కేజీల 750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. రెండు రోజుల పాటు 106 హుండీలు, 480 సంచులలో కానుకలను లెక్కించగా మొత్తం రూ.10,30,95,521 నగదు, 387 గ్రాముల బంగారు ఆభరణాలు, 19 కేజీల 450 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. ఈ కార్యక్రమంలో ఏసీ రంగారావు, ఏఈవోలు బి.వెంకటరెడ్డి, ఎస్.రమేష్ బాబు, వాసు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం

గతేడాది దసరా ఉత్సవాలు 10 రోజులతో పాటు మరో ఐదు రోజులు అదనంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.9,32,94,018 ఆదాయం లభించింది. అయితే ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు జరిగాయి. అధికారులు గత నెల 20వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు భక్తులు సమర్పించిన 16 రోజుల పాటు కానుకలను లెక్కించగా, మొత్తం రూ.10,30,95,521 ఆదాయం లభించింది. ఈ లెక్కన గత ఏడాది కంటే సుమారు కోటి రూపాయల ఆదాయం తక్కువగా వచ్చింది.

రామాయణంతో గొప్ప కవిగా మారిన వ్యక్తి వాల్మీకి

- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుహాసిని

విజయవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామాయణం రాసిన వాల్మీకి గొప్ప కవిగా ప్రఖ్యాతి గాంచారని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాకవి వాల్మీకి జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ఆయన రాసిన రామాయణం.. శ్రీరాముని జీవితం, ధర్మం, ప్రేమ, పరివర్తనకు మార్గదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ధర్మంగా ప్రేమతో, మంచి పరివర్తనతో కలిసిమెలిసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక అకాడమి సభ్యుడిగా పిల్లా చంద్రం



భారతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం దక్షిణభారతదేశ సమన్వయకర్తగా, సాంస్కృతిక అకాడమికి సలహామండలి సభ్యుడిగా అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్(ఎపిపిపిఎ)జాతీయ చైర్మన్, డాక్టర్ పిల్లా చంద్రం ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం(యుఎస్ఎ)కు కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయండి

- జనవిజ్ఞానవేదిక నేతలు

విజయవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు వెలగా శ్రీనివాస్, బోయి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక నేతలతో కలిసి డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావుతో కలిసి చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలగా శ్రీనివాస్ మాట్లాడుతూ, 35 సంవత్సరాలుగా జరుగుతున్న చెకుముకి సైన్స్ సంబరాలలో ప్రతి ఏడాది 5 లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 4 దశల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. నగరంలోని 80 పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రవికుమార్ తెలిపారు. నవంబర్ 1న నగర స్థాయి చెకుముకి సంబరాలు వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతాయని ఆయన తెలిపారు.

పాడిరైతు, సహకారరంగానికి పురస్కారం

- కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సహకారరంగంలో 25 ఎకరాల్లోని పాలఫ్యాక్టరీ స్వచ్ఛత, పరిశుభ్రతకు మారుపేరుగా నిలిచిన ప్రాజెక్ట్ కామధేను స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురస్కారం లభించడం గర్వకారణమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేనులో మంగళవారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురస్కారం సాధించినందుకు కార్మికులు, ఉద్యోగులతో కలిసి నిర్వహించిన సంబరాల్లో దాసరి బాలవర్ధనరావు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ప్లాంట్ మేనేజర్ సరితతో కలిసి పాల్గొన్నారు. ప్రాజెక్ట్ కామధేనుకు రాష్ట్ర అత్యున్నత స్వచ్ఛ పురస్కారం లభించడం పాడిరైతుకు, సహకారరంగానికి వచ్చిన పురస్కారంగా అభివర్ణించారు. పాల ఫ్యాక్టరీతో పాటు 1200 గ్రామాల్లోని సొసైటీలు, బీఎంసీలు, పరిశుభ్రత పాటిస్తూ బాధ్యతగా ప్రయాణించడం కృష్ణామిల్క్ యూనియన్‌కే సాధ్యమన్నారు. పాలకవర్గం నుంచి ఉద్యోగుల వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత, విధి నిర్వహణ వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పురస్కారం రావడం పట్ల కృష్ణామిల్క్ యూనియన్‌లోని ప్రతిపాడిరైతు ఆనందంతో ఉన్నారన్నారు. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా స్ఫూర్తితో పనిచేయడం వల్లే సహకారరంగంలోని కృష్ణామిల్క్ యూనియన్ ఈ పురస్కారం పొందడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభికి పాడిరైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురస్కార సంబరాల్లో చలసాని ఆంజనేయులు, కొల్లి ఈశ్వరబాబు, దాసరి వెంకట బాలవర్ధనరావు తదితరులు

నేడు జిల్లాలో పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ పర్యటన

- ప్రభుత్వ సంస్థల వార్షిక నివేదికలపై సమీక్ష

కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ నాయకత్వంలో శాసనసభ నుంచి ఏడుగురు సభ్యులు, శాసనమండలి నుంచి ముగ్గురు సభ్యులుగా గల కమిటీ నేడు ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారదు. జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ సంస్థల వార్షిక నివేదికలు, కార్యకలాపాలను ఈ కమిటీ సమీక్షించనుందన్నారు. కమిటీ 8వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో విజయవాడ పరిధిలో టూరిజం, ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్), ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తదితర సంస్థలకు సంబంధించిన కార్యకలాపాలపై అధికారులతో చర్చించనుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



రాష్ట్రం నుంచి వర్క్‌షాప్‌కు హాజరుకానున్న ఇంటాక్ సభ్యులు

ఢిల్లీ వెళ్లిన ఇంటాక్ సభ్యులు

- నేటి నుంచి జాతీయ స్థాయి వర్క్‌షాప్

లబ్బీపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇంటాక్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి 9వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌లో సభ్యులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తారు. దేశంలోని విభిన్న వారసత్వ రకాల జాబితా, డాక్యుమెంటేషన్, పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ఇంటాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్, చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా, మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్, వివిధ డివిజన్స్ డైరెక్టర్స్ డాక్టర్ స్వప్న, పూర్ణిమ, నిరూపమ, ఎ.విజయ, దీప్తిలు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా శిక్షణ, సామర్థ్య నిర్మాణం, వారసత్వంలో పరిశోధన తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. మంగళవారం నుంచి మూడురోజుల పాటు ఢిల్లీలోని ఇంటాక్ ప్రధాన కార్యాలయంలో జరిగే వర్క్‌షాపు నందు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఇంటాక్ సభ్యులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మేకల రవీంద్ర బాబు, ఎన్.సుకీర్తి, కె.ప్రవీణ్, డాక్టర్ రేణుకారాణి , ఎస్.మహిపాల్ రెడి, ఇ. రమేష్, ఎం.వెంకట సుబ్బారెడ్డి, నాగభూషణం, వెంకట్రామి రెడ్డిలు పాల్గొన్నారు.

టైర్ రీట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ ఫఖర్ అహమ్మద్



ఆటోనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ది విజయవాడ టైర్ రీట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జవహర్ ఆటోనగర్‌కు చెందిన షేక్ ఫఖర్ అహమ్మద్(బాబు)ఎన్నికయ్యారు. మంగళవారం జవహర్ ఆటోనగర్, గవర్నర్‌పేట్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో షేక్ ఫఖర్ అహమ్మద్ సమీప అభ్యర్థి సుభానీపై 218 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికలు రసవత్తరంగా సాగాయి.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు

విజయవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జేఏసీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా వార్డు వెల్ఫేర్ అండ్ డెవలెప్‌మెంట్ సెక్రటరీ జయకర్ కొమ్మూకూరి, జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్, కన్వీనర్‌గా కొప్పుల ఫణీంద్రను గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు ఎన్నుకున్నారు. మొత్తం 1400 ఉద్యోగులు బ్యాలెట్ ఓటింగ్ ద్వారా వీరిని ఎన్నుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బలమైన నాయకత్వం అవసరమని భావిస్తూ ఈ యాక్షన్ కమిటీని నియమించినట్టు వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ గంటయ్య తెలిపారు.



జేఏసీ ప్రతినిధులు

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

కౌన్సిల్ ఎజెండాపై మేయర్ సమీక్ష

కార్పొరేషన్: నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో బుధవారం జరిగే కౌన్సిల్ ఎజెండాపై శాఖాధిపతులతో సమీక్షించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలపై అధికారులు సహకరించాలని, ప్రజల కోసం నగరపాలక సంస్థ ఎప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో సీఈ శ్రీనాథ్‌రెడ్డి, సీసీపీ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇన్‌చార్జి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, సీఎంహెచ్‌వో డాక్టర్ అర్జున్‌రావు, ఎస్ఈలు, ఈఈలు, స్టేట్ ఫైర్ ఆఫీసర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ ఎస్ఎల్ఎఫ్‌గా అవార్డు అందుకుంటున్న మదర్ ఇండియా స్లమ్ సమాఖ్య ప్రతినిధులు



స్వచ్ఛ రైతుబజార్ అవార్డు అందుకుం టున్న ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్ ప్రతినిధులు



బెస్ట్ స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకుంటున్న బి.శంకర్



బెస్ట్ స్వచ్ఛ వారియర్ అవార్డు అందుకుంటున్న బత్తుల సామ్రాజ్యం

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

సిబ్బందికి నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచన



కార్మికురాలికి సూచనలిస్తున్న కమిషనర్

లబ్బీపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని, వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదని నగర కమిషనర్ ధ్యానచంద్ర సిబ్బందికి సూచించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం లబ్బీపేట వాటర్ ట్యాంక్‌రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, ఎన్ఆర్పీ రోడ్డు, శివాలయం రోడ్డు, కేదారేశ్వరపేట, రామలింగేశ్వరపేట, లోటస్ ల్యాండ్ మార్క్, బుడమేరు వంతెన, దేవీనగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించాలని సూచించారు. మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ నిల్వలను తొలగించాలని తెలిపారు. మధురానగర్‌లోని అన్న కాంటీన్‌ను పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

చెట్టు కొట్టేందుకు వచ్చి ప్రమాదవశాత్తు కూలీ మృతి

గుణదల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మంటాడకు చెందిన ఆళ్ల రమణ (36)మంగళవారం గాయత్రినగర్లోని నలంద స్కూల్లో చెట్టు కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. విజయవాడకు చెందిన ముఠామేస్త్రి సాంబ చెట్టు కొమ్మలు నరికేందుకు రమణను కూలీకి పిలిచాడు. మంగళవారం చెట్టు కొమ్మ కొడుతున్న క్రమంలో రమణ ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తోటి కూలీలు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమణ అప్పటికే చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

ఆందోళనకు దిగిన కూలీలు

రమణ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ముఠా కూలీలు నలంద పాఠశాల వద్ద మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని సీఐ హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

కళాశాల భవనం పైనుంచి దూకి ఎస్ఆర్ఆర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

గుణదల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మంగళవారం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కృష్ణలంక భ్రమరాంబపురానికి చెందిన సాగనబోయిన వెంకట రవి(21) ఎస్ఆర్ఆర్ కళాశాలలో బీకాం జనరల్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చదువు పూర్తికాగానే ఉద్యోగం వస్తుందోలేదో, డిగ్రీ పూర్తి చేయగలనో లేదో అన్న సందేహంతో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంకట రవిని ఆసుపత్రికి తరలించారు. రెండంతస్తుల భవనం పై నుంచి దూకడంతో అతని రెండు కాళ్లు మడం వద్ద విరిగిపోయాయి. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.

కరెంట్‌బావి స్థలానికి ఫెన్సింగ్ పనులు ప్రారంభం



మొగల్రాజపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడో డివిజన్‌లో ఆకతాయిలకు అడ్డాగా మారిన కరెంటు బావి స్థలానికి రక్షణగా మంగళవారం ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. ఆరునెలల క్రితం ఫెన్సింగ్ నిర్మాణం పనులు ప్రారంభించిన సందర్భంలో స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సందర్శించి స్థలం మొత్తం సర్వే చేయమని వీఎంసీ అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తిచేసి మారిన హద్దుల మేరకు మళ్లీ పనులు ప్రారంభించారు.

న్యాయవాదుల ర్యాలీ, ధర్నా

సుప్రీంకోర్టు సీజేఐపై దాడిని నిరసిస్తూ





న్యాయవాదుల ర్యాలీ, కాంగ్రెస్ నాయకుల నిరసన ప్రదర్శన

విజయవాడ లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ప్రయత్నాన్ని నిరసిస్తూ మంగళవారం బెజవాడ బార్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం సిటీ సివిల్ కోర్టుల నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత బందరు రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ఏకే బాషా, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్ కుమార్‌లు మాట్లాడుతూ ఇది న్యాయమూర్తిపై జరిగిన వ్యక్తిగత దాడి కాదని, న్యాయవ్యవస్థపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి చర్యలు జరగకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులతో పాటు బార్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

కృష్ణలంక : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సిటీ కాంగ్రెస్ కార్యాలయం నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వచ్చి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం మాట్లాడుతూ ఇది రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల రాజేశ్వరరావు, ఎన్.నర్సింహారావు, ఎస్కే అన్సారీ, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ విశాఖ ఎందుకు వస్తున్నారో చెప్పాలి

హేమంత్‌కుమార్ డిమాండ్

లబ్బీపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి ఈనెల 9న విశాఖకు ఎందుకు వస్తున్నారో సమాధానం చెప్పాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన హయాంలో కట్టకుండా వదిలేసిన నర్సీపట్నం మెడికల్ కాలేజీ పునాదులు చూడడానికా, రుషికొండ ప్యాలెస్‌కు మరోసారి సున్నాలు వేయించడానికా, మోగా డీఎస్సీ ఉద్యోగాలలో చేరిన వారిని ఓదార్చి మళ్లీ ఓటు వేయమని అడగడానికి వస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ క్యాంపు కార్యాలయంగా మారిన ఆంధ్ర యూనివర్సిటీని సందర్శించడానికి వస్తున్నారో ముందుగా ప్రజలకు, నిరుద్యోగులకు సమాధానం చెప్పిన తరువాత విశాఖకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

పోలీస్ కమిషనర్ రాజేఖరబాబు



విజయవాడ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చెక్కుచెదరని కుటుంబ విలువలు, ధర్మం, మానవ సంబంధాలను బోధించే ఉన్నతమైన ఆదర్శ కావ్యం రామాయణాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి సీపీ రాజశేఖరబాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ధర్మబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.



వీఎంసీలో ..

కార్పొరేషన్: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. తొలుత మేయర్ భాగ్యలక్ష్మి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాల్మీకి జయంతి సందర్భంగా మనకు జీవిత పాఠాలను నేర్పిన రామాయణాన్ని గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈ శ్రీనాథ్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి, మేనేజర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

జామాక్ సభ్యులందరికీ గృహ నిర్మాణాలు

- కో-ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మహమ్మద్ రిజ్వాన్



ఆటోనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ది జవహర్ ఆటోనగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ (జమాక్)లోని సభ్యులందరికీ గృహ నిర్మాణాలు చేపట్టాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు స్టోర్స్ చైర్మన్ మహమ్మద్ రిజ్వాన్ చెప్పారు. స్టోర్స్‌కు రెండో పర్యాయం చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం ఆయన ఆటోనగర్‌లోని కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ లాభనష్టాలు లేని విధంగా లబ్ధిదారుని డబ్బులతో గృహనిర్మాణాలు చేస్తామని తెలిపారు. ఏపీఐఐసీ నుంచి భూమిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి ఇప్పటికే 485 మంది సభ్యులకు ఆటోనగర్‌లోనే గృహాలు నిర్మించామన్నారు. మొత్తం తమ స్టోర్స్‌లో జవహర్ ఆటోనగర్‌లోని 26 అసోసియేషన్లకు చెందిన రెండు వేల మంది సభ్యులుగా ఉన్నారని , వీరందరికీ లాటరీ పద్ధతిలో భూమి కొనుగోలు చేసి గృహాలు నిర్మిస్తామని తెలిపారు.

మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగునకు చర్యలు

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కాలనీ పెద్దలు, కార్పొరేషన్ అధికారులు

భారతీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మంగళవారం తూర్పు పరిధి 3వ డివిజన్ కనకదుర్గ నగర్ పార్కు పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో డివిజన్‌లోని సమస్యలపై కాలనీ పెద్దలు, కార్పొరేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని డ్రెయినేజీ సమస్యను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం రూ.250కోట్లు మంజూరు చేసిందని, వాటిలో మొదటి విడతగా రూ.80కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మహానాడు రోడ్డు నిర్మాణంతో పాటుగా డ్రెయిన్ల నిర్మాణం చేస్తామన్నారు. పంటకాలువ రోడ్డులో ఉన్న డ్రెయిన్ ఎత్తు పెంచి కాంక్రీటు రాళ్లు ఏర్పాటుచేసి ఇబ్బంది లేకుండా చేయాల్సిందిగా ఆయన అధికారులను ఆదేశించారు.

కొండప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్య రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడి బాబూరావు, గద్దె రమేష్, నారాయణరావు, యలమంచిలి పండు, దాడి సుబ్బారావు, ధనేకుల యలమందరావు, కార్పొరేషన్ సీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈ సత్యకుమారి, ఈఈ సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ నగర్ రావిచెట్టు సెంటర్ వద్ద







పటమట సెంటర్‌లో డ్రెయిన్లలో నిలిచిన మురుగు, సరోజినీదేవి హాస్పిటల్ రోడ్డులో పూడుకుపోయిన సైడ్ కాల్వ

వ్యర్థాలతో నిండిన డ్రెయిన్లు

- మురుగు పారుదల లేక దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- దోమలతో రోగాలబారిన పడతామని భయాందోళనలో స్థానికులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 14, 15 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో సైడ్ డ్రెయిన్లు, మ్యాన్‌హోల్స్ వ్యర్థాలతో నిండిపోవడంతో ఏ చిన్న వర్షం పడినా పొంగి పొర్లుతున్నాయి. సైడ్ డ్రెయిన్లు చెత్తా, చెదారంతో నిండిపోయి మురుగు పారుదల లేదు. మురుగునీరుకు వర్షం నీరు తోడవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీనివలన ఈగలు, దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, కలరా, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు బారిన పడే ప్రమాదముందని ఆయా ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల డ్రెయిన్లు మట్టితో పూడుకుపోయాయి. దీనితో వర్షం వస్తే నీరు రోడ్డు మీదే నిలబడిపోతోంది.

- అంబేడ్కర్ నగర్ రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్నమ్యాన్‌హోల్ నిత్యం పొంగడం, మెయిన్‌రోడ్డుపై చెత్త తొలగించకపోవడంతో చెత్తా, చెదారం, వ్యర్థాలు కలిసి పోయి మురుగు నీరు ప్రవహిస్తుండడం వలన దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోనేరువారి వీధి సమీపంలో ...

- బందరు రోడ్డు కోనేరు వారి వీధి నుంచి మోహన్‌దాస్ థియేటర్ వరకు, పటమట సెంటర్ నుంచి రామాలయం వరకు సైడ్ కాల్వలు పూడుకుపోయాయి. బందరు రోడ్డు సోనోవిజన్ ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతోంది.
- 14వ డివిజన్ పటమట సెంటర్ నుంచి ఎన్ఎస్ఎం స్కూలుకు వెళ్లే మార్గంలో సైడ్ డ్రెయిన్లు పూడుకుపోయాయి. కొడాలి వారి వీధి ఎదురుగా వెంకట ధీరజ్ టవర్స్ అపార్టుమెంట్‌లో నుంచి వస్తున్న మురుగు నీరు సైడ్ కాలువలు పూడుకుపోవడం వలన పారుదల లేదు. కొడాలి వారి వీధి, సరోజిని దేవి హాస్పిటల్ రోడ్డు ఇరువైపులా సైడ్ డ్రెయిన్లు పూడుకుపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సైడు డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్న అన్నపరెడ్డి కోటిరెడ్డి, అక్కయ్య నాయుడు, విద్యార్థులు

మానసిక ఆరోగ్యంపై లయన్స్ క్లబ్ ప్రత్యేక వర్క్‌షాప్

గవర్నర్‌పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన ఉత్పాదకతకు, జీవితంలో సంతృప్తికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని ప్రముఖ ఆడిటర్, లయన్స్ జిల్లా క్యాబినెట్ కోశాధికారి ఎస్ అక్కయ్య నాయుడు అన్నారు. మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు సేవా వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ-వీఆర్‌కే నగర్ స్పార్క్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సురేష్ అండ్ బాబు చార్టర్డ్ అకౌంటెంట్స్ కార్యాలయంలో కార్పొరేట్ రంగం, ఉద్యోగులకు మానసిక ఆరోగ్యంపై వర్క్‌షాపు జరిగింది. దీనికి అక్కయ్య నాయుడు అధ్యక్షత వహించారు. లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి కష్ట సమయాలను అధికమించే మార్గాలను వివరించారు. మనస్తత్వవేత్త బావిశెట్టి రమేష్ నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్ ఆకర్షణగా నిలిచింది. సైకలాజికల్ పరీక్షలు నిర్వహించి పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగుల ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు.



సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైన ఏడీబీ బృందం సభ్యులు

రెండోరోజూ ఏడీబీ బృందం పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరుసగా 2వ రోజు కొనసాగింది. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపాల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్) మంగళవారం ఉదయం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ కే కన్నబాబు, అదనపు కమిషనర్లు జీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ తేజ్‌తో సమావేశమయ్యారు. అనంతరం బ్యాంకు బృందం అమరావతి సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్‌ను కలిశారు. అలాగే రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్‌ను ఆయన చాంబర్‌లో ఏడీబీ బృందం కలిశారు. ఈ సమావేశాలలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్లు అమిలినేని భార్గవతేజ్ పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో రాజధాని అమరావతి ప్రాజెక్టు పనుల్లో పురోగతి, ఏడీబీ అందచేస్తున్న ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

● భవనంపై నుంచి దూకడంతో గాయాలై ఆసుపత్రిపాలు

విజయవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాచవరంలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం తరగతి గది నుంచి బయటకు వచ్చి రెండో అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. కృష్ణలంకకు చెందిన రవి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి రిక్షా కార్మికుడు. ఉదయం 8 గంటలకు కళాశాలకు వచ్చిన రవి 11 గంటల వరకు తరగతి గదిలో ఉన్నాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా బయటకు వచ్చి భవనం పై నుంచి దూకేశాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థులు, అధ్యాపకులు రవిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యలో ఉన్న ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని రవి పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అనంతరం ఉన్నత చికిత్స నిమిత్తం అతడిని పుష్ప హోటల్ సెంటర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. రవి వైద్యానికయ్యే ఖర్చును కళాశాల అధ్యాపకులు భరిస్తున్నట్టు తెలిసింది. ఓ అధ్యాపకుడి వేధింపుల వల్ల రవి భవనం నుంచి దూకేసినట్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు వీటిని ఖండిస్తున్నాయి. రవి విద్యలో ప్రతిభావంతుడని చెబుతున్నారు.

19వ రోజుకు ఉచిత బూడిద లోడింగ్ ఉద్యమం



ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత బూడిద లోడింగ్ చేయించాలని, కాంట్రాక్టు ఇచ్చిన టెండర్ రద్దు చేయాలని డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారంతో 19వ రోజుకు చేరుకున్నాయి. సొసైటీ అధ్యక్షుడు కోయ వెంకట్రావ్ మాట్లాడుతూ ఈనెల 10 వరకు ఎన్టీటీపీఎస్ అధికారులు గడువు కోరారని ఆరోజు మా సమస్యను తొలగించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 40 రోజులుగా బూడిద ట్రిప్పులు లేక వాహనాల కిస్తీలు కట్టుకోలేక ఇప్పటికే ముగ్గురు టిప్పర్ యజమానులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కొంతమంది అలాంటి నిర్ణయాలు తీసుకోక ముందే జెన్కో యాజమాన్యం కళ్లు తెరవాలన్నారు.

ఇగ్నో పరీక్ష ఫీజు 20 వరకు పొడిగింపు

వన్‌టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) డిసెంబరు 2025లో నిర్వహించే టర్మ్ ఎండ్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో చెల్లించే పరీక్ష ఫీజు గడువు ఈనెల 20 వరకు పొడిగించినట్టు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కే సుమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 26 వరకు రూ.1100 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. డిసెంబరు సెషన్‌కు సమర్పించే అసైన్‌మెంట్ తేదీని ఈ నెల 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్నిగానీ, 0866-2565253 నెంబర్లోగానీ సంప్రదించవచ్చన్నారు.

కల్తీమద్యంపై జగన్ మాట్లాడటం విడ్డూరం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కల్తీ మద్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జే బ్రాండ్ లిక్కర్ మాఫియా జైలుకు వెళ్లటం ఖాయమని, వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం నడిపిందని, కల్తీ మద్యంతో వందలాది మంది ప్రాణాలు పోయాయన్నారు. ఈఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మద్యం మాఫియా - అవినీతి అక్రమాలపై ఉక్కు పాదం మోపిందన్నారు. ఈ కల్తీ మద్యం వెనుక ఎవరి కుట్ర కోణం దాగి ఉందో ప్రజలకు అర్థమైందన్నారు. తెరవెనుక సూత్రధారి జే గ్యాంగ్ లిక్కర్ డాన్ మరోసారి జైలు ఊచలు లెక్కించటం ఖాయమని ఆయన తెలిపారు.






స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న శ్రీ సుధీర్ సిరామిక్స్, నాగసింధు స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్, మ్యాట్రిక్స్ గ్లాస్, బెస్ట్‌సైడ్స్ మినరల్స్ ప్రతినిధులు

ఊరూ వాడా స్వచ్ఛ సేవక్ దళాలు

● సీఎం ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తాం ● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను మరింత ముందుకు తీసుకెళ్తాం

● త్వరలో విజయవాడ కెనాల్ నెట్‌వర్క్‌లో వాటర్ టాక్సీలు ● రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి



కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి జై స్వచ్ఛ సేవక్ నినాదాన్ని ఇచ్చారని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ సేవక్ దళాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్టు రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తెలిపారు. మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. తొలుత అతిథులు, స్వచ్ఛతా వారియర్స్‌తో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టాభిరామ్‌తో పాటు కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి 50 మంది విజేతలకు పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సీ ఎం ఆలోచనలకు అనుగుణంగా స్వచ్ఛాంధ్ర పురస్కారాలు అందచేస్తున్నామన్నారు. పురస్కారాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్రకు బ్రాండ్ అంబాసిడర్‌లని, సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయిలో 69 అవార్డులు, జిల్లాస్థాయిలో 1257 అవార్డులను వివిధ కేటగిరిల్లో అందించినట్లు పట్టాభి తెలిపారు. విజయవాడలో అద్భుతమైన కెనాల్ నెట్‌వర్క్ ఉందని, మైక్రో ఎస్టీపీల ద్వారా శుద్ధిచేసిన నీరు కాల్వలలోకి వెళ్లేలా చేస్తే త్వరలోనే వాటర్ టాక్సీల ఏర్పాటు సాకారమవుతుందన్నారు. దీంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. త్వరలో గ్రామాలకు 12వేల ట్రైసైకిళ్లు అందిస్తామని, 1600 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయనున్నామని, కొమ్మారెడ్డి తెలిపారు.

చిన్న పిలుపు, పెద్ద మార్పునకు నాంది: కలెక్టర్

ఓ చిన్న పిలుపు, సంకల్పం, పెద్ద మార్పునకు నాంది అవుతుందని, అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జిల్లా స్వచ్ఛాంధ్రలో ముందంజలో నిలిచిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే కార్యక్రమాలు మంచి ఫలితాలిచ్చాయన్నారు. సీఎం ఇచ్చిన జై స్వచ్ఛ సేవక్ నినాదం స్ఫూర్తిగా ఇకపైనా జిల్లాను స్వచ్ఛతలో నెం.1గా నిలిపేందుకు కృషిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

డ్రోన్, ఏఐ సాంకేతికతతో మంచి ఫలితాలు: సీపీ

స్వచ్ఛాంధ్రను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం వినూత్న విధానాలను అనుసరిస్తోందని, జిల్లాకు 8 రాష్ట్ర, 50 జిల్లా స్థాయి అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. పోలీసు కమిషనరేట్‌కు పురస్కారం రావడం చాలా సంతోషమన్నారు. కీలక ప్రగతి సూచికల (కేపీఐ)లో పురోగతిని ఎప్పటికప్పుడు మదించేందుకు డ్రోన్, ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరముందని సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

పురస్కారాలతో ఆరోగ్యకర పోటీ: సీపీ

స్వచ్ఛాంధ్ర పురస్కారాలతో స్వచ్ఛత, పరిశుభ్రత విషయంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు మధ్య ఆరోగ్యకర పోటీ వాతావరణం నెలకొంటుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శాస్త్రీయ విధానాలతో డేటా విశ్లేషణతో అవార్డులకు విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రీన్ అంబాసిడర్స్ బీ భూషణం, బీ సామ్రాజ్యం, శంకర్ తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. డీసీపీ కే జీవీ సరిత, జెడ్‌పీ సీఈవో కే కన్నమనాయుడు, డీపీవో పీ లావణ్యకుమారి, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కే బాలకృష్ణ, కే మాధురి, పురస్కార విజేతలు, శాఖల అధికారులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న స్వచ్ఛాంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న కేసీపీ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల విజేతలు

1. **అత్యుత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీలు:** నందిగామ మున్సిపాలిటీ
2. **అత్యుత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీలు:** పరిటాల, పెనుగంచిప్రోలు, జయంతి, ముప్పాళ్ల, జూపూడి.
3. **అత్యుత్తమ స్వచ్ఛ స్లమ్ లెవల్ ఫెడరేషన్స్:** మదర్ ఇండియా స్లమ్ సమాఖ్య, వీఎంసీ, శ్రీరామ, (కొండపల్లి మండలం), ఆంధ్ర మహిళ (నందిగా మండలం)
4. **అత్యుత్తమ స్వచ్ఛ రైతు బజారు:** ఏపీఐఐసీ రైతు బజారు (విజయవాడ నార్త్)
5. **అత్యుత్తమ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్:** కొండూరు, జూపూడి, మైలవరం, తక్కెళ్లపాడు, లింగగూడెం.
6. **అత్యుత్తమ స్వచ్ఛ ఎన్‌జీవోలు:** స్నేహాస్ఫూర్తి ఎన్‌జీవో
7. **అత్యుత్తమ స్వచ్ఛ ఆసుపత్రులు:** యూపీహెచ్‌సీ, పాత రాజరాజేశ్వరీపేట (వీఎంసీ), పీహెచ్‌సీ, నందిగామ, గొల్లమూడి (నందిగామ మండలం), విసన్నపేట సీహెచ్‌సీ.
8. **స్వచ్ఛ పాఠశాలలు:** ఏపీ మోడల్ స్కూల్, పెదకొమెర, కేజీబీవీ (బాలికలు), రంగాపురం, మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటుపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్.
9. **స్వచ్ఛ అంగన్‌వాడీలు:** కే కండ్రిక-4, లంబాడీపేట, మాగళ్లు, వావిలాల.
10. **స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు:** పోలీసు కమిషనర్ కార్యాలయం, కలెక్టరేట్, గొల్లపూడి సచివాలయం-2
11. **అత్యుత్తమ స్వచ్ఛ పరిశ్రమలు (లార్జ్/మెగా):** కేసీపీ లిమిటెడ్, శ్రీ సుధీర్ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్.
12. **అత్యుత్తమ స్వచ్ఛ పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు):** నాగసింధు స్పిన్నింగ్ జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మ్యాట్రిక్స్ గ్లాస్ ఇండస్ట్రీస్, బెస్ట్‌సైడ్స్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్.
13. **అత్యుత్తమ స్వచ్ఛ హాస్టళ్లు:** ఎస్‌డబ్ల్యూ గర్ల్స్ హాస్టల్, విసన్నపేట, ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్, జగ్గయ్యపేట, ప్రీ మెట్రిక్ బాలుర హాస్టల్, భవానీపురం, జీటీడబ్ల్యు ఆశ్రమ్ స్కూల్ (బాలురు), ఎ.కొండూరు
14. **అత్యుత్తమ స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్:** బీఆర్ అంబేద్కర్ గురుకులం, చందర్లపాడు మండలం.
15. **అత్యుత్తమ స్వచ్ఛ వారియర్స్:** బీ శంకర్, బత్తుల సామ్రాజ్యం, విజయవాడ, తమ్మిశెట్టి నాగరాజు, కొండపల్లి, ఎం భారతి, తిరువూరు, చావా జ్యోతి, జగ్గయ్యపేట
16. **అత్యుత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్స్:** గుణదల నాగేశ్వరరావు, చందర్లపాడు, సత్తెనపల్లి బాలమ్మ, జూపూడి, దొండపాటి నాగలక్ష్మి, గూడవల్లి, బెజ్జం భూషణం, కంచికచర్ల, ఎం కాశమ్మ, గంగ్రాయి.

మెడికల్ కాలేజీల పనులు

కూటమి రాకతో వేగవంతం

● 17 మెడికల్ కాలేజీల్లో ఎన్ని పూర్తి చేశారో సమాధానం చెప్పాలి: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల గురించి జగన్‌రెడ్డి అండ్ కో చేస్తున్న ఓవర్ యాక్షన్ హాస్యాస్పదంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడారు. జీవోనెం. 107, 108, 133 ద్వారా ఎన్‌ఆర్‌ఐ కోటా, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా ప్రకటించి, రూ. 20లక్షలు, రూ.15 లక్షల ఫీజు నిర్ణయించిందెవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందే అన్న ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 28 మెడికల్ కాలేజీలు నిర్మించామన్నారు. 17 మెడికల్ కాలేజీల గురించి మాట్లాడుతున్న జగన్‌రెడ్డి వాటిలో ఎన్ని పూర్తిచేశారో సమాధానం చెప్పగలరా? ఆ కాలేజీలకు రాష్ట్రం ఇచ్చిన నిధులెంతో చూపించగలరా అన్నారు. మెడికల్ కాలేజీలు పూర్తవ్వాలంటే రూ.8450 కోట్లు అవసరం, రాష్ట్ర ప్రభుత్వం రూపాయి ఖర్చు చేయకపోవడం వల్లే ఒక్క కాలేజీ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలన్నీ పూర్తి చేసి 1750కి పైగా మెడికల్ సీట్లు విద్యార్థులకు అందిస్తామన్నారు. మద్యం విషయంలో వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. తాడేపల్లి ఖజానా నింపుకోవడం కోసం ప్రజల ప్రాణాలు హరించిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని, కూటమి ప్రభుత్వం వచ్చాక మెరుగైన మద్యం పాలసీ తెచ్చామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

34శాతం బీసీలకు రిజర్వు చేస్తాం


నగరపాలక సంస్థ డివిజన్‌లోని 50 డివిజన్లలో 34 శాతం బీసీల కు రిజర్వు చేస్తామని, ఈ మేరకు తాజాగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. కాగా, గతంలో సంస్థలో విలీనం చేద్దామనుకున్న 9 గ్రామ పంచాయతీలను విలీనం చేయమని, ఆ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచేనాని, మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ రూరల్ మండల కార్యదర్శి కాటం మధు, కొరెడ్ల సుశీల, పాలపర్తి పద్మజ, ఇలియాస్ పాషా, లంకే నారాయణప్రసాద్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్వాధీనం..!

● లిడ్‌క్యాప్ నియంత్రణలోకి ఆటోనగర్‌లో రూ.100 కోట్ల ఖరీదైన స్థలం

● కోర్టుల్లో లిడ్‌క్యాప్‌కు ఉపశమనం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బందరు రోడ్డును ఆనుకుని, ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు ప్రారంభంలో ఉన్న రూ.100 కోట్ల అత్యంత ఖరీదైన తమ స్థలాన్ని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్‌క్యాప్) ఎట్టకేలకు స్వాధీనంలోకి తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో లీజు పేరిట వైఎస్ఆర్ ట్రేడర్స్ అనే సంస్థ దీన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే! లీజు గడువు తీరినా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఖాళీ చేయకుండా కోర్టు కేసులతో ముప్పతిప్పలు పెడుతున్న నేపథ్యంలో, లిడ్‌క్యాప్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. వైఎస్ఆర్ ట్రేడర్స్‌కు వైసీపీ ప్రభుత్వం లీజుకు ఇచ్చిన పాత భవనాన్ని కోర్టు తీర్పుతో తాజాగా తమ ఆధీనంలోకి తీసుకోవటంతో పాటు దాన్ని కూల్చివేసింది. వైఎస్ఆర్ ట్రేడర్స్‌కు సంబంధించిన వస్తు సామాగ్రి ఉండటంతో రెవెన్యూ అధికారులతో పంచనామా నిర్వహించి వాటిని పాత రేకులషెడ్‌లో ఉంచింది. సామగ్రి తీసుకువెళ్లాలని లిడ్‌క్యాప్ యాజమాన్యం నోటీసు ఇవ్వగా ఇప్పటి వరకు తీసుకువెళ్లలేదు. పైగా మరోమారు హైకోర్టుకు వెళ్లి స్వల్పకాలానికి స్టే తెచ్చుకుంది. న్యాయస్థానం పదేపదే లిడ్‌క్యాప్‌కు అనుకూలంగా తీర్పులిస్తున్నప్పటికీ స్టే ల కోసం పిటిషన్లు వేస్తూ వైఎస్ఆర్ ట్రేడర్స్ సంస్థ కాలహరణం చేస్తోంది. లిడ్‌క్యాప్ స్థలాన్ని, భవనాన్ని స్వాధీనం చేసుకోవటంతో రానున్న రోజుల్లో ఎలాంటి సమస్య వచ్చే అవకాశం లేదు. దీంతో ఈ ఖరీదైన స్థలంలో 'లెదర్ భవన్' ఏర్పాటుకు లిడ్‌క్యాప్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. లిడ్‌క్యాప్‌కు ఇప్పటికే ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) ద్వారా 'లెదర్ భవన్' ఏర్పాటుకు డిజైన్లు రూపొందించారు. జీ ప్లస్ 10 విధానంలో రూ.100 కోట్ల వ్యయంతో లెదర్ బిల్డింగ్‌కు శ్రీకారం చుట్టింది. డిజైన్లు పూర్తయ్యాక సీఎం చంద్రబాబు సమక్షంలో అంతిమ నిర్ణయం తీసుకోనున్నారు.



స్వచ్ఛ చల్లపల్లికి కీర్తి కిరీటం

● రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా గుర్తింపు

● స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్న సర్పంచ్, కార్యదర్శి



ఆంధ్రజ్యోతి, చల్లపల్లి: స్ఫూర్తివంతమైన స్వచ్ఛ సేవాయజ్ఞంతో పేరు ప్రతిష్ఠలు సాధించిన చల్లపల్లి గ్రామానికి మరో కీర్తికిరీటం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లి గ్రామం రాష్ట్రస్థాయి అవార్డును సొంతం చేసుకుని స్వచ్ఛ ఘనతను సగర్వంగా చాటిచెప్పింది. రాష్ట్రంలో ఎన్నో పంచాయతీలున్నా స్వచ్ఛ అవార్డులు అందుకు న్న అతి కొద్ది పంచాయతీల్లో కృష్ణాజిల్లాకు చెందిన చల్లపల్లి గ్రామం చో టు సాధించి రాష్ట్రస్థాయి అవార్డును సాధించుకోవటం గర్వకారణంగా నిలుస్తోంది. అంతేకాక జిల్లాస్థాయిలోనూ మరో నాలుగు అవార్డులు లభించటంతో చల్లపల్లికి ఎనలేని ఖ్యాతి లభించింది. అన్నీ స్వచ్ఛ పంచాయతీలయితే రాష్ట్రం పర్యాటకంగా మరింత వర్ధిల్లుతుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కలలు కన్న విజన్ - 2047 లక్ష్యాలకు చేరువ కావటానికి ఎంతో సమయం పట్టదు.

8 అంశాల్లో పనితీరు ప్రామాణికంగా..

స్వచ్ఛ గ్రామపంచాయతీగా చల్లపల్లి ఎంపికయ్యేందుకు 8 అంశాల్లో పనితీరును ప్రామాణికంగా తీసుకున్నారు. జిల్లాస్థాయిలో కమిటీ పరిశీలన, సెంట్రల్ టీమ్ తనిఖీ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తరపున రాష్ట్రస్థాయి బృందం పరిశీలన అనంతరం వారి నివేదిక, సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం అవార్డులకు ఎంపికచేసింది. సంపద తయారీ కేంద్రం పనితీరు, క్లీన్ అండ్ గ్రీన్ విజిబుల్ విలేజ్, గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, కమ్యూనిటీ టాయిలెట్స్, వర్మికంపోస్ట్ తయారీ,విక్రయం, డ్రై వేస్ట్ సేకరణ, విక్రయం, చెత్త సేకరణ, గ్రీన్ అంబాసిడర్స్ పనితీరు పరిశీలన, గ్రామంలో మొక్కల పెంపకం వంటివాటిని పరిగణలోకి తీసుకున్నారు.

మారిన రూపురేఖలు

2014 నుంచి స్ఫూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛ చల్లపల్లితో పంచాయతీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు గ్రామ స్వచ్ఛత, పరిశుభ్రతకు శ్రమిస్తున్నారు. ప్రభుత్వ ఆకాంక్షలకు మించి స్వచ్ఛ చల్లపల్లి సేవాయజ్ఞం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి మంచి ఫలితాలను రాబడుతోంది. నాడు జడ్పీటీసీగా, నేడు చల్లపల్లి సర్పంచ్‌గా పైడిపాముల కృష్ణకుమారి స్వచ్ఛ కార్యకర్తగా, ప్రజాప్రతినిధిగా స్వచ్ఛతకు, గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తూ చల్లపల్లికి కీర్తిని అందిస్తున్నారు.

జిల్లాకూ నాలుగు అవార్డులు

స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లికి రాష్ట్ర అవార్డు రాగా, మరో 4 అవార్డులు చల్లపల్లికి వచ్చాయి. గ్రామాభివృద్ధికి విశేష కృషిచేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు స్వచ్ఛ ఎన్‌జీవోగా, చల్లపల్లి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు స్వచ్ఛ సీహెచ్‌సీగా, చల్లపల్లి నారాయణరావునగర్ అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రంగా, స్వచ్ఛ గ్రీన్‌అంబాసిడర్‌గా చల్లపల్లి పారిశుధ్య కార్మికురాలు సొంతల జయలక్ష్మిలు జిల్లా అవార్డులకు ఎంపికై స్వీకరించారు.

మా గ్రామానికి గర్వకారణం

పైడిపాముల కృష్ణకుమారి, చల్లపల్లి సర్పంచ్

స్వచ్ఛ పంచాయతీగా చల్లపల్లి గ్రామ పంచాయతీ ఎంపికవటంతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డును స్వీకరించటం చాలా సంతోషంగా ఉంది. డాక్టర్ డీఆర్‌కే ప్ర సాద్, డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో జరుగుతున్న స్వచ్ఛచల్లపల్లి గ్రామానికి వరం. పంచాయతీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సహకారం, పారిశుధ్య కార్మికుల శ్రమ మరిచిపోలేనిది. చల్లపల్లి అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

స్వచ్ఛ కార్యకర్తల కృషికి గుర్తింపు

డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి

చల్లపల్లి గ్రామపంచాయతీ స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు సాధించటం సంతోషం. స్వచ్ఛ చల్లపల్లిలో ని స్వార్థంగా సేవలందిస్తు న్న స్వచ్ఛ కార్యకర్తల కృషి అసామాన్యం. స్వచ్ఛత, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి భాగస్వామ్యం అవార్డు సాధించేందుకు కారణం.

స్ఫూర్తిని కలిగిస్తున్న అవార్డులు

పీవీ మాధవేంద్రరావు, కార్యదర్శి

స్వచ్ఛ పంచాయతీగా రాష్ట్ర అవార్డు, గ్రామంలో మరో నాలుగు జిల్లా అవార్డులు సాధించటం సంతోషకరం.

కల్తీ మద్యంపై విచారణ జరిపించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కుంభకోణంపై సి టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రా ష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఇ బ్రహీంపట్నం రింగ్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధ ర్నా, నిరసన ప్రదర్శన చేపట్టారు. మద్యం సీసాలు పగులకొట్టి మహిళలు నిరసన తెలిపారు. కల్తీ మద్యం తయారీ ప్రాంతాన్ని బాబూరావు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ములకలచెరువు కల్తీ మద్యం రాకెట్ ఇబ్రహీపట్నంలో బట్టబయలైందన్నారు. కూటమి ప్ర భుత్వం చిత్తశుద్ధితో మద్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే సరోజ, సీపీ ఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి మమేష్, విటల్‌రావు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్‌కు అనుమతులు: ఎంపీ

మచిలీపట్నం: మంగళగిరిలోని ఎయిమ్స్‌లో ట్రామాకేర్ సెంటరు ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం అనుమతులిచ్చిందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఎయి మ్స్ పాలకవర్గ సభ్యుడిగా ఉన్న బాలశౌరి ట్రామాకేర్ సెంటర్, కేన్సర్ రీసెర్చ్, క్రిటికల్‌కేర్ విభాగాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కేంద్రంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
8 అక్టోబరు 2025



చిట్టిపొట్టి 'ప్రిన్సెస్'

వేడుకల్లో ఆడపిల్లలకు వేసే డ్రస్సులు వినూత్నంగా ఉండాలంటే ప్రిన్సెస్ గౌన్స్ ఎంచుకోవాలి. చూడముచ్చటగా కనిపించే ప్రిన్సెస్ గౌన్స్ నేడు ఎన్నో రకాల డిజైన్లలో రూపొందుతున్నాయి. ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!

చిట్టిపొట్టి గౌన్లకు బదులుగా పాదాల వరకూ పొడవుగా ఉండే ప్రిన్సెస్ గౌన్స్... నెట్టెడ్, ఎంబ్రాయిడరీ, ఫ్యూజన్... ఇలా ఎన్నో రకాల డిజైన్లలో రూపొందుతున్నాయి. పలు రకాల సెక్విన్లు, పూసలు, జరీ వర్క్‌లతో తయారవుతున్న ఈ గౌన్స్ అన్ని రకాల వేడుకలకూ అనువుగా ఉంటాయి. అయితే ప్రిన్సెస్ గౌన్స్‌లో ఆడపిల్లలు రాకుమారిలా వెలిగిపోవాలంటే ఇంకొన్ని హంగులు కూడా జోడించాలి. అవేంటంటే...

- మెరుపులు చిందించే శాండిల్స్ ఎంచుకోవాలి. అయితే హీల్ లేకుండా చదునుగా ఉండేవైతే పిల్లలు సౌకర్యంగా నడవగలుగుతారు
- ప్రత్యేకించి పిల్లల కోసం కూడా సౌందర్య సాధనాలుంటాయి. కాబట్టి సున్నితమైన చర్మాలకోసం తయారైన మేకప్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి
- గౌన్ అసౌకర్యంగా లేకుండా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా గౌన్ లోపలి వైపు సుతిమెత్తని మెటీరియల్ లైనింగ్ ఉండేలా చూసుకోవాలి
- పిల్లల కోసమే ప్రత్యేకంగా తయారయ్యే హ్యాండ్ బ్యాగ్స్ కూడా దొరుకుతాయి. గౌన్‌తో హ్యాండ్ బ్యాగ్ కూడా మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి
- వాచ్‌ను ఇష్టపడే పిల్లల కోసం క్రిస్టల్స్‌తో తయారైన డయల్, స్ట్రాప్ కలిగిన వాచీని ఎంచుకోవాలి.



ప్రతిభ ఏ మూలన ఉన్నా ప్రపంచం నలుమూలలకూ వ్యాపిస్తుంది. ఇందుకు పరమ్‌జీత్ కౌర్ ఉదంతమే ఉదాహరణ. పంజాబ్‌లోని మోగాకు చెందిన ఈ 19 ఏళ్ల అమ్మాయి... యువ ర్యాపర్‌గా సంగీతాభిమానుల మనసులు చూరగొంటోంది. 'దట్ గర్ల్' పాటతో లేడీ మూసేవాలాగా పేరు తెచ్చుకుంటున్న పరమ్ గురించి మరిన్ని వివరాలు...

ఈ యువ ర్యాపర్ కథే వేరు

తల్లి ఇళ్లలో పనులు చేస్తూ ఉంటుంది. తండ్రి రోజువారీ కూలీ. తమకొచ్చే కొద్దిపాటి సంపాదనతో కూతుర్ని వృద్ధిలోకి తీసుకురావాలన్నది వాళ్ల కల. తమ కష్టానికి ఎప్పటికైనా ప్రతిఫలం దక్కుతుందనీ, భగవంతుడు ఎప్పటికైనా కరుణిస్తాడనీ ఆశపడిన ఆ నిరుపేద తల్లిదండ్రుల కలలు ఎట్టకేలకు ఫలించాయి. కాలేజీలో ఇంటర్ చదువుకుంటున్న 19 ఏళ్ల పరమ్‌జిత్ కౌర్ చదువులోనే కాదు, సంగీతంలో కూడా ప్రతిభ కనబరచడం మొదలుపెట్టింది. మొదట్లో ఇంట్లో కూని రాగాలు తీస్తూ, లల్లాయి పాటలు పాడుకుంటూ ఉండేది. ఆమెది అదురు బెదురులేని నైజం. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె పాటల్లో ధ్వనించడం గమనించిన తల్లితండ్రులు పరమ్‌ను మరింత ప్రోత్సహించారు. కానీ వాటికెలా ఒక రూపాన్నివ్వాలో, ఏ జోనర్‌లోకి చేర్చాలో పరమ్‌కు తెలియదు. అదే సమయంలో కాలేజీలో తన స్నేహితులు, తోటి విద్యార్థులు పాటలు రాస్తూ పాడుతూ ఉండడం పరమ్ గమనించింది. వాటి ద్వారా తాను ఎంచుకున్న శైలిని 'ర్యాప్' అంటారనే విషయాన్ని గ్రహించింది. అలా పాటలు రాస్తూ, పాడడం మొదలుపెట్టింది. అలా ఆమె ప్రతిభ ఇంగ్లండ్‌కూ పాకింది. అక్కడ స్థిరపడిన రికార్డ్ ప్రొడ్యూసర్ మన్ని సంధు... పరమ్ పాటలు విని వాటిని రికార్డు చేసి ప్రపంచానికి వినిపించాలనే ఆలోచనతో పంజాబ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి పరమ్ కథ ఊహించని మలుపు తిరిగింది.



సాదాసీదాగా మొదలై...

"దట్ గర్ల్ పాటను మేమెలాంటి ఖరీదైన ఆధునిక స్టూడియోలోనూ రికార్డు చేయలేదు. రికార్డింగ్ కోసం ఒక సాధారణ హోటల్ గదిని ఎంచుకున్నాం. కాబట్టే పాటలో కార్ల హారన్ల మోతలూ, అరుపులూ వినిపిస్తూ ఉంటాయి. ఆ తర్వాత నేను ఆ పాటను స్టూడియోకు తీసుకువెళ్లి చిన్న చిన్న మెరుగులు దిద్దాను. అలాగే మ్యూజిక్ వీడియో కోసం నిపుణులైన వీడియోల రూపకర్తలను సంప్రతించాం. వీడియో ఎలా ఉండాలని కోరుకుంటున్నామో వివరించాం. మా ఆలోచన ఆధారంగా వాళ్లు అద్భుతమైన వీడియో రూపొందించారు. ఇప్పుడీ పాటకు ఇంత ఆదరణ దక్కడం ఎంతో సంతోషంగా ఉంది. పరమ్ విజయానికి ఇది ఆరంభం మాత్రమే!" అంటూ పరమ్ తొలి ర్యాప్ సాంగ్ 'దట్ గర్ల్' రికార్డింగ్ గురించి వివరించాడు రికార్డ్ ప్రొడ్యూసర్ మన్ని సంధు. స్వతంత్ర లేబుల్‌తో విడుదలైన 'దట్ గర్ల్' పాట నేడు యువతను ఉర్రూతలూగిస్తోంది. విడుదలైన 11 రోజుల్లోనే యూట్యూబ్‌లో ఆరు లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా పరమ్‌జిత్ కౌర్ ఫాలోవర్ల సంఖ్య నాలుగున్నర లక్షలకు పెరిగిపోయింది.



లేడీ మూసేవాలా...

ప్రత్యేకించి 'దట్ గర్ల్' పాటలోని శక్తివంతమైన లిరిక్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. గతంలో హత్యకు గురైన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా పాటలను మరిపిస్తూ ఉండడంతో ఇప్పుడు అందరూ పరమ్‌ను 'లేడీ మూసేవాలా' అని సంబోధించడం మొదలుపెట్టడం విశేషం. తన విజయం గురించి మాట్లాడుతూ... "ఇదంతా యాదృచ్ఛికంగా జరిగిపోయింది. ఈ పాట ఇంత విజయం సాధిస్తుందని నేను ఊహించలేదు. నాకసలు ర్యాప్ అంటే ఏంటో కూడా తెలియదు. కానీ స్నేహితుల ద్వారా నా పాటలకొక శైలి ఉన్నట్టు తెలుసుకున్నాను. పాటలతో వచ్చే ఆదాయంతో నా కుటుంబాన్ని ఆదుకోవాలనుకుంటున్నాను. అమ్మానాన్నల కోసం ఒక అందమైన ఇల్లు నిర్మించాలనే ఆలోచన ఉంది" అంటున్న పరమ్ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం!

వినూత్నం



కరువుకు, వలసలకు నిలయమైన రాయలసీమలోని ఓర్వకల్లు ప్రాంతాన్ని, అభివృద్ధికి చిరునామాగా మార్చారు బత్తుల విజయభారతి. పేద మహిళలను పొదుపుబాట పట్టించారు. వందల కోట్ల రూపాయల లావాదేవీలు సాగించే స్థాయికి ఎదిగేలా ప్రేరణనిచ్చారు. ముప్ఫయ్యేళ్ల క్రితం ఆమె నాటిన పొదుపు విత్తనం మహా వృక్షంగా మారి, వేలాది మందికి ఆధారంగా నిలుస్తోంది ఓర్వకల్లు మండలం పొదుపులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారు విజయభారతి కథ... ఆమె మాటల్లోనే...

ఆ పొదుపు పాట ప్రార్థనా గీతమైంది!

"అది 1995 ఆగస్టు నెల. యూఎన్‌డీపీ (ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం) చేపట్టిన దక్షిణాసియా పేదరిక నిర్మూలన కార్యక్రమం తరఫున ప్రాజెక్టు ఆఫీసరుగా కర్నూలు జిల్లాకు వచ్చాను. నాకు ఆ ప్రాంతం గురించి ఏ మాత్రం అవగాహన లేదు. మా కార్యక్రమంలో మహిళలను ఎలా భాగస్వాముల్ని చేయాలి? పల్లెలకు వెళ్లి చెబితే... నా మాటలు వింటారా? ఒక బృందంగా కలిసి నడుస్తారా? ఇవన్నీ ఆ రోజు నా మదిలో మెదిలిన ప్రశ్నలు. ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు నంద్యాలలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి నేనూ వెళ్లాను. అక్కడ ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు నాకు పరిచయమయ్యారు. వారి ఊరికి వస్తానంటే... ఆప్యాయంగా ఆహ్వానించారు. రెండు రోజుల తరువాత ఆ గ్రామం వెళ్లి, ఆ మహిళలను కలిశాను. ఆ తరువాత క్రమం తప్పకుండా అక్కడికి వెళ్లేదాన్ని. రోజూ పదిమంది మహిళలను కలిసి, పొదుపు ఆవశ్యకతను వివరించేదాన్ని. "రోజంతా కష్టపడితే నాలుగు రూకలు కావడంలేదు. రోజుకో రూపాయి పొదుపు అంటే ఎలాగమ్మా?" అంటూ మొదట్లో వాళ్లు పట్టించుకోలేదు. ఈలోగా అప్పటి సీఎం చంద్రబాబు పొదుపు ఉద్యమాన్ని ఊరూరుకీ తీసుకువెళ్లారు. దాంతో... పది మహిళలను ఒప్పించి తొలి పొదుపు సంఘం ఏర్పాటు చేయగలిగాను. అనంతరం ఉశేనాపురం గ్రామం వైపు అడుగులు వేశాను. అలా 25 గ్రామాల్లో పొదుపు ఉద్యమ స్ఫూర్తిని రగిలించగలిగాను.

సామాజిక అంశాలపై దృష్టి

మహిళలను రోజుకో రూపాయి పొదుపు ఉద్యమ బాటలో నడిపించాలంటే.. పల్లెసీమల్లో పట్టిపీడిస్తున్న సమస్యల మీద దృష్టి పెట్టడం ముఖ్యమని నిర్ణయించాం. తల్లులు పనికి వెళ్తే.... వారి పసిపిల్లల ఆలనాపాలన చూసేలా... ఆయాలను నియమించి, 'అమ్మఒడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల విద్య, ఒంటరి మహిళలకు చేయూత, విద్య, ఆరోగ్యం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్ల నిర్మాణం... ఇలా సామాజిక అంశాలపై కూడా చైతన్యం కలిగించాం. అప్పటి జిల్లా కలెక్టరుతో మాట్లాడి, వితంతువులు, భర్తలు వదిలేసిన మహిళల కోసం కాల్వ గ్రామంలో 'జీవన జ్యోతి కాలనీ' నిర్మించాం. వివిధ గ్రామాల్లో 2,500 మంది బాల కార్మికులను గుర్తించి, వారి కోసం 'భవిత బాల కార్మికుల పాఠశాల'ను ఏడేళ్లు నిర్వహించాం. చదువుతో పాటు ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో సీట్లు వచ్చేలా శిక్షణ ఇప్పించాం. ఆ పిల్లలు జీవితంలో స్థిరపడేంత వరకు చదివించాం. వాళ్లలో వంద మంది నర్సులు, ముగ్గురు డాక్టర్లు, 24 మంది ఇంజనీర్లు, ఇద్దరు ఎస్‌ఐలు ఉన్నారు. పలువురు ఉపాధ్యాయులుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా స్థిరపడ్డారు. 2000 సంవత్సరంలో మహిళల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ' (సెర్ప్)ని నాటి సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారు. అది దేశంలోనే తొలి ప్రయోగం. దాని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలతో పనిచేసే అవకాశం కలిగింది. ఆ సమయంలో 'జీవితాన వెలుగుందని నమ్మకాన్ని పెంచుదాం...' అనే పాట రాశాను. ఇప్పుడు అది రెండు తెలుగు రాష్ట్రాల్లో పొదుపు మహిళల ప్రార్థన గీతం అయ్యింది. 'సెర్ప్'ను దేశంలోని అన్ని రాష్ట్రాలు 'స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్' (ఎస్‌ఆర్‌ఎల్‌ఎం) పేరిట అమలు చేయడంలో కర్నూలు జిల్లాకు దివంగత మాజీ గవర్నర్ పెండేకంటి వెంకట సుబ్బయ్య కుమారుడు సీనియర్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ కృషి ఎంతో ఉంది.

బోధన నుంచి పొదుపు ఉద్యమం వైపు



మా స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలు. నాన్న బి.రామయ్య సమాచార, ప్రజా సంబంధాల శాఖలో జిల్లా పీఆర్‌వోగా, అమ్మ పి. అంజిమ్మ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి, రిటైర్ అయ్యారు. నేను ఎంఈడీ పూర్తి చేసి... నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను. నా చెల్లెళ్లలో భవాని డాక్టరుగా, రమా సుందరి గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తమ్ముడు శ్రీనివాస్ చక్రవర్తి యూఏఈలో స్థిరపడ్డాడు. నేను లెక్చరర్‌గా పని చేస్తున్న సమయంలో 1991లో సంపూర్ణ అక్షరాస్య కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. నన్ను రిసోర్స్ పర్సన్‌గా తీసుకున్నారు. ఆ తరువాత డ్వాక్రా (పొదుపు) ఉద్యమానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో నేను చురుగ్గా పాల్గొనడంతో... నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీ సతీశ్ చంద్ర సూచన మేరకు నాటి కలెక్టరు ఎం.సాంబశివరావు నన్ను డీఆర్‌డీఏ డ్వాక్రా ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమించారు. అలా బోధన నుంచి పొదుపు ఉద్యమ బాట పట్టాను. నెల్లూరు జిల్లా లేగుంటపాడు గ్రామంలో... తొలి రూపాయి పొదుపు కార్యక్రమం మొదలు పెట్టాం. ఆ తరువాత కుప్పంలో మూడు నెలలు పని చేశాను. అదే సమయంలో యూఎన్‌డీపీ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు జిల్లాలో ఏడు మండలాలు ఎంపికయ్యాయి. అలా... ప్రాజెక్టు ఆఫీసరుగా ఓర్వకల్లుకు వచ్చాను.

రూ.395 కోట్లు టర్నోవర్

కాల్వ గ్రామంలో పది మందితో ఒక సంఘంగా మొదలైన పొదుపు ఉద్యమం ఊరూరా విస్తరించింది. 1998లో 500 పొదుపు సంఘాలతో.... 5 వేల మందితో ఏర్పాటైన 'ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘం' పరిధిలో.... ప్రస్తుతం 1,250 సంఘాలున్నాయి. 12,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ.1.20 కోట్లు, యూఎన్‌డీపీ ప్రాజెక్టు సీడ్ క్యాపిటల్ రూ.30 లక్షలు కలిపి ఐక్య సంఘానికి రూ.1.50 కోట్ల నిధి చేకూరింది. ఆ డబ్బును పొదుపు సంఘాలకు 12 శాతం వడ్డీకి అప్పులు ఇవ్వడం, ఇచ్చిన అప్పు సకాలంలో వసులు చేయడం ద్వారా ఐక్య సంఘం నిధి దాదాపు రూ.5.50 కోట్లకు చేరింది. మహిళలే సొంతంగా 'మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ' (మహిళా బ్యాంక్) ఏర్పాటు చేశారు. రూపాయి పొదుపుతో మొదలు పెట్టిన ఈ సంఘాలు సుమారు రూ.395 కోట్ల టర్నోవర్‌కు చేరాయంటే మహిళలు సాధించిన విజయమే. వారు 3.75 ఎకరాల్లో మండల ఐక్య సంఘం సొంత ఆఫీసు, 15 గ్రామాల్లో గ్రామ సమాఖ్య ఆఫీసులు నిర్మించుకున్నారు. మా ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 'నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్' హోదా ఇచ్చింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే కాదు... గ్రామ, మండల సమాఖ్య లీడర్లు సీఆర్‌పీలుగా పలు రాష్ట్రాలకు వెళ్లి సుమారుగా 50 వేల మంది శిక్షణ ఇచ్చారు. శ్రీలంక, ఇటలీ, మాల్దీవులు, నేపాల్ తదితర దేశాలకు వెళ్లి, అక్కడి జీవన ప్రమాణాలపై అధ్యయనం చేసే స్థాయికి ఓర్వకల్లు మహిళలు చేరుకున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమంలో భాగంగా మా మండల ఐక్య సంఘం ద్వారా పది కుటుంబాలను ఎంపిక చేశాం. పేదరికం వల్ల విద్యకు దూరం అవుతున్న పిల్లలు, జబ్బుల బారిన పడి వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని ఐదు కుటుంబాలకు తొలి విడతగా ఆర్థిక చేయూత అందించాం. వారి పిల్లల చదువు బాధ్యతలు మండల సమాఖ్య తీసుకుంది. అయిదేళ్లలో వంద కుటుంబాలకు పీ-4 కింద చేయూత ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం."

- గోరంట్ల కొండప్ప కర్నూలు
ఫొటోలు : ఎస్ఎండీ రఫీ

డి విటమిన్ కోసం...

ఎముకలు, కండరాల బలోపేతానికి; గోర్లు, దంతాల సంరక్షణకు; మధుమేహం నివారణకు, రక్తపోటును నియంత్రించేందుకు, రోగనిరోధక శక్తికి డి విటమిన్ అత్యవసరం. అలాంటి డి విటమిన్.. శరీరానికి సహజసిద్ధంగా ఎలా లభిస్తుందో తెలుసుకుందాం...

- రోజూ శరీరానికి నువ్వుల నూనెతో మర్దన చేసుకుని పావు గంట సేపు ఎండలో నిలబడితే శరీరానికి కావాల్సిన డి విటమిన్ సులభంగా లభిస్తుంది.
- పుట్టగొడుగులు, కోడిగుడ్డు పచ్చ సొన, రెడ్ మీట్, నల్ల నువ్వులు, నెయ్యిలో డి విటమిన్ అధికంగా ఉంటుంది. వీటిని తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ప్రయోజనం చేకూరుతుంది.
- సాల్మన్, ట్యూనా, మాకెరెల్ లాంటి చేపలతో తయారుచేసిన వంటకాలు తినడం వల్ల కూడా శరీరానికి డి విటమిన్ అందుతుంది.
- పాలు, పెరుగు, జున్ను, సోయా పాలు, నారింజ పండ్లు, ఓట్స్ తీసుకోవడం వల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుంది.
- తరచూ గోధుమలు, రాగి, బార్లీ లాంటి తృణధాన్యాలను ఆహారంలో చేర్చుకుంటూ ఉంటే శరీరంలో డి విటమిన్ లోపం తలెత్తదు.



ఇలా చేస్తే జిడ్డు మరకలు మాయం!

వంటగదిలో తరచూ జిడ్డు మరకలు ఏర్పడుతూ ఉంటాయి. వంట చేసేటప్పుడు స్టవ్ మీద, దాని వెనక గోడపై నూనె చింది జిడ్డు పేరుకుంటూ ఉంటుంది. చిన్న చిట్కాలతో ఈ జిడ్డు మరకలను ఎలా మాయం చేయాలో తెలుసుకుందాం...

- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, రెండు చెంచాల డిష్‌వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జిడ్డు మరకల మీద రాసి పది నిమిషాలు నాననివ్వాలి. తరువాత నీళ్లు పోసి కడిగేస్తే జిడ్డు తొలగిపోతుంది.
- జిడ్డు పేరుకున్న చోట కొద్దిగా ఉప్పు లేదా కార్న్‌ఫ్లోర్ చల్లి అరగంట తరువాత పలుచని గుడ్డతో తుడిచేస్తే ఫలితం కనిపిస్తుంది.
- జిడ్డు మరకలపై బియ్యం కడిగిన నీళ్లు చల్లి బ్రష్‌తో రుద్ది ఆపైన మంచినీళ్లతో కడిగేస్తే చాలు... జిడ్డు పూర్తిగా వదులుతుంది.



- అరగ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జిడ్డు పేరుకున్న ప్రాంతంలో చల్లి, పావు గంట తరువాత పాత గుడ్డతో తుడిచేస్తే మరకలన్నీ మాయమవుతాయి.
- ఒక పాత బాటిల్‌లో వైట్ వెనిగర్, నీటిని సమభాగాలుగా తీసుకుని బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని జిడ్డు మరకల మీద పిచికారీ చేసి పది నిమిషాల తరువాత స్పాంజ్‌తో తుడిచేస్తే సరిపోతుంది.
- నిమ్మచెక్క మీద కొద్దిగా ఉప్పు వేసి దాంతో గట్టిగా రుద్దితే తేలికపాటి జిడ్డు మరకలు వదిలిపోతాయి.

చెట్టునిండా గులాబీలు పూయాలా..?

నేలమీదే కాదు మిద్దె తోటల్లో, బాల్కనీ కుండీల్లో కూడా చక్కగా పెరిగి గుత్తులుగా పువ్వులు పూసే మొక్క గులాబీ. అందరూ ఇష్టపడే రంగురంగుల గులాబీలు ఏడాదంతా పూయాలంటే ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు ఎండ తగిలేలా ఏర్పాటు చేసుకుంటే గులాబీ మొక్క గుబురుగా పెరుగుతుంది. అలాగే మొక్కకు బాగా గాలి ఆడేలా చూసుకోవాలి. అప్పుడే మొగ్గలు ఎక్కువగా వస్తాయి.
- గులాబీలు ఎక్కువగా పూయాలంటే మట్టి పోషకాలతో నిండి ఉండాలి. నేలలో లేదా కుండీలో తగినంత తోటమట్టి, కొద్దిగా ఇసుక కలిపితే మొక్క మొదట్లో నీరు నిలవకుండా ఉంటుంది. దీంతో వేర్లు బలంగా పెరుగుతాయి. మట్టిలో తరచూ వర్మీ కంపోస్టు, కోకో పీట్ కలుపుతూ ఉంటే మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. కొత్త చిగుర్లు వచ్చి చక్కగా పువ్వులు పూస్తాయి.
- గులాబీ మొక్కలకు ఉదయం వేళల్లోనే నీళ్లు పోయడం మంచిది. మరీ ఎక్కువగా కాకుండా మట్టి తడిసేలా నీళ్లు చిలకరిస్తే చాలు. ఆకులను నీటితో తడపకూడదు. అలా చేస్తే ఆకులకు తెగుళ్లు వచ్చే అవకాశం ఏర్పడుతుంది. వేసవిలో మట్టి పూర్తిగా ఎండిపోకుండా, వర్షాకాలంలో మొక్క మొదట్లో నీళ్లు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పువ్వులు రాలిన తరువాత ఒక అంగుళం మేర ఆ కొమ్మలను కత్తిరించాలి. అప్పుడే అక్కడి నుంచి కొత్త చిగుర్లు, మొగ్గలు వస్తాయి.
- ఆర్నెల్లకోసారి గులాబీ మొక్కల మీద కొద్దిగా వేపనూనెను పిచికారీ చేస్తే చీమలు, ఇతర పురుగులు, చీడలు చేరకుండా ఉంటాయి. అలాగే మట్టిలో కొద్దిగా వేప పొడి కలపడం వల్ల వేర్లు సురక్షితంగా ఉంటాయి.
- వాడేసిన కాఫీ లేదా టీ పొడి, కోడిగుడ్డు పెంకులు, ఉల్లిపాయ తొక్కలు, నిమ్మతొక్కలను మొక్క మొదట్లో ఉన్న మట్టిలో కలపడం వల్ల మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఒక గ్లాసు నీళ్లలో కొన్ని పాలు లేదా మజ్జిగ కలిపి అందించినా మొక్క ఆరోగ్యంగా పెరిగి చక్కగా గులాబీలు పూస్తాయి.



వైజాగ్‌లో పరుగుల వరదే..!

భారత మ్యాచ్‌లకు ఫ్లాట్ వికెట్?



ప్రాక్టీస్‌లో భారత మహిళల జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్‌కప్‌లోని గత రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. ఈ నేపథ్యంలో విశాఖలో బలమైన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. అయితే, కీలక మ్యాచ్‌లకు ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తారోనన్న చర్చ జోరుగా సాగుతుంది. కానీ, విశాఖలో ఫ్లాట్ పిచ్‌ను తయారు చేశారన్న వార్త భారత బ్యాటర్లకు ఊరటనిచ్చేదే. శ్రీలంక, పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. కానీ, అదంతా బౌలర్ల ప్రతిభతోననే చెప్పుకోవాలి. బ్యాటర్లు విఫలమైనా.. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టడి చేశారు. కానీ, బిగ్ మ్యాచ్‌లు కావడంతో హర్మన్, స్మృతి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకొంటున్నారు. 'వికెట్ బ్యాటర్లకు అనుకూలం. గత కొన్ని మ్యాచ్‌లను పరిశీలిస్తే.. మంచు ప్రభావం లేకపోతే స్పిన్నర్లకు కొంత సహకారం లభించవచ్చు' అని ఆంధ్ర క్రికెట్ సంఘం తెలిపింది. వైజాగ్‌లో 11 ఏళ్ల తర్వాత మహిళల వన్డే మ్యాచ్ జరుగుతోంది. 2014, జనవరి 23న ఇదే వేదికపై శ్రీలంకతో భారత్ తలపడింది.

విశాఖ చేరుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో తలపడనున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే.

హౌస్సాముద్దీన్ పసిడి పంచ్



చెన్నై: బీఎఫ్ఐ కప్‌లో నిజామాబాద్ బాక్సర్ హుస్సాముద్దీన్ పసిడి పతకం కొల్లగొట్టి సత్తా చాటాడు. మంగళవారం జరిగిన 55-60 కిలోల ఫైనల్లో మొహమ్మద్ హుస్సాముద్దీన్ 5-0తో సాగర్ జఖర్ (సాయ్)ను చిత్తుగా ఓడించాడు. గాయం నుంచి కోలుకున్నాక తిరిగి ఫామ్‌లోకి రావడంపై హుస్సాముద్దీన్ సంతోషం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్ కాస్త కష్టంగా..

బంగ్లాదేశ్‌పై గెలుపు ● మహిళల వన్డే వరల్డ్‌కప్

నేటి మ్యాచ్ (మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో)
ఆస్ట్రేలియా x పాకిస్తాన్



హీథర్ నైట్ (79 నాటౌట్)

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో నెగ్గి వరుసగా రెండో విజయం అందుకుంది. అయితే పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన ఇంగ్లండ్‌ను బంగ్లా బౌలర్లు కొంతమేర కట్టడి చేయగలిగారు. కానీ హీథర్ నైట్ (79 నాటౌట్) అజేయ ఆటతీరుతో జట్టు గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 49.4 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. సోభన మోస్తరి (60), రబేయ (43), షర్మీన్ (30) రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 46.1 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసి నెగ్గింది. బ్రంట్ (32), డీన్ (27 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఆమీ జోన్స్ (1)ను అవుట్ చేసిన పేసర్ మరూఫ షాకిచ్చింది. ఆ తర్వాత తనే మరో ఓపెనర్ బ్యూమాంట్ (13) వికెట్‌ను కూడా తీసింది. ఇక స్పిన్నర్ ఫహిమా ధాటికి మధ్య ఓవర్లలో 78/5 స్కోరుతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో హీథర్ హాఫ్ సెంచరీతో ఏడో వికెట్‌కు డీన్‌తో అజేయంగా 80 పరుగులు జోడించడంతో ఎలాంటి సంచలనం లేకుండా మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 49.4 ఓవర్లలో 178 ఆలౌట్. (సోభన 60, రబేయ ఖాన్ 43 నాటౌట్, షర్మీన్ 30; ఎకెల్‌స్టోన్ 3/24, డీన్ 2/28, కాప్సీ 2/31, లిన్సే స్మిత్ 2/33).
ఇంగ్లండ్: 46.1 ఓవర్లలో 182/6. (హీథర్ 79 నాటౌట్; బ్రంట్ 32, కాప్సీ 20, డీన్ 27 నాటౌట్; ఫహిమా 3/16, మరూఫా 2/28).

30 ఏళ్ల తర్వాత.. ఆనంద్-కాస్పరోవ్ సమరం



క్లచ్ చెస్ టోర్నీలో తలపడనున్న దిగ్గజాలు

సెయింట్ లూయిస్ (యూఎస్): చిరకాల ప్రత్యర్థులు, దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ 30 ఏళ్ల తర్వాత మళ్లీ తలపడనున్నారు. బుధవారం నుంచి జరిగే క్లచ్ చెస్ టోర్నీలో వీరిద్దరూ 12 గేమ్‌లు ఆడనున్నారు. వినూత్న పాయింట్ల విధానంలో జరిగే టోర్నీలో రోజుకు 4 గేముల్లో తలపడతారు. 1995లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో వీరిద్దరూ క్లాసిక్ ఫార్మాట్‌లో ఆడగా.. ఈసారి మాత్రం ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు. కాగా, వీరిద్దరి 20 గేముల ముఖాముఖీలో కాస్పరోవ్ 10.5-7.5తో విషీపై ఆధిక్యంలో ఉన్నాడు. 2004లో రిటైర్మెంట్ ప్రకటించిన కాస్పరోవ్ ఎగ్జిబిషన్, బ్లిట్జ్ ఈవెంట్లు ఆడుతున్నాడు. మరోవైపు యువ ఆటగాళ్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న ఆనంద్ ప్రముఖ ఈవెంట్లలో అడపాదడపా పాల్గొంటున్నాడు. విజేతకు రూ. 62 లక్షలు, ఓడిన వారికి రూ. 44 లక్షల ప్రైజ్‌మనీ అందనుంది. ఒకవేళ సమమైతే చెరిసగం పంచుకుంటారు.

తలైవాస్ అదుర్స్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు అదరగొట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 56-37తో పట్నా పైరేట్స్‌ను చిత్తుగా ఓడించింది. తలైవాస్ ఆటగాడు అర్జున్ దేశ్వాల్ రైడింగ్‌లో 21, బోనస్ ద్వారా 5 పాయింట్లు సాధించాడు. ఇక, ఉత్కంఠగా సాగిన హరియాణా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ జట్ల పోరులో తొలుత 33-33తో స్కోరు సమమైంది. అయితే, ఫలితం కోసం నిర్వహించిన రైడింగ్‌లో దబాంగ్ 9-3తో స్టీలర్స్‌ను ఓడించింది.

హెనిల్, ఖిలన్ ఆల్‌రౌండ్ షో

● ఆసీస్ 135 ఆలౌట్ ● భారత్ 144/7

రెండో యూత్ టెస్ట్

మెకే (ఆస్ట్రేలియా): పటేల్ ద్వయం హెనిల్ (3/21, 22 నాటౌట్), ఖిలన్ (3/23, 26) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. అండర్-19 రెండో అనధికార టెస్ట్ తొలి రోజు భారత్ 9 పరుగుల ఆధిక్యాన్ని నమోదు చేసింది. నాలుగు రోజుల ఈ టెస్ట్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. అలెక్స్ (66) అర్ధ శతకం సాధించాడు. ఉద్ధవ్ మోహన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన భారత్ 144/7 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట ఆఖరుకు హెనిల్‌తోపాటు దేవేంద్రన్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. వేదాంత్ త్రివేది (22), వైభవ్ సూర్యవంశీ (20) ఫర్వాలేదనిపించారు. బార్టన్ మూడు వికెట్లు పడగొట్టాడు.

వన్డే జట్టులో స్టార్క్

భారత్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్లు



మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే వన్డే, టీ20ల సిరీస్‌ల కోసం ఆస్ట్రేలియా జట్లను ప్రకటించారు. గత నెల టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పేసర్ మిచెల్ స్టార్క్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. పని ఒత్తిడిలో భాగంగా అతడు ఆగస్టులో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌కు దూరంగా ఉన్నాడు. గతేడాది నవంబరులో స్టార్క్ తన చివరి వన్డే ఆడడం గమనార్హం. ఈనెల 19 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. ప్యాట్ కమిన్స్ గాయం నుంచి కోలుకోకపోవడంతో జట్టుకు మిచెల్ మార్ష్ నాయకత్వం వహించనున్నాడు. 15 మంది ఆటగాళ్ల జాబితాలో మాథ్యూ రెన్‌షా, షార్ట్, మిచ్ ఓవెన్‌లకు కూడా చోటు దక్కింది. మరోవైపు ఈనెల 29 నుంచి జరిగే ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు మాత్రమే జట్టును ప్రకటించారు.

వన్డే జట్టు: మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, క్యారీ, కనోలీ, డ్వార్షుస్, ఎల్లిస్, గ్రీన్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, ఓవెన్, రెన్‌షా, షార్ట్, స్టార్క్, జంపా.
టీ20 జట్టు: మార్ష్ (కెప్టెన్), ఎబాట్, బార్ట్‌లెట్, డేవిడ్, డ్వార్షుస్, ఎల్లిస్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కునేమన్, షార్ట్, ఓవెన్, స్టొయినిస్, జంపా.

పృథ్వీ షా రచ్చ

ముంబై ప్లేయర్ ముషీర్‌తో వాగ్వాదం

పుణె: ఫామ్ లేమితో పాటు క్రమశిక్షణా చర్యల కింద ముంబై జట్టులో చోటు కోల్పోయిన బ్యాటర్ పృథ్వీ షా మరో వివాదంలో చిక్కుకున్నాడు. ప్రస్తుతం మహారాష్ట్రకు ఆడుతున్న షా ముంబైతో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో 181 పరుగులతో ఫామ్‌ను చాటుకున్నాడు. అయితే ముషీర్ ఖాన్ ఓవర్‌లో క్యాచ్ అవుటయ్యాడు. షా వెళ్లిపోతున్న క్రమంలో ముషీర్ సెండాఫ్ ఇవ్వడంతో పట్టరాని కోపంతో అతడిని బ్యాట్‌తో కొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో తన పాత ముంబై సహచరులంతా పృథ్వీని చుట్టుముట్టారు. వెంటనే అంపైర్లు వివాదం మరింత పెద్దది కాకుండా షాను పెవిలియన్ వైపు పంపారు. వెళ్లిపోతున్న క్రమంలోనూ ఫీల్డర్ సిద్దేష్ లాడ్‌తో కోపంగా మాట్లాడడం కనిపించింది.

కోల్‌కతా బోణీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో కోల్‌కతా థండర్ బోల్ట్స్ శుభారంభం చేసింది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 3-1 (12-15, 15-13, 15-6, 19-17)తో నెగ్గింది. నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లూ చివరి వరకు పోరాడాయి. చివరికి సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కోల్‌కతా దక్కించుకుంది. కోల్‌కతా విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నాకౌట్ చేరువలో భారత్

శ్రీలంకపై విజయం • ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో యువ భారత జట్టు వరుసగా రెండో విజయంతో నాకౌట్ బెర్త్‌కు చేరువైంది. గ్రూప్-హెచ్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో భారత్ 45-27, 45-21తో శ్రీలంకపై గెలిచింది. తొలి మ్యాచ్‌లో నేపాల్‌ను చిత్తుచేసిన భారత్.. తాజా ప్రదర్శనతో తన గ్రూప్‌లో టాపర్‌గా నిలిచింది. భారత్ తన గ్రూప్‌లో ఆఖరిదైన మూడో మ్యాచ్‌ను బుధవారం యూఏఈతో ఆడనుంది. కాగా ఈ టోర్నీకి మ్యాచ్ కంట్రోల్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

బీఎస్, లారాకు 'లైఫ్ టైమ్' అవార్డులు



ముంబై: ప్రతి ఏటా ప్రకటించే ప్రఖ్యాత సియట్ క్రికెట్ రేటింగ్ అవార్డుల్లో ఈసారి భారత దిగ్గజం బీఎస్ చంద్రశేఖర్, వెస్టిండీస్ గ్రేట్ బ్రియాన్ లారాలకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాలు దక్కాయి. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో గవాస్కర్ చేతుల మీదుగా లారా ఈ అవార్డును అందుకున్నాడు. 'టీ20 బ్యాటర్ ఆఫ్ ది ఇయర్'గా సంజూ శాంసన్, బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి అవార్డులు గెలుచుకోగా.. ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ శర్మను ప్రత్యేక జ్ఞాపికతో సన్మానించారు. ఇక, ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన భారత క్రికెటర్‌గా నిలిచినందుకు శ్రేయాస్ అయ్యర్‌కు జ్ఞాపిక అందుకున్నాడు. 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా పురుషుల్లో జో రూట్ నిలవగా, మహిళల్లో స్మృతీ మంధాన అవార్డును దక్కించుకున్నారు.



బిజినెస్

జీఆర్‌టీ జువెలర్స్ దీపావళి ఆఫర్లు



చెన్నై (ఆంధ్రజ్యోతి): జీఆర్‌టీ జువెలర్స్.. దీపావళి పండగను పురస్కరించుకుని 'సిల్వర్ ఫర్ గోల్డ్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా వినియోగదారులకు బంగారు ఆభరణాల కొనుగోలుపై అందుకు సమానమైన బరువుతో వెండిని పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీంతోపాటుగా బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.100 తగ్గింపును జీఆర్‌టీ అందిస్తోంది. అలాగే వజ్రాభరణాల కొనుగోలుపై ప్రతి క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్‌కట్ డైమండ్స్‌పై ప్రతి క్యారెట్‌కు 2 గ్రాముల వెండిని ఉచితంగా అందించనుంది. ప్లాటినం ఆభరణాలపై ఆభరణం బరువుతో సమానంగా వెండి పూర్తిగా ఉచితంగా ఆఫర్ చేస్తోంది. మరోవైపు వినియోగదారులకు వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు (ప్రత్యేక వస్తువులు మినహా), వెండి ఆభరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వస్తువుల ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ జీఆర్ అనంత పద్మనాభన్ తెలిపారు.

వచ్చే ఐదేళ్లలో రూ.3 లక్షలకు బంగారం!?

2030 చివరికల్లా మరో 150% పెరిగే అవకాశం ● మార్కెట్ నిపుణుడు ఎడ్ యార్దేని అంచనా





పసిడి ధరలు ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఇప్పటికే 50 శాతానికి పైగా పెరిగి తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని దాటింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను అలుముకున్న అనిశ్చితి మబ్బులు ఇప్పట్లో తొలగేలా కన్పించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో బులియన్ ధరలు మరింత పైకి దూసుకుపోతాయని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుత గోల్డెన్ ర్యాలీ ఈ దశాబ్దం చివరి వరకు కొనసాగనుందని, 2030 సంవత్సరాంతానికల్లా ఔన్స్ బంగారం మరో 150 శాతం పెరిగి 10,000 డాలర్లకు చేరవచ్చని అంతర్జాతీయ మార్కెట్ నిపుణుడు ఎడ్ యార్దేని అంచనా వేశారు. ఈ లెక్కన, భారతీయ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర వచ్చే ఐదేళ్లలో రూ.3 లక్షలు (ప్రస్తుత కరెన్సీ మారకం రేటు ప్రకారం) దాటవచ్చు.

పసిడి ర్యాలీకి యెర్దేని చెబుతున్న కారణాలు

- అంతర్జాతీయంగా ఆర్థిక, రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు
- ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం
- బులియన్‌లో పెట్టుబడులకు వ్యక్తిగత, సంస్థాగత ఇన్వెస్టర్లు గతంలో కంటే అధిక ఆసక్తి కనబరుస్తుండటం

రూ.1.24 లక్షలకు పసిడి

ఇంటర్నేషనల్ మార్కెట్‌తో పాటు దేశీయ విపణిలోనూ పసిడి ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం మరో రూ.700 పెరిగి రూ.1,24,000కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు సైతం రూ.700 పెరుగుదలతో ఆల్‌టైమ్ గరిష్ఠం రూ.1,23,400కు ఎగబాకింది. అమెరికా షట్‌డౌన్‌తో నెలకొన్న రాజకీయ, ఆర్థిక అనిశ్చితితో పాటు ఈ నెలలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలు గోల్డ్ రేట్లను ఎగదోస్తున్నాయి. కాగా, సిల్వర్ రికార్డు గరిష్ఠాల నుంచి కాస్త కిందికి జారింది. కిలో వెండి ఏకంగా రూ.3,400 తగ్గి రూ.1,54,000కు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం తొలిసారిగా 4,000 డాలర్ల మైలురాయిని అధిగమించింది. వెండి మాత్రం 48 డాలర్లకు తగ్గింది.

వచ్చే ఏడాది 9% వేతన వృద్ధి

ఏఓఎన్ సర్వే నివేదికలో వెల్లడి

ముంబై: వచ్చే ఏడాది భారత్‌లో ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతం పెరగవచ్చని ఏఓఎన్ నివేదిక అంచనా వేసింది. 2025లో నమోదైన 8.9 శాతం సగటు పెంపుతో పోలిస్తే వచ్చే ఏడాది మరింత మెరుగైన హైక్ లభించనుందని అంటోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలోనూ దేశీయంగా బలమైన వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు దోహదపడనున్నాయని నివేదిక పేర్కొంది. 45 రంగాలకు చెందిన 1,060 సంస్థల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు ఏఓఎన్ వెల్లడించింది.

ఏ రంగంలో..	ఎంత(%)
రియల్టీ/ఇన్‌ఫ్రా	10.9
ఎన్‌బీఎఫ్‌సీ	10.0
ఇంజనీరింగ్ డిజైన్ సర్వీసెస్	9.7
వాహన తయారీ, రిటైల్, లైఫ్ సైన్సెస్	9.6

ఉద్యోగుల వలసలు తగ్గుముఖం: కంపెనీల్లో ఉద్యోగుల వలసలు (అట్రిషన్) క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని ఏఓఎన్ సర్వేలో వెల్లడైంది. 2023లో 18.7 శాతంగా ఉన్న వలసల రేటు 2024లో 17.7 శాతానికి, 2025లో 17.1 శాతానికి దిగివచ్చిందని రిపోర్టు తెలిపింది. ఉద్యోగుల వలసలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కంపెనీలు భవిష్యత్ వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యం పెంపు శిక్షణ, డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌పై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని నివేదిక పేర్కొంది.

డాలర్ల కొనుగోలు మరింత సులువు

ఫారెక్స్ రిటైల్ ప్లాట్‌ఫామ్‌తో భారత్ కనెక్ట్ అనుసంధానం

ముంబై: ఆన్‌లైన్‌లో అమెరికా డాలర్ల కొనుగోలు మరింత సులువు కానుంది. ఇందుకోసం భారత్ కనెక్ట్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్)ను ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) రిటైల్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మంగళవారం తెలిపింది. దీంతో కస్టమర్లు బీబీపీఎస్‌తో కూడిన పేమెంట్/బ్యాంకింగ్ యాప్ ద్వారా మరింత మెరుగైన ధరకు అమెరికా డాలర్లను కొనగోలు చేసేందుకు వీలవుతుంది. డాలర్లను నోట్ల రూపంలో కొనుగోలు చేయొచ్చు లేదా ఫారెక్స్ కార్డులో జమ చేసుకోవచ్చు. లేదంటే విదేశాలకు పంపవచ్చు. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యెస్ బ్యాంక్ యాప్‌లు భారత్ కనెక్ట్‌తో అనుసంధానితమై ఉన్నాయి. ఈ బ్యాంక్ కస్టమర్లు రిజిస్టర్ చేసుకోవడంతో పాటు రియల్ టైమ్ ధరలను వీక్షించి, డిజిటల్ మార్గంలో డాలర్ల కొనుగోలును పూర్తి చేయవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది. కాగా, ఫారిన్ ఎక్స్ఛేంజ్ ధరల్లో మరింత పారదర్శకత, నిష్పక్షపాతమే లక్ష్యంగా 2019లో ప్రారంభమైన ఫారెక్స్ రిటైల్ ప్లాట్‌ఫామ్‌ను క్లియర్‌కార్ప్ డీలింగ్ సిస్టమ్స్ (ఇండియా) నిర్వహిస్తోంది. క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్) పూర్తి అనుబంధ విభాగమే క్లియర్‌కార్ప్.

జోయాలుక్కాస్ ప్రచారకర్తగా సమంత



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి సమంత రూత్ ప్రభును నియమించుకుంది. సమంత ప్రచారంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారులకు జోయాలుక్కాస్ మరింత చేరువ కానుందని గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ అన్నారు. సమంత ప్రచారం తమ మూడు దశాబ్దాల ప్రయాణాన్ని ప్రతిబింబించనుందన్నారు. ప్రతి మహిళ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగేలా చేయటంలో జోయాలుక్కాస్ పాత్ర ఎంతో ఉందని, అలాంటి బ్రాండ్‌తో తాను పనిచేయటం ఎంతో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా సమంత అన్నారు.

గేటెడ్ కమ్యూనిటీల్లో సేఫ్ డిపాజిట్ లాకర్లు: ఆరమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ సేఫ్ డిపాజిట్ లాకర్ ప్రొవైడర్ ఆరమ్.. హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీస్ అయిన సత్వ మాగ్నస్, అపర్ణ సరోవర్ గ్రాండేలో టెక్ ఆధారిత సేఫ్ డిపాజిట్ లాకర్లను ఏర్పాటు చేసినట్లు ఆరమ్ ఫౌండర్, సీఈఓ విజయ్ అరిశెట్టి తెలిపారు. మిలిటరీ గ్రేడ్ సెక్యూరిటీ సిస్టమ్, ఆటోమేటెడ్‌తో కూడిన ఈ బయో మెట్రిక్ ఆధారిత లాకర్లు రోజంతా అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. అంతేకాకుండా ప్రతి లాకర్‌కు రూ.కోటి వరకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ఐసీఐసీఐ లాంబార్డ్, టాటా ఏఐజీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విజయ్ తెలిపారు. ఆరమ్ ఇప్పటికే బెంగళూరు, విశాఖపట్నంలో కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. ప్రస్తుతం 21 సైట్స్‌లో మొత్తం 18,000 లాకర్లను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది నాటికి మరో 50 సైట్లలో 10,000 లాకర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. లాకర్ సైజును బట్టి అద్దె రూ.8,000 నుంచి రూ.25,000 వరకు ఉన్నాయని విజయ్ తెలిపారు.

శాన్‌కోల్‌కు డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శాంతా బయోటెక్నిక్స్ అభివృద్ధి చేసిన నోటి ద్వారా తీసుకునే కలరా వ్యాక్సిన్ శాన్‌కోల్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రీ క్వాలిఫికేషన్ లభించింది. దీంతో కలరా ప్రబలంగా ఉన్న దేశాల్లో వినియోగించేందుకు యునిసెఫ్, గావీ, పాహో వంటి ప్రపంచ ప్రొక్యూర్మెంట్ సంస్థలు శాంతా బయో నుంచి శాన్‌కోల్ కొనుగోలు చేసేందుకు మార్గం సుగమం అయింది. "కలరా వ్యాధి తరచుగా వ్యాపించే దేశాలకు సరసమైన ధరల్లో అందుబాటులో ఉండే ఔషధంగా శాన్‌కోల్‌ను అభివృద్ధి చేశాం. డబ్ల్యూహెచ్ఓ అనుమతితో మా ప్రధాన లక్ష్యం నెరవేరింది" అని కంపెనీ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లో అవాంటెల్ మరో యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శాటిలైట్ కమ్యూనికేషన్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థ అవాంటెల్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో రూ.56 కోట్లతో రెండో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది. రావిర్యాల, ఈ-సిటీలోని ఈ యూనిట్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన ఉత్పత్తులను ఇక్కడ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అవాంటెల్ వెల్లడించింది.

వచ్చే ఏడాది మార్కెట్లోకి నిస్సాన్ టెక్టాన్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది విడుదల చేయనున్న కొత్త కారు టెక్టాన్‌తో జపాన్ ఆటో దిగ్గజం నిస్సాన్ మార్కెట్లో పోటీ తీవ్రంగా ఉన్న మిడ్ సైజ్ ఎస్‌యూవీ విభాగంలో ప్రవేశిస్తోంది. తద్వారా భారత్‌లో తమ బ్రాండ్‌ను పునరుజ్జీవింపచేయతలచినట్లు నిస్సాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స చెప్పారు. హ్యుందయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, స్కోడా కుషాక్‌లకు గట్టి పోటీ ఇచ్చే ఈ కారును వచ్చే ఏడాది మధ్యలో మార్కెట్లో ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. టెక్టాన్‌ను దేశీయంగానే తయారుచేయనున్నట్టు వెల్లడించారు.



నాలుగో రోజూ మార్కెట్ ముందుకే..

సెన్సెక్స్ 136 పాయింట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లతో మంగళవారం సెన్సెక్స్ 136.63 పాయింట్లు పెరిగి 81,926.75 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 519.44 పాయింట్లు ఎగబాకి 82,309.56 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో సూచీ మళ్లీ కాస్త జారుకుంది. నిఫ్టీ 30.65 పాయింట్ల వృద్ధితో 25,108.30 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 మాత్రమే రాణించాయి. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 88.77 వద్ద ముగిసింది.

ఐపీఓకు సాయి పేరెంటరల్స్: తెలంగాణకు చెందిన ఫార్మాస్యూటికల్స్ ఫార్ములేషన్స్ కంపెనీ సాయి పేరెంటరల్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.285 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్ల వాటాకు చెందిన 35 లక్షల వరకు ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	528	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	124
వరంగల్	110	గుంటూరు	119
కరీంనగర్	110	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	127	అనంతపురం	110
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,020 ▲	1,11,850 ▲	1,67,100 ▲
విజయవాడ	1,23,800 ▲	1,18,300 ▲	1,54,400 ▼
విశాఖపట్నం	1,23,750 ▲	1,11,850 ▲	1,67,100 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,53,800 ▲
ప్రొద్దుటూరు	1,24,500 ▲	1,14,540 ▲	1,56,000 ▲
ముంబై	1,19,941 ▲	1,09,866 ▲	1,49,441 ▲



ఏపీపీఎస్సీ వార్షిక నివేదికను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేసిన సభ్యులు

గవర్నర్‌కు ఏపీపీఎస్సీ వార్షిక నివేదిక

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ, కమిషన్ సభ్యులు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. కమిషన్ 2024-25 వార్షిక నివేదికను ఆయనకు అందజేశారు. కాగా, ఏఆర్ అనురాధ గురువారం రిటైర్ కాబోతున్నారు. ఈ ప్రభుత్వంలోనే ఆమె ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

హౌసింగ్ కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం నలుగురు డైరెక్టర్లను నియమించింది. బోరెడ్డి జగన్నాథరెడ్డి, కిష్టయ్య, ముత్యాల ప్రియసౌమ్య, లింగమనేని రామలింగేశ్వరరావులను డైరెక్టర్లుగా నియమిస్తూ గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

10 కోట్లతో 21 'గోబర్ధన్' ప్రాజెక్టులు మంజూరు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో బయో వ్యర్థాల నిర్వహణకు సంబంధించి రూ.10.50 కోట్లతో 21 'గోబర్ధన్' ప్లాంట్‌లను మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 6, 2025-26కు సంబంధించి మరో 15 ప్రాజెక్టులను మంజూరుచేసింది. కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో నిధులను సమకూర్చుతాయి.

మహిళలకు 'సఖి సురక్ష'

▸ రేపు విశాఖలో ప్రారంభించనున్న మెప్మా

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ మహిళా సంఘాల కోసం మెప్మా రెండు కొత్త కార్యక్రమాలను ప్రారంభించనుంది. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'లో భాగంగా 'సఖి సురక్ష' కార్యక్రమాన్ని ఈ నెల 9న విశాఖలో ప్రారంభించనుంది. దీనిలో భాగంగా 35ఏళ్లు పైబడిన మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. 74 మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అదేవిధంగా పట్టణ మహిళా సంఘాల కుటుంబాల్లోని నిరుద్యోగుల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తారు. ఈ నెల 8న శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో 20 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మెప్మా తెలిపింది.

నేడు సీమలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో పాటు ఉపరితల ద్రోణి ప్రభావంతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా ఐ.పోలవరంలో 9.12, అనకాపల్లిలో 7.05, చీపురుపల్లిలో 6.67, కోటనందూరులో 6.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

పట్టణాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

▸ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

▸ రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు.. జూన్‌కి టిడ్కో ఇళ్లు

▸ మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ల వర్క్‌షాపులో మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాలు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ శాఖ డైరెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. 'పట్టణాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా కమిషనర్లు చొరవ తీసుకోవాలి. రాష్ట్రంలో పేరుకుపోయిన 85 లక్షల మెట్రిక్ టన్నులు చెత్తను ఇప్పటికే తొలగించాం. మరో 20 లక్షల టన్నులు పోగుపడిన చెత్తను డిసెంబరు నెలాఖరుకు తొలగిస్తాం. కొత్తగా 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. వీటితో రాష్ట్రంలోని మున్సిపాలిటీల డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయి. ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం. ప్రతి రోజూ ఇళ్లలో ఉపయోగించిన నీటితో పాటు వర్షపు నీరు కోసం కాలువల నిర్మాణం చేపడతున్నాం. అమృత్ పథకం-2 ద్వారా మున్సిపాలిటీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నాం. పూర్తయిన టిడ్కో ఇళ్లను ప్రతి శనివారం లబ్ధిదారులకు కేటాయించాలి. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలి' అని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. బుధ, గురువారాల్లోనూ ఈ వర్క్‌షాప్ కొనసాగనుంది.



మునిసిపల్ కమిషనర్ల సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, హాజరైన అధికారులు

దేవదాయ శాఖలో 'ఆర్టీఐ' రచ్చ!

▸ అడిగిన సమాచారం ఇవ్వని కమిషనరేట్ అధికారులు

▸ కమిషనర్ ఆగ్రహించినా అధికారుల్లో కనిపించని మార్పు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖ అధికారులు ఆర్టీఐతో ఆటలాడుతున్నారు. ఈ శాఖకు సంబంధించిన సమాచారం కోరిన వారిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. చివరికి ఆర్టీఐ కమిషనర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ, దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నారు. కమిషనరేట్‌లో ఆర్టీఐ దరఖాస్తుదారులకు చిన్న సమాచారం ఇవ్వడానికి కూడా అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రతి కేసు విషయంలోనూ ఆర్టీఐ కమిషనర్ (రెండో అప్పిలేట్ అథారిటీ) వద్దకి వెళ్లాల్సి వస్తోంది. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లకు సంబంధించిన కేడర్ స్ట్రెంత్, రోస్టర్ రిజిస్టర్, నోట్ ఫైల్ కావాలని ఒక దరఖాస్తుదారుడు 3 నెలల క్రితం ఆర్టీఐ ద్వారా సమాచారం కోరారు. శాఖ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి (పీఐవో) తాను కోరిన సమాచారం ఇవ్వకపోవడంతో ఆర్టీఐ కమిషనర్‌ను సంప్రదించారు. దరఖాస్తుదారు అడిగిన వివరాలు వెంటనే ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత కూడా సాకులు చెప్పి తప్పించుకున్నారు. చివరికి కమిషనర్ గట్టిగా ప్రశ్నించడంతో వెంటనే సమాచారం ఇస్తామని అధికారులు ప్రమాణ పూర్వక అఫిడవిడ్ దాఖలు చేశారు. అప్పుడు కూడా తప్పుడు సమాచారం అందించడంతో విషయాన్ని దరఖాస్తుదారు మరోసారి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నోట్‌ఫైల్‌తో పాటు మిగిలిన సమాచారం మొత్తం ఇవ్వాలని మరోసారి ఆదేశించారు. అయినా అధికారులు మాత్రం కమిషనర్‌కే పాఠాలు చెబుతూ నోట్‌ఫైల్ ఆర్టీఐ కిందకు రాదని, కాబట్టి దాన్ని ఇవ్వాల్సిన అవసరం లేదని సమాధానం ఇచ్చారు. మరోవైపు కేడర్ స్ట్రెంత్ రిజిస్టర్‌కు బదులు పోస్టుల కేటాయింపు పత్రాలు ఇచ్చారు. తప్పుడు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకోవడంపై కమిషనర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లో కింద స్థాయి నుంచే అధికారుల్లో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. చిన్న సమాచారానికి కూడా రెండో అప్పిలేట్ అథారిటీ వద్దకు వస్తుండటంతో ఆర్టీఐ కమిషనర్లు చివాట్లు పెడుతున్నా అధికారుల తీరులో మార్పు రావడం లేదు.

ఫైళ్లను తొక్కిపెట్టేందుకేనా?

దేవదాయ శాఖ కమిషనరేట్‌లో ఎవరి దారి వారిదే అన్నట్లుగా తయారైంది. చివరికి రాజ్యాంగ బద్ధమైన ఆర్టీఐ కమిషనర్ల ఆదేశాలు కూడా అమలు కావడం లేదు. ఎస్టాబ్లిష్‌మెంట్‌తో పాటు కొన్ని విభాగాల సిబ్బందిని ఎన్నిసార్లు అడిగినా సమాచారం ఇవ్వడం లేదని విచారణ సమయంలో దేవదాయ శాఖ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి చెప్పడంతో కమిషనర్లు విస్తుపోవాల్సి వస్తోంది. అసలు దరఖాస్తుదారు కోరిన సమాచారం కమిషనరేట్‌లో ఉందా? లేకపోతే ఉద్దేశపూర్వకంగానే ఇవ్వడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవదాయ శాఖలో రోస్టర్ పాటించకుండా పదోన్నతులు కల్పిస్తుంటారు. డిప్యూటీ కమిషనర్ పోస్టులను ఇష్టారాజ్యంగా భర్తీ చేశారు. ఇలా అన్ని కేడర్లలో పదోన్నతులపై పలు ఫిర్యాదులున్నాయి. అక్రమ పదోన్నతుల బాగోతాన్ని ఆర్టీఐ దరఖాస్తులు వెలుగులోకి వస్తే అనేక సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో కొన్ని విభాగాల అధికారులు ఫైళ్లు బయటకు రానివ్వకుండా చూస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీఐ కమిషనర్ల వద్ద కూడా సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఈ వ్యవహారంపై కమిషనర్ దృష్టిసారించి ఆర్టీఐ వ్యవస్థకు గౌరవం దక్కేలా చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కారవాన్‌కు ఊతం

▸ రూ.ఐదు కోట్ల వరకు ప్రోత్సాహకం

▸ ఐదేళ్లలో 25 కారవాన్ పార్కుల ఏర్పాటు

▸ 150 కారవాన్ వాహనాలు అందుబాటులోకి

▸ ఏపీ టూరిజం పాలసీలో 'కారవాన్'ను భాగం చేస్తూ పర్యాటక శాఖ ఉత్తర్వులు



అమరావతి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కారవాన్ టూరిజంలో సరికొత్త అవకాశాలకు రాష్ట్ర ప్రభుత్వం తెర తీసింది. టూరిజం పాలసీలో కారవాన్ టూరిజాన్ని కూడా చేర్చుతూ పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవా, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు తరహాలో అక్కడి మార్గదర్శకాలతో పాటు కేంద్ర పర్యాటక శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో కారవాన్ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు. కారవాన్లు, కారవాన్ పార్కుల ఏర్పాటుకు రూ.ఐదు కోట్ల వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. రాబోయే ఐదేళ్లలో 25 కారవాన్ పార్కులను అభివృద్ధి చేయాలని, 150 వరకూ కారవాన్ వాహనాలను టూరిజంలో భాగంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ఐదు వేలమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది. మరోవైపు 20శాతం మేర పర్యాటకుల సంఖ్య కూడా పెరగవచ్చునని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కారవాన్ వాహన నిర్వాహకులు తమ ప్రయాణికులకు తప్పనిసరిగా బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. రవాణా విభాగం నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి. లైఫ్ టాక్స్‌లో కొంత మినహాయింపు ప్రభుత్వం ఇస్తుంది. కారవాన్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూమిని వారే సేకరించుకోవాలి. ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకోవాలంటే టూరిజం పాలసీలోని నిబంధనలు పాటించాలి.

బీపీసీఎల్‌కు 6 వేల ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఐదు బ్లాకుల్లో ఈ అల్ట్రా మెగా ప్రాజెక్టు కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి 20 సంవత్సరాల కాలంలో రూ.96 వేల కోట్లకుపైగా ఆర్థిక ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 కింద టైలర్ మేడ్ ఇన్సెంటివ్స్ విడుదలకు ఎస్క్రో ఆధారిత యంత్రాంగం కోసం ఆర్థిక శాఖతో సంప్రదింపులు కూడా చేసింది. మొత్తం 15 వాయిదాలలో 43.5 శాతం మూలధన సబ్సిడీ, జీఎస్టీ పూర్తిగా వాపసు, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఐజీఎస్టీ/సీజీఎస్టీలో రాష్ట్రం వాటా, రాష్ట్రం వసూలు చేసే సీఎస్ఎస్ చార్జీల రీయింబర్స్‌మెంట్, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు తదితర ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీకి ఆ ఉత్తర్వుల్లో ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలో భారీ పెట్టుబడితో బీపీసీఎల్ చేపట్టిన ఈ అల్ట్రా మెగా ప్రాజెక్టు పనులు అతి త్వరలోనే పట్టాలెక్కనున్నాయి.

మారనున్న పారిశ్రామిక ముఖచిత్రం

మొత్తం ప్రాజెక్టును 2029 జనవరి నాటికి పూర్తి చేసి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు బీపీసీఎల్ ఇప్పటికే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం కేటాయించిన 6 వేల ఎకరాల్లో మొదటి బ్లాక్ 787 ఎకరాల్లో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, ఎస్‌డీఐ, రెండో బ్లాక్ 2,333 ఎకరాల్లో రిఫైనరీ, పెట్రో కెమికల్ యూనిట్లు, మూడో బ్లాక్‌లోని 1,085 ఎకరాల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు, ఉత్పత్తి ట్యాంకులు, నాలుగో బ్లాక్‌లోని 800 ఎకరాల్లో ముడి చమురు టెర్మినల్, ఐదో బ్లాక్‌లోని 1,000 ఎకరాల్లో గ్రీన్ హెచ్2/ రెన్యువబుల్స్ నిర్మిస్తారు. మొత్తం భూమిని ఫ్రీహోల్డ్ ప్రాతిపదికన తీసుకోవడానికి బీపీసీఎల్ అభ్యర్థించింది. ఆ సంస్థ సమర్పించిన అంచనాల ప్రకారం గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కోసం రూ. 96,862 కోట్ల భారీ పెట్టుబడి పెట్టడం వల్ల రాష్ట్రానికి గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు, వ్యాట్, ఎస్జీఎస్టీ, ఇతర వనరుల నుంచి ఆదాయం లభిస్తుంది. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా వచ్చే 15 ఏళ్లలో రాష్ట్రానికి రూ. 87,558 కోట్ల స్థూల ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. నిర్దేశిత సమయం ప్రకారం ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రమే మారిపోతుంది. పెద్దఎత్తున అనుబంధ పరిశ్రమల రాకతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీయనుంది. వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బద్రీనాథ్ ఆలయంలో రజనీ ప్రత్యేక పూజలు



ఆధ్యాత్మిక పర్యటన కోసం ఉత్తర భారతానికి వెళ్లిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్.. మంగళవారం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అక్కడి నుంచి తనకు అత్యంత ఇష్టమైన బాబా గుహకు బయలుదేరి వెళ్లారు. అక్కడే ఆయన వారం రోజుల పాటు ధ్యానం చేస్తారని కోలీవుడ్ వర్గాలు తెలిపాయి.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

జాతరలో నా పాత్ర ప్రత్యేకం



రవితేజ

'ఈ చిత్రంలో నేను పోషించిన ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్) అధికారి పాత్ర నా సినీ ప్రయాణంలో సరికొత్తది, ప్రత్యేకమైనది. చిత్ర దర్శకుడు భాను ప్రతిభావంతుడు. చిత్రీకరణ సమయంలో సన్నివేశాన్ని మరింత మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడు. అవసరమనుకొంటే వేగంగా మార్పులు చేయగల సామర్థ్యమున్నవాడు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించాడు' అని తెలిపారు హీరో రవితేజ. ఆయన కథానాయకుడిగా భాను భోగవరపు తెరకెక్కించిన చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్‌లో భాగంగా చిత్రబృందం ఓ వీడియో సంభాషణలో పాల్గొంది. శ్రీలీల మాట్లాడుతూ 'సినిమాలో నేను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. రవితేజకు వృత్తి పట్ల అంకితభావం ఎక్కువ. గాయంతో బాధపడుతున్నప్పటికీ 'తూ మేరా లవర్' పాటను పూర్తి చేసి తన నిబద్ధతను చాటుకున్నారు' అని కొనియాడారు. చిత్రదర్శకుడు భాను భోగవరపు మాట్లాడుతూ 'ఈ చిత్రానికి 'మాస్ జాతర' అనే టైటిల్‌ని రవితేజ సూచించారు. దానికి 'మనదే ఇదంతా' అనే ట్యాగ్‌లైన్‌ను జోడించాం. 'ఓలే ఓలే' పాట సాహిత్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. పాట రెండో భాగం పూర్తి భిన్నంగా, పాజిటివ్ వైబ్‌ను కలిగి ఉంటుంది' అని చెప్పారు.

ఫ్లేవర్ లాంటి లవర్ ఉంటే...!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఆద్యంతం వినోదాత్మక చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. సినిమా ఈనెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రం నుంచి 'టిక్కల్ టిక్కల్...' అనే మూడో గీతాన్ని మేకర్స్ రిలీజ్ చేశారు. సురేంద్ర కృష్ణ రాసిన పాటకు చేతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. సాయి చరణ్ భాస్కరుని ఆలపించారు. 'టిక్కల్ టిక్కల్, ఢమాల్ ఢమాల్...కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్ రా..టైమ్ కాస్త బ్యాడ్ అయితే కె ర్యాంప్ రా..ఫ్లేవర్ లాంటి లవర్ ఉంటే లైఫ్ సూపర్ రా, ఫ్లేవర్ కాస్త ఫైర్ అయితే కె ర్యాంప్ రా...' అంటూ సాగుతుందీ పాట.

దీపావళి ఎంటర్‌టైనర్



ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జంటగా నటించిన చిత్రం 'మిత్రమండలి'. బన్నీ వాస్ సమర్పణలో కల్యాణ్ మంతెన, భాను ప్రతాప్, డా. విజయేందర్‌రెడ్డి తీగల నిర్మించారు. సోమరాజు పెన్మత్స సహ నిర్మాత. విజయేందర్ ఎస్ దర్శకుడు. దీపావళి సందర్భంగా ఈ నెల 16న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బన్నీ వాస్ మాట్లాడుతూ "మిత్రమండలి' కథ నా మనసుకు బాగా నచ్చింది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను నవ్విస్తుంది. సరికొత్త వినోదాన్ని పంచుతుంది. ఒక పరిపూర్ణ దీపావళి ఎంటర్‌టైనర్‌గా 'మిత్రమండలి' రూపుదిద్దుకుంది' అని చెప్పారు. ప్రియదర్శి మాట్లాడుతూ 'ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోవాలనే లక్ష్యంతో 'మిత్రమండలి' సినిమా చేశాం. 'జాతిరత్నాలు' సినిమాకు రెట్టింపు నవ్వులు పంచుతుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాం. నలుగురు స్నేహితులు సరదాగా మాట్లాడుకుంటే ఎలాంటి ఆనందం కలుగుతుందో మా సినిమా కూడా అలాంటి అనుభూతిని ఇస్తుంది' అన్నారు. కథ వినగానే మిత్రమండలి సినిమా చేయాలనుకున్నాను, మొదటి సినిమాలోనే మంచి పాత్ర దక్కినందుకు ఆనందంగా ఉంది అని నిహారికా ఎన్.ఎం అన్నారు.

భావోద్వేగాలున్న కథ



నీరజ కోన

"తెలుసుకదా' చిత్రంతో రచయిత్రిగా, దర్శకురాలిగా ఇండస్ట్రీకి పరిచయమవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రేమకథతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలున్న కథ ఇది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన అన్నారు. సినీరంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకున్న ఆమె సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన 'తెలుసుకదా' చిత్రంతో దర్శకురాలిగా మారారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈనెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నీరజ కోన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- నేను దాదాపుగా వంద సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశాను. కానీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మాత్రం పనిచేయలేదు. 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. ఆ అనుభవమే ఈ సినిమాకు చాలా వరకూ ఉపయోగపడింది. ఈ సినిమా కథను తొలుత నితిన్‌కు వినిపించాను. సిద్ధు ఈ సినిమాకు సూటవుతాడు అని చెప్పారు. సింగిల్ సిట్టింగ్‌లో కథను సిద్ధు ఓకే చేశారు. అవి నా జీవితంలో మరచిపోలేని క్షణాలు.
- బేసిగ్గా ఇదొక లవ్‌స్టోరీ. ప్రతి పాత్ర ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. దర్శకురాలిగా కథను నిజాయితీగా చెప్పడం పైనే దృష్టి సారించాను. ఇందులో వరుణ్ పాత్రలో సిద్ధు నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ.

కన్నడ దర్శకనిర్మాత హేమంత్ అరెస్టు



కన్నడ దర్శకుడు, నిర్మాత హేమంత్ కుమార్(34)ను లైంగిక వేధింపుల కేసులో పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బిగ్‌బాస్ ఫేం, 'రిచ్చి' సినిమా నటి ఫిర్యాదు మేరకు ఆయనపై లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. 2022లో బిగ్‌బాస్ ద్వారా పేరు సంపాదించిన ఓ యువతికి హేమంత్ కుమార్ పరిచయం అయ్యారు. తాను తీస్తున్న 'రిచ్చి' సినిమాలో నటించాలని ఆఫర్ ఇచ్చారు. ఆమెకు రూ.2 లక్షలు పారితోషికం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుని, అందులో రూ.60 వేలు చెల్లించారు. అశ్లీల దుస్తులు ధరించాలని, అదే తరహాలో నటించాలని ఆమెపై హేమంత్ ఒత్తిడి తెచ్చారు. షూటింగ్ ముగిశాక ఆమెకు ఇచ్చిన పేమెంట్ చెక్ బౌన్స్ అయింది. డబ్బులు అడిగితే ప్రాణాలు తీస్తామని హేమంత్ బెదిరించారు. మధ్యవర్తుల జోక్యంతో 2023 ఆగస్టు 5న ముంబైలో జరిగిన సినిమా ప్రచారానికి నటి వెళ్లారు. ఆమె వాష్‌రూంకు వెళ్లి వచ్చేసరికే కూల్‌డ్రింక్‌లో హేమంత్ మత్తు మందు కలిపారు. అది తాగి స్పృహ కోల్పోయిన బాధితురాలిని అశ్లీలంగా వీడియోలు తీశారు. వాటిని చూపించి, లైంగిక చర్యలకు ఒప్పుకోవాలని, లేదంటే వీడియోలు బయట పెడతామని బెదిరించారు.. ఈ విషయమై తాను ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశానని, మరో మార్గం లేక పోలీసులకు సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేస్తున్నానని బాధితురాలు పేర్కొన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వాషింగ్టన్ సుందర్ తొలి గీతం



సత్య వినుగొండ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. అనుశ్రీ, శీతల్ భట్ కథానాయికలు. మూవీ కార్పొరేషన్ బేనర్‌పై బీపేట ప్రేమ్ కుమార్ సమర్పణలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా చిత్రంలోని తొలి గీతాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్య వినుగొండ మాట్లాడుతూ 'చిన్నప్పుడు తన సొంత ఊరుని వదిలి పారిపోయిన కుర్రాడు మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఎందుకు తిరిగి వచ్చాడు? అనేది ఈ చిత్ర కథ' అని చెప్పారు.

విజయ్.. ఓ జోకర్





శృతిహాసన్

తమిళ హీరో, 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు విజయ్‌ను హీరోయిన్ శృతిహాసన్ ఓ జోకర్‌తో పోల్చారు. ఇటీవల జరిగిన కరూర్ తొక్కిసలాట వల్ల 41 మంది మరణించిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'ఓ జోకర్ సర్కస్‌కు వెళ్లడం వల్లే ఆ ఘోరం జరిగింది' అంటూ ఆమె తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. విజయ్ ఒక జోకర్.. జోకర్‌గానే ఆయన నడుచుకున్నారని, అందువల్ల ఆయన్ని తప్పుపట్టరాదన్నారు. సర్కస్‌కు పోయిన వారినే వేలెత్తి చూపాలన్నారు. కాగా ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఇదిలా వుండగా కరూర్ దుర్ఘటనలో మృతి చెందిన కొంతమంది కుటుంబీకులతో విజయ్ సోమవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జరిగిన నష్టం పూడ్చలేనిదని, కానీ జీవితాంతం తాను అండగా వుంటానని విజయ్ వారిని ఓదార్చారు.

మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు



నటుడు శ్రీకాంత్ కృష్ణస్వామి తన వివాదాస్పద వ్యాఖ్యలతో ఇప్పటికే పలుసార్లు వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తీవ్ర స్థాయిలో దూషించారు. గాంధీజీ స్త్రీ లోలుడని, ఎంతో మంది ఆడవారిని లైంగికంగా వేధించాడని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వాతంత్ర్యం గాంధీ వల్ల కాదు సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ వల్లే వచ్చిందని అన్నారు. ఈ వ్యాఖ్యలతో నెట్టింట పెద్ద దుమారమే రేగింది. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. మహాత్మాగాంధీ పుట్టిన రోజున కూడా శ్రీకాంత్ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా, సినీ తారలు ఇలా హద్దులు మీరి మాట్లాడడం, తరువాత నాలిక్కరుచుకోవడం ఓ అలవాటు అయిపోయిందని, మొన్న రాహుల్ రామకృష్ణ, నేడు శ్రీకాంత్.. ఇలా మాట్లాడేటప్పుడు సంయమనం పాటిస్తే బాగుంటుందనేదని అంటున్నారు.

వినోదం.. సందేశం



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కానిస్టేబుల్'. మధులికా వారణాసి కథానాయిక. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించారు. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'సమాజంలో జరుగుతున్న కొన్ని అరాచక పోకడలను ఎత్తిచూపుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. వాణిజ్య హంగులతో పాటు వినోదం, సందేశం మేళవింపుగా దర్శకుడు తీర్చిదిద్దారు. నా తొలి చిత్రం 'హ్యాపీ డేస్' కూడా ఇదే నెల్లో విడుదలైంది. ఈ సినిమా కూడా ఆ స్థాయి విజయాన్ని అందుకోవాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమాపై మా నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. బలగం జగదీశ్ మాట్లాడుతూ 'ఒక యువతి జీవితంలో తలెత్తిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం ఉండబోతోంది. కుటుంబం అంతా కలసి చూడాల్సిన సినిమా ఇది' అని అన్నారు.


విజయవాడలో జరిగిన 'పోరుబాట' కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం

- పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి
- 12వ పీఆర్సీ, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి
- ఈనెల 10 నుంచి బోధనేతర విధుల బహిష్కరణ
- 'పోరుబాట' కార్యక్రమంలో ఫ్యాప్టో నేతల ప్రకటన

విజయవాడ (ధర్నాచౌక్), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి బోధనేతర విధులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే మరో బీఆర్టీఎస్ రోడ్డు తరహా ఉద్యమాన్ని చేపడతామని ఫ్యాప్టో నేతలు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా.. నేటికీ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నేటికీ 70 రకాల యాప్‌లలో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి వస్తుందని వాపోయారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యారంగంలో విపరీతంగా పెరిగిపోయిన యాప్‌లతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసేందుకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సానుకూలంగా ఉన్నప్పటికీ.. అధికారులు అలసత్వంగా ఉన్నారని ఆరోపించారు. సీపీఎస్‌పై చర్చలు తీసుకోవాలని కోరారు. టీచర్లను విద్య బోధించేందుకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వమిచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని ఫ్యాప్టో చైర్మన్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ చిరంజీవి మాట్లాడుతూ గిన్నిస్‌బుక్ రికార్డులు, యోగాంధ్ర కార్యక్రమాల కోసం ఉపాధ్యాయులను ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ, ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి, మాజీ ఎమ్మెల్సీలు కేఎస్.లక్ష్మణరావు, కత్తి నరసింహారావు 'పోరుబాట' కార్యక్రమంలో పాల్గొన్నారు.

కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు హాజరైన అయ్యన్న

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్న పాత్రుడు బార్బడోస్‌లో మంగళవారం నుంచి ప్రారంభమైన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు హాజరయ్యారు. శాసనసభల సభాధ్యక్షులు తమ అనుభవాలను ఈ సదస్సులో పంచుకుంటారు. శాసనసభలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తారు. బార్బడోస్‌కు వెళ్తున్న భారత ప్రతినిధుల గౌరవార్థం లండన్‌లోని ఇండియా హౌస్‌లో భారత హైకమిషనర్ ఇచ్చిన విందులో అయ్యన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌తో అయ్యన్న భేటీ అయ్యారు.


రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌తో అయ్యన్న

'ఆటో డ్రైవర్ల సేవలో' మైనార్టీలకు లబ్ధి: ఫరూక్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలులోకి తెచ్చిన 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద మైనార్టీ వర్గాలకు చెందిన డ్రైవర్లకు రూ.41.37 కోట్ల లబ్ధి చేకూరిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 27,580 మంది మైనార్టీ లబ్ధిదారులకు రూ. 15000 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో కేవలం ఒక్కో డ్రైవర్‌కు రూ.10 వేల వంతున 24,393 మందికి రూ.24.39 కోట్లు మాత్రమే ఇచ్చారని వెల్లడించారు.

గాలి మనీలాండరింగ్ కేసు కొట్టివేతకు సుప్రీం నో!

న్యూఢిల్లీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గాలి జనార్ధన్‌రెడ్డి మైనింగ్ కుంభకోణంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసును కొట్టివేయాలని జేఎస్ డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్, దాని డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రవీణ్ జాన్ సెక్వేరా దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. గాలి జనార్ధన్‌రెడ్డి ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించి అక్రమ మైనింగ్ కుంభకోణంపై ఈడీ జరుపుతున్న విచారణలో జోక్యం చేసుకోకూడదని కర్ణాటక హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సరైనదేనని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ గతంలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మైన్స్ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను కూడా అరెస్టు చేసింది.

అనంతపురం జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి నాగమణి సస్పెన్షన్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా శిశు గృహం(ఎస్ఏఏ)లో సిబ్బంది నిర్లక్ష్యంతో శిశువు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. శిశు గృహంలో రెండు నెలల బాలుడు మాస్టర్ నిరూప్ మృతిపై ఆ జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖాధికారి ఎం నాగమణిని తక్షణమే సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. శిశు గృహ పర్యవేక్షణ లోపం, బాలుడు మృతికి సంబంధించిన ప్రాథమిక నివేదికను అందించడంలో జాప్యం కారణంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పిన్నెల్లి సోదరులకు మళ్లీ పోలీసుల నోటీసులు

మాచర్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం గుండ్లపాడు టీడీపీ నేతలు జవిశెట్టి సోదరుల జంట హత్యల కేసులో నిందితులైన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలను మరోసారి విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్లో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. కాగా, జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ బుధవారంతో ముగియనుంది. ముందస్తు బెయిల్‌పై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

హస్తినలో 10 టన్నుల ఎర్ర చందనం పట్టివేత

- తిరుపతి నుంచి అక్రమంగా తరలించిన ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

న్యూఢిల్లీ/అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తిరుపతి నుంచి ఢిల్లీకి తరలించిన రూ.6 కోట్ల విలువైన దాదాపు 10 టన్నుల ఎర్రచందనం దుంగలను పోలీసులు పట్టుకున్నారు. ఢిల్లీ సౌత్ ఈస్ట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఏపీ రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్, ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా తుగ్లకాబాద్ గ్రామంలోని ఒక గోదాముపై దాడి చేసి సుమారు 9.5 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ సంబంధాలున్న ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రచందనం దొంగతనంపై ఈ ఏడాది ఆగస్టులో తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఏపీ పోలీసులు కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఎర్రచందనం దుంగలు అక్రమంగా ఢిల్లీకి తరలిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఏపీ టాస్క్‌ఫోర్స్ అందించిన ఈ సమాచారంతో ఢిల్లీ సౌత్ ఈస్ట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఏపీ రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్, ఏపీ ఇంటెలిజెన్స్ పోలీసులు కలిసి ఒక టీమ్‌గా ఏర్పడి నిఘా పెట్టారు. అందులో భాగంగా సోమవారం హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఇర్ఫాన్‌ను, మహారాష్ట్రలోని థానేకు చెందిన అమిత్ సంపత్ పవార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించిన అనంతరం తుగ్లకాబాద్ గ్రామంలోని ఒక గోదాముపై దాడి చేసి 9.5 టన్నుల ఎర్రచందనంను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుల స్మగ్లింగ్ కార్యకలాపాలపై ఎర్ర చందనం టాస్క్‌ఫోర్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. చైనాకు స్మగ్లింగ్ చేసేందుకు తిరుపతి నుంచి ఆగస్టులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించారన్నారు.

సీజేఐపై దాడి యత్నానికి లాయర్ల నిరసన

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడి యత్నాన్ని నిరసిస్తూ హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. ఏపీ హైకోర్టు ఆవరణలోని జాతీయ జెండా వద్ద హైకోర్టు న్యాయవాదుల సంఘం, ఏపీ హైకోర్టు అంబేడ్కరైట్స్ అడ్వొకేట్ అసోసియేషన్ మంగళవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు. సీజేఐపై దాడి యత్నాన్ని ముక్తకంఠంతో ఖండించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పోసాని వెంకటేశ్వర్లు, కె.చిదంబరం తదితరులు మాట్లాడుతూ... సీజేఐపైనే దాడికి యత్నించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దాడికి ప్రయత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరారు. సనాతన ధర్మం పేరుతో చేసే దాడులను క్షమించడానికి వీల్లేదన్నారు.


సీజేఐపై దాడి యత్నాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

మోహన్‌బాబు వర్సిటీని మూసేయండి!

- ఆ బాధ్యతలు ఎస్వీయూకు అప్పగించండి
- ఉన్నత విద్యా కమిషన్ సంచలన ఉత్తర్వులు
- గుర్తింపు రద్దు, వసూళ్లపై హైకోర్టుకు వర్సిటీ

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కాకుండా యూనివర్సిటీ విద్యార్థుల నుంచి ఏకంగా రూ.26 కోట్లు అదనంగా వసూలు చేసింది. దీంతో సదరు విశ్వవిద్యాలయం గుర్తింపును రద్దు చేయాలని ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసు చేసింది. ఈ మేరకు మంగళవారం సంచలన ఉత్తర్వులు జారీచేసింది. గుర్తింపు రద్దు కోసం యూజీసీ, ఏఐసీటీఈ, ఇతర సంస్థలను కోరాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే యూనివర్సిటీ గుర్తింపును తక్షణం ఉపసంహరించుకోవాలని కీలక ప్రతిపాదన చేసింది. దీంతో భవిష్యత్తులో యూనివర్సిటీ ఉంటుందా? ఉండదా? అనే సందేహాలు తెరమీదికొచ్చాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై దాని భవితవ్యం ఆధారపడింది.

గతేడాది ఫిర్యాదు

ఎంబీయూలో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారంటూ ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ 2024, అక్టోబరులోనే ఉన్నత విద్యా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కంటే ఎక్కువ తీసుకుంటున్నారని, చివరకు డేస్కాలర్స్ (రోజూ ఇంటి నుంచి కాలేజీకి వచ్చే విద్యార్థులు) నుంచి కూడా మెస్ చార్జీలు కట్టించుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కమిషన్‌తో పాటు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు కూడా ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం.. ఈ వ్యవహారంపై విచారణ చేయాలని ఉన్నత విద్యాశాఖను కోరింది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యా కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల కమిటీ గతేడాది డిసెంబరు నుంచి పలు దఫాలుగా యూనివర్సిటీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి కమిషన్‌కు సవివర నివేదిక సమర్పించింది.

వారికి ఇష్టమై కట్టారు: వితండవాదం!

విద్యార్థుల నుంచి అదనపు ఫీజులను వసూలు చేసిన ఎంబీయూ.. దీనిని సమర్థించేందుకు వితండవాదం చేసింది. విద్యార్థులు స్వచ్ఛందంగా అధిక ఫీజులు చెల్లించారని పేర్కొంది. ఇక, యూనివర్సిటీ వసూళ్ల పర్వం ఆధారంగా ఈ ఏడాది జనవరిలోనే ఉన్నత విద్యా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఉల్లంఘనలకు పాల్పడినందుకు రూ.15 లక్షలు జరిమానా ఎందుకు విధించకూడదో చెప్పాలని నోటీసుల్లో ఆదేశించింది. అనంతరం పలుమార్లు యూనివర్సిటీ ప్రతినిధులు కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. వర్సిటీ అధికారులు ఇచ్చిన వివరణ పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు కమిషన్ భావించింది. అదనంగా వసూలు చేసిన రూ.26.17 కోట్లను విద్యార్థులకు తిరిగి చెల్లించాలని కమిషన్ గతంలోనే ఆదేశించినా యూనివర్సిటీ పట్టించుకోలేదు.

ఐటీ శాఖకు చెప్పండి!

ఈ నేపథ్యంలో యూనివర్సిటీ వసూలుచేసిన మొత్తం అదనపు ఫీజులు వెనక్కి ఇవ్వడంతో పాటు రూ.15 లక్షలు జరిమానా చెల్లించాలని ఉన్నత విద్య కమిషన్ కొద్దిరోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. 15 రోజుల్లోనే విద్యార్థులకు రూ.26.17 కోట్లు తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది. అలాగే ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటనే విద్యార్థులు, ఫ్యాకల్టీకి తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. కోర్సులకు అనుమతులు ఇచ్చే యూజీసీ, ఏఐసీటీఈ, పీసీఐ, ఐసీఏఆర్, ఎన్‌సీఏహెచ్‌పీలు మోహన్‌బాబు యూనివర్సిటీకి గుర్తింపు లేనట్లుగా భావించాలని, అలాగే ఏపీ ప్రభుత్వం కూడా యూనివర్సిటీ గుర్తింపును ఉపసంహరించుకోవాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం వర్సిటీలో చదువుతున్న విద్యార్థుల కోసం సమీపంలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలని సూచించింది. ఎంబీయూ, శ్రీ విద్యానికేతన్ ట్రస్టు అక్రమాలపై ఐటీ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించింది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం కూడా విచారణ చేసి అక్రమాల నిగ్గు తేల్చాలని సిఫారసు చేసింది.

పరువు పోతోంది: ఎంబీయూ

కమిషన్ ఉత్తర్వులపై ఎంబీయూ హైకోర్టును ఆశ్రయించింది. కాగా, ఈలోపే కమిషన్ విధించిన రూ.15 లక్షల జరిమానా చెల్లించింది. విద్యార్థులకు రూ.26కోట్లు తిరిగి చెల్లించడం, వర్సిటీ గుర్తింపు ఉపసంహరణ అంశాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై విచారణ కొనసాగుతోంది. అయితే, కమిషన్ ఆర్డర్ కాపీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంపై యూనివర్సిటీ ఆందోళన వ్యక్తం చేసింది. తమ పరువుకు నష్టం వాటిల్లుతోందని దానిని తొలగించాలని కమిషన్‌ను కోరింది. కమిషన్ అంగీకరించకపోవడంతో ఎంబీయూ కోర్టును ఆశ్రయించింది.



కమిటీ గుర్తించిన ఉల్లంఘనలు

- ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ఎంబీయూ ఎక్కువగా వసూలు చేస్తోంది. ఆడిట్ నివేదికల లోనూ ఇది రుజువైంది.
- విద్యార్థులు, ఫ్యాకల్టీకి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధం.
- విద్యార్థుల హాజరు నమోదులోనూ ఉల్లంఘనలు ఉన్నాయి.
- విద్యార్థులు తరగతులకు హాజరైనా కానట్లు చూపించి, వారి నుంచి రూ.7,500 చొప్పున అదనంగా వసూలు చేశారు.
- ఉన్నత విద్య కమిషన్‌కు సరైన సమాచారం ఇవ్వడం లేదు.
- వసూలు చేసిన ఫీజుల సమాచారం కమిషన్‌కు వెల్లడించలేదు.

ఇదీ.. అదనపు గిల్లుడు

- బీటెక్ విద్యార్థుల నుంచి రూ.5 వేల-రూ.45,500.
- డిగ్రీ, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఏ విద్యార్థుల నుంచి రూ.18 వేల-రూ.25 వేలు.
- బీఫార్మసీ, ఫార్మా-డీ విద్యార్థుల నుంచి రూ.25 వేల-రూ.40 వేలు.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్) విద్యార్థుల నుంచి రూ.22 వేల-రూ.33 వేలు.
- పారామెడికల్, హెల్త్ కేర్ సైన్సెస్ విద్యార్థుల నుంచి రూ.40 వేల-రూ.45వేలు

ఎప్పుడెప్పుడు ఎంతెంత?

విద్యా సంవత్సరం	సొమ్ము (రూ.కోట్లు)
2022-23	2.59
2023-24	10.65
2024-25	12.93

కొత్తగా మరిన్ని బీసీ గురుకులాలు: సవిత

- 'వాల్మీకి భవనం' కోసం రూ.కోటి విరాళం: మంత్రి భరత్
- అనంత, కర్నూలులో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

కర్నూలు ఎడ్యుకేషన్, అనంతపురం క్రైం, అమరావతి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అలాగే బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. మంగళవారం కర్నూలు, అనంతపురం నగరంలో వాల్మీకీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో మంత్రి సవిత, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. వాల్మీకుల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నందున వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే విషయమై సీఎం చంద్రబాబు కృషి ఫలిస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. కాపు భవన్, బీసీ భవన్ల నిర్మాణానికి రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించానని, అదేవిధంగా వాల్మీకి భవనానికి రూ.కోటి విరాళంగా ఇస్తానన్నారు. కాగా.. వాల్మీకులు, బోయలను ఎస్టీల్లో చేర్చేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. అనంతపురం వాల్మీకి సర్కిల్‌లో మంగళవారం జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'వాల్మీకి.. మహర్షిగా మారి రచించిన రామాయణం సంస్కృత ఆది కావ్యమే కాదు.. ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువల్ని నేర్పే గొప్ప పాఠం' అని రాష్ట్ర బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాశ్ నారాయణ అన్నారు. విజయవాడలో వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.


అనంతపురంలో వాల్మీకి విగ్రహం వద్ద పయ్యావుల కేశవ్, జేసీ శివనారాయణ శర్మ, కూటమి నాయకులు

104లో రక్త పరీక్షలెప్పుడు..!

- జ్వరం, బీపీ, షుగర్ మందులకే పరిమితం
- ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా 104 వాహనాలు
- 'ఇంటి వద్దకే వైద్యసేవలు'కు గ్రహణం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇంటి వద్దకే అన్నిరకాల వైద్య సేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 104 వాహనాలను ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 904 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఈ వాహనాలు రోజూ గ్రామాల్లోకి వెళ్లి.. ప్రజలకు వైద్య సేవలందించాలి. బీపీ, షుగర్, యూరిన్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతోపాటు కిడ్నీ, లివర్ ఫంక్షనింగ్... ఇలా 47 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ.. ఉదయాన్నే డ్రైవర్, డీఈవో (డేటా ఎంట్రీ ఆపరేటర్)తో కలిసి గ్రామాల్లోకి వెళ్తున్న 104 వాహనాలు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడం లేదు. జ్వరానికి పారాసిటమాల్, వృద్ధులకు బీపీ, షుగర్ మందులు, గర్భిణులకు ఐరన్ ట్యాబ్లెట్లు ఇవ్వడానికి తప్ప ఈ వాహనాలు దేనికీ ఉపయోగపడడం లేదు.

పరీక్షలు లేకుండానే మందులు..

సీఎం చంద్రబాబు.. 104 వాహనాలను కేవలం మందులివ్వడానికే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రక్తపరీక్షలు నిర్వహించేలా చూడాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కొత్తగా 104 వాహనాలను ప్రారంభించి ఐదు నెలలు పూర్తయింది. కానీ.. ఈ వాహనాలు గ్రామాల్లోకి వెళ్లి వృద్ధులు, గర్భిణులకు మందులిచ్చి రావడం తప్ప రక్తపరీక్షల ఊసే ఎత్తడం లేదు. పీహెచ్‌సీ డాక్టర్.. గర్భిణులకు కొన్ని సూచనలు ఇవ్వడం తప్ప వైద్య పరీక్షలు నిర్వహించడం లేదు. నిబంధనల ప్రకారం 104 వాహనాల్లో 47 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ.. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఇవేమీ అందడం లేదు. 104 వాహనాల్లో రక్తపరీక్షలు చేయకుండానే, వారిలో సమస్య ఎంత స్థాయిలో ఉందో తెలుసుకోకుండానే మందులు ఇచ్చేస్తున్నారు. మరోవైపు గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు కూడా మందులు కావాలంటే తాము పీహెచ్‌సీల్లో తీసుకుంటామని, తమకు రక్తపరీక్షలు కూడా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పైలట్ పూర్తయినా చర్యలేవీ

104 వాహనాల పర్యవేక్షణ బాధ్యత మొత్తం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అధికారుల పరిధిలో ఉంది. ఈ వాహనాల్లో రక్తపరీక్షలు కూడా చేపట్టాలని నిర్ణయించిన ట్రస్ట్ అధికారులు.. కృష్ణా, పల్నాడు జిల్లాల్లో మూడేసి మండలాల చొప్పున ఎంచుకుని పైలట్ ప్రాజెక్టుగా రెండు నెలల పాటు రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రతీ గ్రామంలో రోజూ సగటున 30 నుంచి 50 మంది వరకూ రక్తపరీక్షలు చేయించుకున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు పూర్తయి నెల కావస్తున్నా మిగిలిన జిల్లాల్లో రక్తపరీక్షల నిర్వహణకు అధికారులు ముందడుగు వేయడం లేదు.

నేడు కుప్పంలో 'సంజీవని' పథకం ప్రారంభం

రాష్ట్రంలో ప్రజలందరికీ అవసరమైన రక్తపరీక్షలు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి, వారికి ఉన్న అనారోగ్య సమస్యల గురించి ముందస్తుగానే తెలియజేస్తే వారు జాగ్రత్తపడతారని సీఎం భావిస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 30 ఏళ్లు దాటిన వారందరికీ సంజీవని పథకం కింద అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు దీన్ని పైలట్ ప్రాజెక్టుగా తొలుత కుప్పంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. కుప్పం తర్వాత చిత్తూరు జిల్లావ్యాప్తంగా, ఆ తర్వాత రాష్ట్రం మొత్తం దీన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి తోడు 104 వాహనాల్లో కచ్చితంగా రక్తపరీక్షలు నిర్వహించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. ఈ వాహనాల్లో రక్తపరీక్షలు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించారు. కానీ.. ఇది అమలుకావడం లేదు. ఆరోగ్యశాఖ అధికారులు దీన్ని ఎప్పటినుంచి అమలులోకి తీసుకువస్తారో కూడా చెప్పలేని పరిస్థితి.

కేజీహెచ్‌లో కోలుకుంటున్న 'విద్యార్థినులు'

- మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు.. కోలుకున్న ఎనిమిది మంది పార్వతీపురం ఆసుపత్రికి తరలింపు

విశాఖపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్లతో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు క్రమంగా కోలుకుంటున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు తదితర లక్షణాలతో బాధపడుతున్న 51 మంది విద్యార్థినులను ఈ నెల 4న పార్వతీపురం ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించిన వైద్యులు విద్యార్థినులంతా పచ్చకామెర్లతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. వారికి అందించే వైద్య సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి నేతృత్వంలోని వైద్యుల బృందం పర్యవేక్షిస్తుంది. మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందించేందుకు వీలుగా వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించారు. వ్యాధి తగ్గుముఖం పట్టిన ఎనిమిది మందిని మంగళవారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. అయితే మరికొద్ది రోజుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో వారిని పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు. కాగా పార్వతీపురం ఆస్పత్రి నుంచి మంగళవారం సాయంత్రం మరో ఏడుగురు విద్యార్థినులు కేజీహెచ్‌కు వచ్చారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో 50 మంది బాలికలకు చికిత్స అందిస్తున్నారు.

బాలికలకు మెరుగైన వైద్య సేవలు: సత్యకుమార్

మహారాణిపేట(విశాఖపట్నం), పార్వతీపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్లతో అస్వస్థతకు గురైన కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఈ ఘటనపై విచారించేందుకు ఇప్పటికే అధికారుల బృందం కురుపాం చేరుకుందని, నివేదిక మేరకు బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు. కాగా, గురుకుల విద్యాలయాల్లో ఐటీడీఏ పీవో లేదా డీడీ స్థాయి అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి చేస్తామని గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ అన్నారు. గురుకుల విద్యాలయాలతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

అధ్వానంగా సంక్షేమ వసతి గృహాలు

- బాబుకు గుడులపై ఉన్న శ్రద్ధ... బడులు, హాస్టళ్లపై లేదు: వైఎస్ షర్మిల
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం విద్యార్థినులకు పరామర్శ

విశాఖపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురికావాల్సి వస్తోంది' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. పచ్చకామెర్ల బారిన పడి నగరంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల బాలికల వసతి గృహం విద్యార్థినులను మంగళవారం ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో నెలకొన్న దారుణ పరిస్థితులను గుర్తించిన హైకోర్టు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంక్షేమ వసతి గృహాల్లో వసతులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలి. కలుషిత నీరు తాగడం వల్లే చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారు. వారిలో ఇద్దరు మృతి చెందడం బాధాకరం. వసతి గృహాల్లో భోజనం బాగుండడం లేదని చిన్నారులు చెప్పారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. 228 మంది ఆడ పిల్లలుండే హాస్టల్‌లో ఒకే బాత్‌రూమ్ ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో రూమ్‌లో 17మంది ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు గుడులు మీద ఉన్న శ్రద్ధ బడులు, హాస్టళ్ల మీద లేదు. దీన్ని ప్రశ్నిస్తే నేను హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడినట్టు చిత్రీకరించారు. స్వర్ణాంధ్ర హాస్టల్స్ విజన్ 2027 పేరుతో వచ్చే రెండేళ్లలో వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. లేదంటే కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేస్తాం. కురుపాం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఇందుకోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు


చికిత్స పొందుతున్న విద్యార్థినిని ముద్దాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

ఉచితాలు కాదు.. అభివృద్ధే ప్రధానం

- ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి
- క్రిమినల్ కేసులను రెండేళ్లలో విచారించాలి
- సీజేఐపై దాడి యత్నం బాధాకరం : వెంకయ్య

వెంకటాచలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచిత పథకాలు అందించడంపై కన్నా అభివృద్ధి మీద ప్రభుత్వాలు దృష్టి సారించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. "రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచితాలు అనుచితంగా తయారవుతున్నాయి. ఎన్నికల్లో ప్రయోజనం కోసం ఉచిత పథకాలు ప్రకటించడం అలవాటుగా మారింది. వాటి అమలుతో రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు తాహతుకు మించి అప్పులు చేయాల్సి వస్తోంది" అని అన్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వ్యక్తిగత దూషణ తగదు..

చట్టసభల్లో సరైనభాష మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలకు పాల్పడేవారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. "స్పీకర్లు ఇలాంటి విషయాల్లో కఠినంగా వ్యవహరించాలి. అసెంబ్లీ నియమాలను గట్టిగా అమలు చేయడంతోపాటు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. చట్టసభల్లో హుందాగా రాజకీయం చేయాలి" అని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు ఒకవేళ పార్టీ మారాలనుకుంటే, ఆ పార్టీ ద్వారా పొందిన పదవికి ముందుగా రాజీనామా చేయాల్సి ఉంటుందన్నారు. 'పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్నాయి. పార్టీలు మారి మంత్రులు అవుతుండటం ప్రస్తుతం తెలంగాణలోను, గతంలో ఏపీలోను చూశాం. చట్టానికి అతీతంగా



ఎవరూ వ్యవహరించకూడదు. ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసులను రెండేళ్లలోపే విచారించాలి. దీనికోసం ప్రభుత్వాలు కోర్టుల సంఖ్య పెంచి న్యాయమూర్తులను నియమించాలి" అని ఆయన సూచించారు. రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించకూడదని, దానికి తాను వ్యతిరేకమని వెంకయ్య చెప్పారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి ప్రయత్నం బాధాకరమన్న ఆయన, ఇది చీఫ్ జస్టిస్‌కు సంబంధించిన అంశమే కాదని, సమాజానికి, వ్యవస్థకు సంబంధించిన విషయం కూడా అన్నారు. ఇందుకు పాల్పడిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.



రామ్మూర్తి నాయుడి సంవత్సరీక పూజలు నిర్వహిస్తున్న నారా గిరీశ్, రోహిత్, పాల్గొన్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

స్వగ్రామంలో సీఎం చంద్రబాబు

సోదరుడి సంవత్సరీక పూజల్లో పాల్గొని నివాళి

- ప్రజల నుంచి వినతుల స్వీకరణ.. సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

తిరుపతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం తన స్వగ్రామమైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లె వచ్చారు. తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడి సంవత్సరీకం పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11.30కు చంద్రగిరి మండలం ఎ.రంగంపేట హెలిపాడ్‌కు చేరుకున్న చంద్రబాబు.. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నారావారిపల్లె వచ్చారు. ఇంట్లో పూజలు పూర్తయ్యాక సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, సోదరుడి సతీమణి ఇందిర, వారి కుమారులు రోహిత్, గిరీశ్‌తో కలసి స్మృతివనంలోని రామ్మూర్తినాయుడు సమాధిని సందర్శించి, నివాళులు అర్పించారు. అనంతరం ఇంటికి చేరుకుని, అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడారు. మధ్యాహ్నం 2.15కు లోకేశ్‌తో కలసి హెలికాప్టర్‌లో ఉండవల్లికి తిరుగు ప్రయాణమయ్యారు.

మానసిక వికలాంగురాలి గోడు విని.. చలించిన సీఎం

సోదరుడి సంవత్సరీకంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబు.. కేవలం మూడు గంటలు మాత్రమే ఇక్కడ గడిపారు. పూజా కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా.. మధ్యలో అరగంటకుపైగా ప్రజల కోసం కేటాయించారు. తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను పలకరిస్తూనే జనం నుంచి వినతులు స్వీకరించారు. బాధిత జనం చెప్పింది ఓపికగా విని, తదుపరి చర్యల కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుగు ప్రయాణంలో వైకల్యంతో బాధపడుతున్న పదేళ్ల చిన్నారిని చూసి కాన్వాయ్ ఆపించి మరీ పలకరించారు. నాయుడుపేటకు చెందిన మానసిక వికలాంగురాలు ప్రత్యూష వివరాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఆ చిన్నారి పెద్దనాన్న సంరక్షణలో ఉందని, 90 శాతం వైకల్యంతో ఉన్నా.. పూర్తి పెన్షన్ అందడం లేదని తెలుసుకున్న సీఎం.. ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేలు కాకుండా రూ.15 వేలు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, విజయశ్రీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, థామస్, మురళీమోహన్, ఆదిమూలం, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీని రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలి

- అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం: నక్కా ఆనంద్ బాబు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు కుట్ర చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. 'రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ పెద్దల డైరెక్షన్‌తోనే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద చల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజా, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలి. క్రూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నారు' అని ఆనంద్‌బాబు విమర్శించారు.

మామూలోడు కాదు.. మాయలోడు!

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు.. వైసీపీ సర్పంచ్ కుట్ర.. పక్కన ఉన్న పాకకు నిప్పు పెడితే విగ్రహానికి అంటుకుంటుందని ముందస్తు ప్రణాళిక

- టీడీపీపై బురద చల్లేందుకు నారాయణస్వామితో కలిసి కుట్ర
- ఆధారాలతో సహా గుర్తించి అరెస్టు చేసిన పోలీసులు
- టీడీపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచి వైసీపీలోకి జంప్
- వైసీపీ హయాంలో మట్టి అక్రమ రవాణా దందా
- పంచాయతీ నిధుల దుర్వినియోగంతో చెక్ పవర్ కట్

చిత్తూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వ్యవహారం చివరకు వైసీపీ నాయకుల మెడకే చుట్టుకుంది. ఇందులో వైసీపీ సర్పంచ్ గోవిందయ్య హస్తం ఉందనే విషయం పోలీసుల దర్యాప్తులో బహిర్గతమైంది. విగ్రహానికి ఆనుకుని ఉన్న పాకకు ముందస్తు ప్రణాళిక ప్రకారం మంట పెట్టి.. దాన్ని టీడీపీ నాయకులపైకి నెట్టి.. వారిని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఆయన పన్నిన కుట్ర బయటపడింది. ఈ వ్యవహారంలో గోవిందయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

టీడీపీ సర్పంచ్‌గా గెలిచి వైసీపీలోకి..

వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ సర్పంచి స్థానానికి టీడీపీ మద్దతుతో గోవిందయ్య బరిలో నిలిచారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అక్రమ ఏకగ్రీవాలు చేసుకోగా, అక్కడి టీడీపీ నాయకులు మాత్రం గట్టిగా పోరాడి ఎన్నికలు జరిపించారు. ప్రచారానికి కూడా డబ్బులు లేని గోవిందయ్యను అభ్యర్థిగా నిలబెట్టి చందాలు వేసుకుని.. 250 ఓట్ల మెజార్టీతో ఆయనను గెలిపించారు. గెలిచిన వెంటనే ఆయన నారాయణస్వామి సమక్షంలో వైసీపీలో చేరి, ఆయనకు ముఖ్య అనుచరుడిగా మారిపోయారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి అండతో అక్రమ మట్టి తరలింపు వ్యాపారం చేసి రెండు చేతులా ఆర్జించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మట్టి తరలింపును అడ్డుకున్న వీఆర్వో మీదకు ఎక్స్‌కవేటర్ ఎక్కించే ప్రయత్నం చేయడంతో వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధుల దుర్వినియోగం

బొమ్మయ్యపల్లె పంచాయతీలోని సుమారు రూ.30 లక్షల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు, పంచాయతీ తీర్మానాలు లేకుండా ఇష్టానుసారంగా పనులు చేయడంతో వార్డు సభ్యులు.. సర్పంచ్ గోవిందయ్యపై గతేడాది డీపీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై షోకాజ్ ఇచ్చినా... వివరణ ఇవ్వకపోవడంతో ఆయన చెక్ పవర్‌ను కలెక్టర్ రద్దు చేశారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు సతీశ్‌నాయుడు, పయని తదితరులపై గోవిందయ్య కక్ష పెంచుకున్నారు. కొన్నాళ్లకు ఆయన చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. ప్రస్తుతం పంచాయతీ ఖాతాలో రూ.8.5 లక్షలు ఉండగా, రూ.12 లక్షల మేరకు పనులు చేసినట్లు దొంగ బిల్లులు పెట్టడంతో వార్డు మెంబర్లు మళ్లీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఖాతాలో నిధులున్నా, డ్రా చేసుకోలేకపోతున్నాననే కసి గోవిందయ్యలో ఉంది.



సర్పంచ్ గోవిందయ్య

4నెలల క్రితం విగ్రహం కింద షెడ్డు ఏర్పాటు

దేవళంపేట బస్టాండు సమీపంలో అంబేడ్కర్ విగ్రహం ఉంది. దీనికి పక్కనే పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో సర్పంచ్ మనిషిగా ఉన్న ఓ మహిళ షాపు నడుపుతున్నారు. విగ్రహానికి ఆనుకుని 4నెలల కిందట ఆమె తాత్కాలికంగా పాక ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సహకరించిన గోవిందయ్య.. ఆ షెడ్డుకు నిప్పు పెడితే అంబేడ్కర్ విగ్రహం కూడా కాలుతుందని, దీన్ని రాజకీయంగా వాడుకోవచ్చని పథకం వేశారు. ముందస్తు ప్రణాళిక మేరకు గత గురువారం షెడ్డుకు నిప్పు పెట్టించడంతో విగ్రహానికి సెగ తగిలి, కాళ్ల భాగం నల్లగా మారింది. దీన్ని వాడుకుని గోవిందయ్యతో కలిసి జాతీయ స్థాయిలో టీడీపీని ఇబ్బంది పెట్టాలని నారాయణస్వామి ప్రయత్నించారు. అయితే పోలీసులు ఈ కుట్రను వెలికి తీసి సర్పంచ్‌ను కటకటాల్లోకి నెట్టడంతో వైసీపీకి భంగపాటు తప్పలేదు.

వైసీపీ దొంగలు దొరికారు: టీడీపీ

తిరుపతి(జీవకోన): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటుకున్న ఘటన పూర్తిగా వైసీపీ కుట్రలో భాగమేనని టీడీపీ ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, వీఎం థామస్, మురళీమోహన్, నెలవల విజయశ్రీ, యార్లగడ్డ వెంకట్రావు చెప్పారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ ఈ ఘటనలో టీడీపీ నేతలను ఇరికించాలని సర్పంచ్ గోవిందయ్య డ్రామాలాడి చివరకు జైలుకు వెళ్లారని చెప్పారు. గోవిందయ్యే స్థానికంగా ఉన్న మహిళతో కలిసి ఈ ఘటనకు పాల్పడినట్లు నిరూపితమైందని తెలిపారు. ఎస్సీల దేవుడు అంబేడ్కర్ అని, ఈ ఘటనకు పాల్పడిన గోవిందయ్యను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బేసిక్ నాలెడ్జ్ కూడా లేని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ విషయంపై మాట్లాడుతున్న మాటలు జోకర్‌ను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన నారాయణస్వామి మెంటలోడు అని, ఆయనకు ధైర్యం ఉంటే తమపై అటాక్ చేయాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ దేవళంపేట ఘటనలో దొంగలు దొరికారని, రాజకీయ మంట పెట్టి చలి కాచుకోవాలని చూసిన వీరి పరిస్థితి ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ఎస్సీ కమిషన్‌కు లేఖ రాసిన వైసీపీ ఎంపీకి నిజాయితీ ఉంటే ఈ ఘటన వెనకున్నవారిని కూడా శిక్షించాలని కోరాలని సూచించారు.

అమరావతిలో భూసేకరణ అమలులోకి

- గతంలో ఉన్న నోటిఫికేషన్లు ఉపసంహరణ
- కొత్తగా భూ సేకరణ నోటిఫికేషన్లు జారీకి ప్రతిపాదనలు సిద్ధం చేసిన సీఆర్‌డీఏ
- మినహాయింపుల విషయం తేల్చకపోతే చట్ట ప్రకారం ముందుకెళ్తాం: రైతులు

అమరావతి/విజయవాడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో భూసేకరణ ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ చట్టం-2013 ప్రకారం రాజధాని ప్రాంతంలో అమల్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవసరమైన భూములు సేకరించేందుకు గుంటూరు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఇదిలాఉండగా, గత భూసేకరణ నోటిఫికేషన్ల రద్దుతో సీఆర్‌డీఏ అధికారులు సరికొత్తగా నోటిఫికేషన్లు జారీ చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని బుధ, గురువారాల్లో జిల్లా యంత్రాంగానికి అందజేయనున్నారు. రాజధానిలో 2,800 ఎకరాల సేకరణకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న నేపథ్యంలో, తొలిదశలో ఎంత మేర భూముల సేకరణకు నోటిఫికేషన్ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత ధరల ప్రాతిపదికనే పరిహారం ఇచ్చేలా నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. మరోవైపు, తమ సమస్యలు పరిష్కరించాకే ఈ విషయంలో ముందుకు వెళ్లాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రైతులు అంటున్నారు. వైసీపీ హయాంలో 1,900 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ల రద్దుపై కొంతమంది కోర్టుకు వెళ్లారని.. ఆ అంశం ఇంకా కోర్టులో ఉండగా కొత్తగా భూసేకరణ నోటిఫికేషన్ ఎలా ఇస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక ప్రాజెక్టుల కోసం ఎస్పీవీ

అమరావతి రాజధానిలో ప్రత్యేక ప్రాజెక్టుల అభివృద్ధి, అమలు, ఆపరేషన్, నిర్వహణకు సంబంధించి స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)ని ఏర్పాటు చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్ సిటీ, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, రోప్‌వే, ఇన్నర్ రింగ్‌రోడ్డుతోపాటు ప్రభుత్వం, సీఆర్‌డీఏ ఆమోదించిన ప్రాజెక్టులను ఎస్పీవీ ద్వారా చేపట్టనున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యకుమార్, చిత్రంలో కేంద్ర ఆరోగ్య శాఖ డీజీ డాక్టర్ సునీత శర్మ తదితరులు

ఒక్కసారి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

- విశాఖ వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్

విశాఖపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అపోహలు వీడి రక్తదానం చేసేందుకు యువత ముందుకురావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఒకసారి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉందన్నారు. రక్త మార్పిడి సేవల విభాగం, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో రక్తం, రక్త ఉత్పత్తుల హేతుబద్ధ వినియోగం అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తం అవసరమైనంత మేర అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. వర్క్‌షాప్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీతశర్మ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మేగా ప్రవీణ్ ఖో బ్రగడే తదితరులు మాట్లాడారు.

కల్తీ మద్యానికి కర్త, కర్మ, క్రియ జగనే: సుజాత

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి కర్త, కర్మ, క్రియ అంతా జగన్‌రెడ్డేనని మాజీ మంత్రి, ఏపీ డబ్ల్యూసీఎఫ్‌సీ చైర్మన్ పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ కారణంగానే కల్తీ మద్యంతో అనేక మంది చనిపోయారు. కల్తీ మద్యంపై విమర్శించే హక్కు వైసీపీకి, జగన్‌కు లేదు. కల్తీ మద్యాన్ని పట్టుకున్నది కూటమి ప్రభుత్వం. నిందితుల్లో ఉన్న టీడీపీ వారి పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. కానీ జగన్ ఐదేళ్లపాటు వైసీపీ నేతలు ఎన్ని నేరాలు చేసినా ఒక్కరినీ సస్పెండ్ చేయలేదు' అంటూ సుజాత మండిపడ్డారు.

కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్

కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారిందన్నారు. వైసీపీ నాయకులే డిస్టలరీలను ఏర్పాటు చేసి నకిలీ మద్యాన్ని తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు.

ఎన్ని జన్మలెత్తినా జగన్ 'లిక్కర్' పాపాలు కడుక్కోలేడు: సోమిరెడ్డి

జగన్ నోటి వెంట నీతి సూక్తులు రావడం.. దెయ్యాలు వేదాలు వల్లించడం ఒక్కటేనని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్ని జన్మలు ఎత్తినా జగన్ తన లిక్కర్ స్కాం పాపాలు కడుక్కోలేడన్నారు. జే బ్రాండ్స్‌తో వందల మంది ప్రాణాలు తీసి.. వేల కుటుంబాలను ఆర్థికంగా చితికిపోయేలా చేసి రోడ్డున పడేసిన వ్యక్తి జగన్ అన్నారు.

మరో.. 'కరూర్' జరగొచ్చు!

భారీ జన సమీకరణ చేస్తున్నారు

- ఏదైనా జరిగితే ప్రాణనష్టం తప్పదు
- రోడ్డు మార్గంలో అనుమతి లేదు
- విశాఖ కమిషనర్, అనకాపల్లి ఎస్పీ స్పష్టీకరణ
- రాత్రి పొద్దుపోయాక షరతులతో కూడిన అనుమతిచ్చిన విశాఖపట్నం కమిషనర్
- మమ్మల్ని ఎవరు అడ్డుకుంటారో చూస్తాం: వైసీపీ

అనకాపల్లి/విశాఖపట్నం/మద్దిలపాలెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం అనకాపల్లి జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో ఉన్న మాకవరపాలెంలో మెడికల్ కాలేజీని పరిశీలించనున్నారు. ఈ క్రమంలో ఆయన విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి వచ్చి.. అక్కడనుంచి అనకాపల్లిలోని కాలేజీకి వెళ్తారు. ఈ కాలేజీ పునాదుల దశ కూడా పూర్తికాలేదు. అయినప్పటికీ జగన్ ఇక్కడ పర్యటించి.. గొప్పలు చెప్పుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ఇదిలా వుంటే.. విశాఖ నుంచి మాకవరపాలెంలోని కాలేజీకి 63 కిలోమీటర్ల దూరం ఉంది. విశాఖ కమిషనరేట్ పరిధిలో 11 కిలో మీటర్లు ఉంటుంది. అక్కడి నుంచి అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశిస్తారు. అయితే.. విశాఖ నుంచి రోడ్ షో నిర్వహించి.. బల ప్రదర్శన ద్వారా మాకవరపాలెం చేరుకోవాలన్నది వైసీపీ ఎత్తుగడ. ఈ విషయాన్ని పసిగట్టిన విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హాలు.. జగన్ రోడ్డు మార్గంలో వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. ఇలా అనుమతిస్తే తమిళనాడులోని కరూర్‌లో జరిగిన భారీ తొక్కిసలాట.. ఇక్కడ కూడా జరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నట్టు చెప్పారు. విశాఖ నుంచి నేరుగా మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌లో వెళ్తే అభ్యంతరం లేదన్నారు. మంగళవారం అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మీడియాతో మాట్లాడుతూ.. "మాజీ సీఎం జగన్ రోడ్డు మార్గంలో మాకవరపాలెం వెళ్లేందుకు అనుమతి కోరారు. అయితే, భారీ జన సమీకరణ జరుగుతున్నట్టు గుర్తించాం. లంకెలపాలెం జంక్షన్‌కు 3వేల మంది, డైట్ జంక్షన్‌కు 1,500మంది, కొత్తూరు జంక్షన్‌కు 7వేల మంది, తాళ్లపాలెం జంక్షన్‌కు 7వేల మందిని చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశంతో పాటు అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని పరిశ్రమలకు రాకపోకలు సాగించే ఉద్యోగులు ఇబ్బంది పడతారు. తమిళనాడులోని కరూర్‌లో జరిగిన తొక్కిసలాట మాదిరిగా ఏదైనా జరిగే అవకాశం లేకపోలేదు. అందుకే రోడ్డు మార్గంలో పర్యటనకు అనుమతులు ఇవ్వడం లేదు. హెలికాప్టర్‌లో వెళ్లాలని కోరుతున్నాం. మాకవరపాలెంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే అనుమతిస్తాం." అని తెలిపారు.

విశాఖ పరిధిలో అనుమతి: బాగ్చీ

జగన్ మాకవరపాలెం పర్యటనకు సంబంధించి విశాఖ పరిధిలో కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇస్తున్నట్టు విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం రాత్రి ప్రకటించారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గంలో ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి మీదుగా రోడ్డుమార్గంలో ప్రయాణించేందుకు అనుమతి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే, ట్రాఫిక్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టంచేశారు. పైలట్ ఎస్కార్ట్ సహా పది వాహనాలకు మించి కాన్వాయ్‌లో ఉండకూడదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిషిద్ధమన్నారు శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి ఎదురైనా, ప్రజలకు, సాధారణ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగినా ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్యక్రమాన్ని నిలిపివేస్తామన్నారు. కాగా.. మంగళవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడిన సీపీ బాగ్చీ రోడ్డుమార్గంలో మాకవరపాలెం వెళ్లేందుకు జగన్‌కు అనుమతి నిరాకరించామని తెలిపారు. అదేరోజు విశాఖలో ఇండియా-దక్షిణాఫ్రికా జట్ల మహిళల వన్డే వరల్డ్ కప్ మ్యాచ్ ఉందని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా నగర ప్రతిష్ఠ మసకబారుతుందని అన్నారు. అంతేకాదు, జగన్ వెంట కనీసం 150 కార్లు, 500కిపైగా బైకులతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వెళతారని సమాచారం ఉందన్నారు. ముఖ్యంగా కూడళ్ల వద్ద స్థలం లేకపోవడంతో తొక్కిసలాట జరిగే అవకాశం కూడా లేకపోలేదన్న సీపీ.. అందుకే రోడ్డు మార్గంలో అనుమతివ్వడం లేదన్నారు.

ఆంక్షలు పట్టించుకోం!

- ఎవరి పర్మిషన్ అవసరం లేదు
- రోడ్ షో చేసి తీరుతాం: అమర్‌నాథ్

పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా జగన్ రోడ్డు షో ఉంటుందని, ఎవరు అడ్డుకుంటారో చూస్తామని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం మద్దిలపాలెంలో మాట్లాడుతూ.. గురువారం విశాఖ విమానాశ్రయం నుంచి నర్సీపట్నం వరకు జగన్ రోడ్డు షో ఉంటుందన్నారు. జగన్ పర్యటన వివరాలను విశాఖ పోలీస్ కమిషనర్, అనకాపల్లి జిల్లా ఎస్పీలకు తెలియజేసి, భద్రత కల్పించాలని కోరినట్టు తెలిపారు. అయితే రోడ్డు షోకు అనుమతి ఇవ్వలేదని, తమిళనాడులో జరిగిన తొక్కిసలాటను కారణంగా చూపించారని అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ జగన్ నర్సీపట్నం వస్తుంటే ఆంక్షలు పెడుతున్నారని, మరి ముఖ్యమంత్రి పర్యటనలకు ఆంక్షలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. "మేం పర్మిషన్ కోసం పోలీసులకు లేఖ ఇవ్వలేదు. సమాచారం కోసం ఇచ్చాం. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా రోడ్డు షో ఉంటుంది." అని తేల్చి చెప్పారు.

రీసర్వే పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్

- సర్వే డైరెక్టరేట్ కార్యాలయం కేంద్రంగా ఏర్పాటు
- జిల్లాల్లో కూడా సెంటర్లు పెట్టాలని డైరెక్టర్ ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భూముల రీసర్వే 2.0 ప్రక్రియను పరిశీలించి, పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంగళగిరిలోని సర్వే డైరెక్టరేట్ కార్యాలయం కేంద్రంగా ఇది పనిచేయనుంది. త్వరలో జిల్లాల వారీగా కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సర్వే డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ ఆదేశాలిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూముల సర్వే 2.0ను ఈ జనవరి నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొత్తం 2,096 గ్రామాల్లో ఇది సాగుతోంది. తొలి దశలో జనవరిలో 628, రెండో దశ కింద జూలైలో 748 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ నెల 3 నుంచి మరో 720 గ్రామాల్లో సర్వే ప్రారంభించారు. మూడో దశ రీసర్వేలో క్షేత్రస్థాయి వాస్తవాలకు ప్రాధాన్యమిస్తామని డైరెక్టర్ తెలిపారు. సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కారం చూపేందుకు.. సాంకేతిక, ఇతర అంశాలపై అవగాహన కల్పించడానికి, ఉన్నత స్థాయి పర్యవేక్షణ కోసం సీసీఎల్ఏ జి.జయలక్ష్మి ఆదేశాలతో రాష్ట్రస్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరోవైపు.. భూసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత జగన్ ప్రభుత్వంలో క్షేత్రస్థాయికి వెళ్లకుండా చెట్ల కింద, ఆఫీసుల్లో కూర్చుని రీసర్వే రికార్డులు రూపొందించారన్న విమర్శలు వచ్చాయి. దీనికి తగినట్లుగానే రికార్డుల్లో తమ పేర్లు, భూమి విస్తీర్ణం, సరిహద్దులను తప్పుగా నమోదు చేశారని లక్షలాది మంది రైతులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి రీసర్వే జరుగుతున్న ప్రాంతాలకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే డైరెక్టర్ సహా జేడీ, ఆర్‌డీడీలు, డీడీలు జిల్లాలకు వెళ్లనున్నారు. గ్రామాల్లో పర్యటించి సర్వే జరుగుతున్న తీరుపై నేరుగా రైతులతోనే చర్చించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కూర్మనాథ్ తెలిపారు. తాను కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తానన్నారు. రైతులు, ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామని.. అవసరమున్నచోట మార్పులు తీసుకొస్తామని చెప్పారు.



తెలంగాణ తెలుగుదేశం నాయకులతో సమావేశమైన చంద్రబాబు

జూబ్లీహిల్స్‌లో పోటీకి టీడీపీ దూరం

- ఎవరికీ మద్దతివ్వకూడదని నిర్ణయం.. నేతలతో చంద్రబాబు భేటీ
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై చర్చ

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయరాదని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పోటీకి పార్టీ శ్రేణులు సమాయత్తంగా లేరన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని పార్టీ నాయకులతో చర్చించాక సీఎం చంద్రబాబు ఈ నిర్ణయానికి వచ్చారు. ఉప ఎన్నికల్లో ఏ పార్టీకీ మద్దతు ఇవ్వరాదని కూడా నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ తెలుగుదేశం నాయకులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎంపిక, పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించారు. మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సమావేశంలో పాల్గొన్న నేతలు కోరారు. రాష్ట్ర అధ్యక్షునితోపాటు రాష్ట్ర కమిటీ నియామకంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. తెలంగాణలో 1.78 లక్షల సభ్యత్వం పూర్తయ్యిందని, సంస్థాగత నిర్మాణం పూర్తిచేసి నాయకత్వాన్ని అందిస్తే.. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు క్రియాశీలకంగా పని చేయడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉన్నారని నేతలు వివరించారు. అధ్యక్షుడి నియామకం ఆలస్యమైతే.. ఈలోపు రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న చంద్రబాబు.. కమిటీల నియామకం పూర్తి చేసుకుని కార్యక్రమాలు పెంచాలని సూచించారు. సమర్థవంతంగా బాధ్యతలు నెరవేర్చేవారికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు.

ఆయుధాలు వీడుతాం

- పదిహేను వరకు సమయం ఇవ్వండి
- మావోయిస్టు పార్టీ మాడ్ డివిజన్ కమిటీ పేరిట లేఖ

చింతూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆయుధాలు వీడుతామని పేర్కొంటూ ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ డివిజను కమిటీ కార్యదర్శి రాణిత అలియాస్ సనిత పేరిట ఓ లేఖ విడుదలైంది. ఈనెల 15 వరకు సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. వాస్తవానికి ఈనెల 4నే రాసినట్టు లేఖపై తేదీ కనిపిస్తోంది. అయితే అది మంగళవారం బయటకి వచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోనూ విజ్ఞప్తులకు మాడ్ డివిజను కమిటీతో సహా పలు కమిటీలు మద్దతు ఇస్తున్నాయని రాణిత పేర్కొన్నారు. వాస్తవానికి ఏప్రిల్, మే నెలల్లోనే సాయుధ పోరాటాలకు స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తాజాగా కార్యకర్తలకు, ప్రజలకు సోనూ చేసిన విజ్ఞప్తిని, లేఖను చదవామని తెలిపారు. దేశంలో, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను గుర్తించడంలో, తదనుగుణంగా విప్లవ ఉద్యమంలో మార్పులు చేయడంలో కేంద్ర కమిటీ విఫలమైందన్నారు. తప్పుడు నిర్ణయాల కారణంగా తమ ప్రయత్నాలేవీ సఫలం కాలేదన్నారు. ఈ క్రమంలో ఆయుధాలు వీడేందుకు నిర్ణయం తీసుకున్నామని, స్నేహపూర్వక సంస్థలతో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో తమ నిర్ణయాన్ని తమ పార్టీకి, కార్యకర్తలకు వివరించాల్సి ఉన్నదన్నారు. కానీ కొనసాగుతున్న అణిచివేత మధ్య ఆ పనిని పూర్తి చేయలేమని పేర్కొన్నారు. దీని కోసం కొంతకాలం పోలీసు గస్తీ నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించారు. ఈనెల 15వ తేదీలోపు ఆ పని పూర్తి చేస్తామన్నారు. మాడ్ పరిధిలో ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడబోమని, బాధ్యతాయుతంగా ఉంటామని లేఖలో రాణిత ప్రకటించారు.

నవ వరుడిని చంపేశారు

▸ గుంటూరు జిల్లాలో పెళ్లయిన 12 రోజులకే దారుణ హత్య

గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. తన చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని ఆమె అన్న.. మరో ఇరువురితో కలిసి నవ వరుడు కుర్రా నాగ గణేశ్(25)ను కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కుర్రా నాగ గణేశ్ స్వగ్రామం బాపట్ల జిల్లా వేమూరు మండలం యడవూరు. కుటుంబంతో కలిసి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సంగంజాగర్లమూడిలో ఉంటున్నారు. గణేశ్ గుంటూరులోని పవర్ ఆఫీసులో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, కార్యాలయానికి సమీపంలోని బుడంపాడులో మూడు నెలలుగా నివాసం ఉంటున్నాడు. కొద్ది నెలల క్రితం నాగ గణేశ్ తెనాలి రూరల్ మండలం కొలకలూరుకు చెందిన కీర్తి అంజనీదేవి ఇంటికి పెళ్లి చూపులకు వెళ్లాడు. పెళ్లిచూపుల్లో ఒకరినొకరు ఇష్టపడ్డారు. అయితే అంజనీదేవి సోదరుడు, కుటుంబ సభ్యులు ఈ సంబంధాన్ని నిరాకరించారు. అయినప్పటికీ ఇరువురూ ఫోన్లో మాట్లాడుకుంటూ ప్రేమించుకున్నారు. ఈక్రమంలో గత నెల 25న ఇంట్లో చెప్పకుండా పారిపోయి అమరావతి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. వివాహ అనంతరం బుడంపాడులో కాపురం పెట్టారు.

పోలీసుల కౌన్సెలింగ్..: ప్రేమించి పెళ్లి చేసుకున్న నవజంట రక్షణ కోరుతూ నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా, సీఐ వంశీధర్ ఇరు కుటుంబాలనూ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయితే వరుడు నాగ గణేశ్‌ను చంపేస్తానంటూ స్టేషన్ వద్ద కూడా వధువు అన్న దుర్గారావు హెచ్చరించినట్లు తెలిసింది. దుర్గారావు హెచ్చరికలను గణేశ్ సీరియస్‌గా తీసుకోకపోయినప్పటికీ, పెళ్లయినప్పటి నుంచి గతంలో లాగా స్వేచ్ఛగా బయట తిరగకుండా ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తన స్నేహితుడైన సంగుల కరుణ అనే యువకుడితో కలిసి నాగ గణేశ్ ద్విచక్ర వాహనంపై గుంటూరులోని ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లి బంగారం కుదువపెట్టి డబ్బు తీసుకున్నాడు. తిరిగి పొన్నూరు రోడ్డు మీదుగా ఇరువురూ ఇంటికి వెళ్తుండగా, మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో దుర్గారావు మరో ఇరువురుతో కలిసి వీరిని అడ్డగించి గొడవపడ్డాడు. తొలుత నాగ గణేశ్ రాయితో కొట్టి ఆ తర్వాత కత్తులతో పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. స్నేహితుడు కరుణ వెంటనే గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



రామేశ్వరం సమీపంలోని పాంబన్ వద్ద జాలర్ల వలకు మంగళవారం అరుదైన 'డూమ్స్‌డే (ప్రళయాంతపు రోజు) ఫిష్' చిక్కింది, సుమారు 10 కిలోల బరువు, ఐదడుగుల పొడవు ఉన్న ఈ చేపను చూసిన జాలరులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ ఈ రకం చేపలు ఉప ఉష్ణమండలంలో కనిపిస్తాయని, ఇవి ఒడ్డున పడితే ప్రళయం లాంటి పెనుముప్పులు సంభవిస్తాయని జపాన్, ఆసియాల్లోని మత్స్యకారులు విశ్వసిస్తుంటారని, అందువల్లే దీనిని 'డూమ్స్‌డే- ఫిష్'గా పిలుస్తారని చెప్పారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

కల్తీ కిక్కులో కొత్త కోణం!

▸ నకిలీ డిస్టిలరీ ఏర్పాటుకు జనార్దన్ ఏర్పాట్లు

▸ వైసీపీ హయాంలోనే సన్నాహాలు.. సొంత బార్‌లో ఐదు కోట్లు నష్టం

▸ పూడ్చుకోవడానికి అడ్డదారులు.. దక్షిణాఫ్రికాకు పరార్!

▸ సోదరుడు సహా ముగ్గురి అరెస్టు.. కాకినాడ ల్యాబ్‌కు 'నకిలీ' నమూనాలు!

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్ సొంత బార్ నడుపుతూ అప్పులఊబిలో కూరుకుపోయాడా? అందులో నుంచి బయటపడడానికి 'సొంతంగా' మద్యం తయారు చేసేందుకు సిద్ధమయ్యాడా? ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారీ ప్లాంట్ కోసం వైసీపీ హయాంలోనే సన్నాహాలు మొదలుపెట్టాడా?.. అంటే అవుననే ఎక్సైజ్ వర్గాలు సమాధానం ఇస్తున్నాయి. ఇబ్రహీంపట్నంలోని బార్ నుంచి సరుకు సీజ్ వరకు జరిగిన ప్రక్రియపై ఎక్సైజ్ డీసీ ఎస్.శ్రీనివాసరావు, ఈఎస్ కె.శ్రీనివాసరావు ఒక నివేదికను తయారు చేశారు. దానిని మంగళవారం ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి పంపారు. ఎక్సైజ్ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. కరోనా సమయంలో జనార్దన్ బాగా అప్పులపాలయ్యారు. ఇబ్రహీంపట్నం బార్ నష్టాల్లో కూరుకుపోయింది. రూ. ఐదు కోట్లు నష్టపోయారు. దీంతో నకిలీ డిస్టిలరీ ఏర్పాటుచేసి డబ్బులు సంపాదించాలని ఆలోచించారు. బార్ ఉన్న ప్రాంతానికి సమీపంలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని నెమ్మది నెమ్మదిగా పరికరాలను అమర్చడం మొదలుపెట్టారు. గతంలో జనార్దన్ దక్షిణాఫ్రికాలో నకిలీ మద్యం వ్యాపారం చేశారు. ఆ అనుభవంతోనే మినీ డిస్టలరీ ఏర్పాటుకు పూనుకున్నారు. జనార్దన్ తెలుగుదేశం నాయకుడిగా స్థానికంగా చలామణి అయినప్పటికీ వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలతో మంచి సంబంధాలు నడిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్నారు. జనార్దన్ సోదరుడు జగన్మోహనరావుతోపాటు బార్‌లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన బాదల్ దాస్, ప్రదీప్ దాస్ అనే ఇద్దరిని భవానీపురం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారిని ఆరో మెట్రోపాలిటన్ కోర్టులో మంగళవారం హాజరుపరచగా, కోర్టు 17వ తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. నకిలీ మద్యాన్ని ములకలచెరువు నుంచి ఇబ్రహీంపట్నం తీసుకురావడం, ఇక్కడ విక్రయించడం వంటి పనులు ప్రదీప్ దాస్, బాదల్ దాస్ చేసేవారు. ములకలచెరువు నకిలీ సరుకును.. బార్ మూసివేశాక మద్యం కోసం వచ్చేవారికి విక్రయించేవారని అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని జగన్మోహనరావు వాంగ్మూలంలో పేర్కొన్నట్టు తెలిసింది. జనార్దన్ దక్షిణాఫ్రికాలో ఉన్నట్టు కొందరు.. హైదరాబాద్‌లోఉన్నారని మరికొంతమంది చెబుతున్నారు. కాగా ఇబ్రహీంపట్నంలో గోదాము నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం నమూనాలను కాకినాడ రీజనల్ ఎక్సైజ్ ల్యాబ్(ఆర్ఈఎల్)కు పంపాలని అధికారులు నిర్ణయించారు.

సీబీఐ దర్యాప్తుపై సుప్రీం స్టే

సవేంద్రరెడ్డి కేసులో ఎస్ఎల్పీ దాఖలుకు రాష్ట్రప్రభుత్వానికి అనుమతి

▸ గంజాయి కేసును రాజకీయాలకు ఆపాదిస్తున్నారు: లూథ్రా

▸ డీజీపీ, ఎస్పీ, సీబీఐ సహా 11 మంది ప్రతివాదులకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సోషల్ మీడియా కార్యకర్త సవేంద్రరెడ్డి కేసు కీలక మలుపు తిరిగింది. ఆయన కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థను ఆదేశించింది. ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు రాష్ట్రప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. గత నెల 22న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పోలీసులు చినకొండ్రుపాడులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని.. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న బత్తుల దీవెన బాబును విచారించగా.. తాను కుంచాల సౌందరరెడ్డి అలియాస్ సవేంద్రరెడ్డి నుంచి గంజాయి కొన్నట్లు అంగీకరించాడు. అదేరోజు పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వాహనం నుంచి దాదాపు కిలోన్నర గంజాయి పట్టుబడింది. ఈ క్రమంలోనే తన భర్తను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ సవేంద్రరెడ్డి భార్య కె.లక్ష్మీప్రసన్న మర్నాడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తన భర్త ఒక రాజకీయ పార్టీ సానుభూతిపరుడని, ఆయనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు నిర్బంధించారని ఆరోపించారు. సవేంద్రరెడ్డిని విడుదల చేయాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ధర్మాసనం గత నెల 26న తీర్పు ఇచ్చింది. దీనిపై ఈ నెల 5న ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్) దాఖలు చేశారు. హెబియస్ కార్పస్ పిటిషన్ పరిధి కేవలం నిర్బంధం చట్టబద్ధమా కాదా అనేది చూడడానికే పరిమితమని, అలా కాకుండా.. సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించడం, పోలీసు దర్యాప్తును నిలిపివేయడం వంటి ఆదేశాలివ్వడాన్ని ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సవేంద్రరెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే కారణంతోనే తమ క్లయింటును పోలీసులు అరెస్టు చేశారని, ఉద్దేశపూర్వకంగానే గంజాయి కేసు పెట్టారని తెలిపారు. దీనిపై విచారణ జరపాలని హైకోర్టు సీబీఐని ఆదేశించిందన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు వినిపించారు. సవేంద్రరెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు నిబంధనలన్నీ పాటించే కేసు నమోదు చేశారన్నారు. దీనికి రాజకీయాలతో సంబంధం లేదని.. ఉద్దేశపూర్వకంగానే గంజాయి కేసును రాజకీయాలతో ముడిపెడుతున్నారని తెలిపారు. ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడానికి రాష్ట్రప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, జిల్లా ఎస్పీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పోలీసు ఇన్‌స్పెక్టర్, పోలీస్ ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్, రిలయన్స్ జియో, సీబీఐ, కుంచాల లక్ష్మీప్రసన్న సహా మొత్తం 11 మందికి నోటీసులు జారీ చేసింది. స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతినిచ్చింది. తదుపరి విచారణను నవంబరు 17వ తేదీకి వాయిదా వేసింది.

హైకోర్టు ఆదేశాలపై రీకాల్ పిటిషన్ ఉపసంహరణ

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల సవేంద్రరెడ్డి అరెస్టు, ఆయనపై గంజాయి కేసు నమోదుపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ వేసిన అనుబంధ (రీకాల్) పిటిషన్‌ను తాడేపల్లి పోలీసులు ఉపసంహరించుకున్నారు. మంగళవారం విచారణ ప్రారంభమైన వెంటనే పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ స్పందిస్తూ.. అనుబంధ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని.. ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం అంగీకరించింది. పిటిషన్ ఉపసంహరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మోహిత్‌రెడ్డికి హైకోర్టు షాక్

▸ మద్యం కేసులో ముందస్తు బెయిల్ నిరాకరణ



అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (ఏ-39)కి హైకోర్టు గట్టి షాకిచ్చింది. ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం తీర్పు ఇచ్చారు. మోహిత్‌రెడ్డి పిటిషన్‌పై న్యాయస్థానం గత నెలలో తుది విచారణ జరిపింది. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. తిరుపతి నగరాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్ హోదాలో మోహిత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని.. మద్యం ముడుపుల సొమ్మును తరలించేందుకు అధికారిక వాహనాలు వినియోగించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లాగ్ బుక్‌లో గత ఏడాది మార్చి 3, 4, 5 తేదీల్లో అధికారిక వాహనం తిరుపతి పరిసరాల్లో తిరిగినట్లు నమోదు చేశారని.. వాస్తవానికి ఆ రోజు ఆ వాహనం హైదరాబాద్ వెళ్లిందని.. టోల్ ప్లాజా సీసీటీవీ ఫుటేజ్‌లో దాని నంబర్ రికార్డయిందని తెలిపారు. 2024 వరకు తుడా ఇచ్చిన అధికారిక వాహనం పిటిషనర్ అధీనంలోనే ఉందన్నారు. మద్యం ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును అధికారిక వాహనంలో తరలించినట్లు ఆయన గన్‌మెన్, మరికొందరు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. పిటిషనర్‌కు పూర్వ నేర చరిత్ర ఉందన్నారు. 2021 తర్వాత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ-38), ఆయన కుటుంబసభ్యులు అనేక కంపెనీల్లో భాగస్వాములు అయ్యారని.. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన ఇన్‌ఫ్రా కంపెనీ ఖాతాకు 2022 నుంచి భారీగా సొమ్ము వచ్చి చేరిందని.. ఈ వ్యవహారంపై దర్యాప్తు సాగుతోందని.. అనుమానాస్పద లావాదేవీలపై పిటిషనర్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సి ఉందని.. ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. గత నెల 24న వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించి.. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం తన నిర్ణయాన్ని వెల్లడించారు.

మకిలి చరిత్ర మరిచి...

(మొదటి పేజీ తరువాయి)

దందాలు, దాడులు, హత్యలు చేసిన వారికి పదవులిచ్చి జగన్ ప్రోత్సహించారు! నేడు... కూటమి ప్రభుత్వంలో తరతమ భేదాలు చూడకుండా చర్యలు తీసుకుంటున్నారు!

నాడు కల్తీ మద్యమే లేదా?

జగన్ సోమవారం తాను ఎంపిక చేసుకున్న మీడియాతో మాట్లాడుతూ.. తన హయాంలో కల్తీ మద్యమే లేదని గొప్పలు చెప్పారు. కానీ ఆయన హయాంలోనే జంగారెడ్డిగూడెంలో 2022 మార్చిలో కల్తీ మద్యం తాగి 27 మంది చనిపోయారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ అసెంబ్లీ సాక్షిగా వాటిని కరోనా అనంతర మరణాల ఖాతాలో వేసేశారు. అసలు విషయం బయటపడుతుందని మృతుల పోస్టుమార్టం నివేదికలను కూడా రహస్యంగా ఉంచారు. ఈ మరణాలకు కారణమైన ఏ ఒక్కరిపైనా చర్యలు లేవు. ఇక.. విజయవాడ కృష్ణలంకలో 2015 డిసెంబరు 8న నాటి కాంగ్రెస్ నాయకుడు మల్లాది విష్ణుకు చెందిన బార్‌లో కల్తీ మద్యం తాగి ఏకంగా ఆరుగురు మరణించారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించి... తాము అధికారంలోకి వస్తే మద్య నిషేధం చేస్తామని ప్రకటించారు. అక్కడ సీన్ కట్ చేస్తే... 2018లో మల్లాది విష్ణును వైసీపీలో చేర్చుకున్నారు. 2019లో విజయవాడ సెంట్రల్ టికెట్ కూడా ఇచ్చారు. జగన్ చేసిన మద్య నిషేధ ప్రకటన కూడా గాల్లో కలిసిపోయింది. ముడుపులు దండుకునేందుకు వీలుగా.. మద్యం విధానాన్నే మార్చేశారు. కమీషన్లు ఇచ్చిన వారి సరుకు మాత్రమే కొన్నారు. సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ దుకాణాల్లో అత్యంత నాసిరకం మద్యం విక్రయించి... జనం ప్రాణాలతో ఆడుకున్నారు. దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్‌కు అనుమతించలేదు. నాటి లిక్కర్ దందాలోని అన్ని కోణాలను నేడు 'సిట్' బయటపెడుతోంది. మద్యం విషయంలో మకిలిని తన వెనుక పెట్టుకున్న వారే ... నేడు నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ పెద్దలతో ముడిపెట్టడానికి ప్రయత్నిస్తుండటం గమనార్హం.

నాడు: అరాచకాలకు ప్రోత్సాహం...

- తప్పు చేసిన వారిని దూరం పెట్టడం, మరీ తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై వేటు వేయడం చంద్రబాబు అనుసరించే విధానం! జగన్ ఇందుకు పూర్తిగా రివర్స్! తప్పు చేసిన వారిని పిలిచి భుజం తట్టి, పదవులిచ్చిన సంస్కృతి ఆయనది.
- వైసీపీ హయాంలో ఎమ్మెల్యే జోగి రమేశ్ నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడికి తెగబడ్డారు. ఆయనకు జగన్ మంత్రి పదవిని కానుకగా ఇచ్చారు.
- తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ఓ దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేస్తే... ఆయనపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇంటికి పిలిచి భోజనం పెట్టి అక్కున చేర్చుకున్నారు.
- హిందూపురం ఎంపీగా ఉన్న గోరంట్ల మాధవ్ 2022లో ఓ మహిళకు న్యూడ్ వీడియోకాల్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ వీడియో అప్పట్లో వైరల్ అయింది. ఆయనపైనా జగన్ కనీస చర్యలు తీసుకోలేదు. మందలించనూ లేదు. వివాదాస్పద కాల్స్‌లో దొరికిపోయిన అంబటి, అవంతి మీదా ఎలాంటి చర్యలు లేవు.
- సొంత చెల్లెలు షర్మిల మీద వైసీపీ నేత వర్రా రవీంద్రా రెడ్డి, ఇతర వైసీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా నీచపు రాతలు రాసినా జగన్ పట్టించుకోలేదు. ముంబై నటి కాదంబరి జత్వానీని దారుణంగా వేధించి, ఆమెపై తప్పుడు కేసులు పెట్టిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను... దీనికి సహకరించిన పోలీసు అధికారులనూ కాపాడుకుంటూ వచ్చారు. 'ఇది తప్పు' అని ఖండించిన వారు లేరు.
- పల్నాడులో బీసీ వర్గానికి చెందిన చంద్రయ్యను వైసీపీ హయాంలో పట్టపగలు నడిరోడ్డుపై నరికి చంపారు. గ్రామంలో టీడీపీ జెండాను నిలబెట్టడమే ఆయన చేసిన 'నేరం'! ఈ హత్య వెనుక నాటి వైసీపీ నేతల ప్రత్యక్ష హస్తం, ప్రోత్సాహం ఉన్నట్లు తెలిసినా చర్యలు లేవు. ప్రొద్దుటూరులో టీడీపీకి చెందిన నందం సుబ్బయ్య అనే బీసీ నేత హత్య వెనుక ఉన్న వైసీపీ పెద్దలకూ జగన్ అండగా నిలిచారు.

నేడు: అతి చేస్తే అరదండాలే

- సొంత చెల్లిని సొంత పార్టీ వారే అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో బూతులు తిట్టినా జగన్ పట్టించుకోలేదు. కానీ.. జగన్ సతీమణి వైఎస్ భారతిపై టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే కూటమి ప్రభుత్వం వెనువెంటనే స్పందించింది. కిరణ్ వ్యాఖ్యలు పార్టీ నైతిక ప్రమాణాలకు పూర్తి వ్యతిరేకమని భావించి... అటువంటి నీచ ప్రవర్తనను టీడీపీ ఎట్టి పరిస్థితుల్లో సహించదని చంద్రబాబు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు కిరణ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు.
- సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన వెంటనే... వాటిలో నిజానిజాలు ఏమిటనేవి కూడా పరిశీలించకుండానే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు.
- నకిలీ మద్యం తయారీ విషయంలోనూ అదే జరుగుతోంది. దీనిని బయటపెట్టింది కూటమి ప్రభుత్వంలోని అధికారులే. ఇందులో సొంత పార్టీ వారు ఉన్నా చర్యలకు ప్రభుత్వం వెనుకాడలేదు. తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, మరో టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడిపై ఆరోపణలు వచ్చిన వెంటనే వారిద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. అదే వైసీపీ పార్టీ అయితే వాళ్లకే మద్యం కాంట్రాక్టు ఇచ్చేవారని టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.


జనార్దన్‌రావు


కొడాలి శ్రీనివాసరావు


జయచంద్రారెడ్డి


హిమబిందురెడ్డి

ఎవ్వరినీ వదలొద్దు!

▸ నకిలీ మద్యం కేసులో ప్రభుత్వ ఆదేశాలు

రాయచోటి/తెనాలి/ములకలచెరువు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనధికార, నకిలీ మద్యం తయారీ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. దీని వెనుక ఎవరున్నా.. ఎంతటి వ్యక్తులైనా వదలొద్దని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఆ శాఖ పలువురు నిందితులను అరెస్టు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు నేడో రేపో పోలీసులకు లొంగిపోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ఇతడు త్వరలో భారత్‌కు వచ్చి.. వెంటనే పోలీసులకు లొంగిపోనున్నట్లు తెలుస్తోంది. సస్పెండైన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డికి జనార్దన్‌రావు సన్నిహితుడన్న విషయం తెలిసిందే. అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలో ఓ డాబాను లీజుకు తీసుకుని.. మద్యం కంపెనీల పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసి తంబళ్లపల్లె, మదనపల్లెతో పాటు పలు మండలాల్లోని బెల్ట్‌షాపులకు సరఫరా చేశారు. ఈ నెల 3న ఈ వ్యవహారాన్ని ఎక్సైజ్ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. వేల బాటిళ్ల మద్యం, బాటిళ్లు, స్పిరిట్, లేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఏ-1గా జనార్దన్‌రావు ఉండగా.. జయచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాజేశ్, పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నేత సురేంద్రనాయుడు తదితరులు కూడా ఉన్నారు. వీరిలో 10 మందిని ఇప్పటికే అరెస్టుచేశారు. మిగిలిన వారికోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, జనార్దన్‌రావు విదేశాల్లో ఉన్నారు. జయచంద్రారెడ్డిని, సురేంద్రనాయుడిని టీడీపీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో సోమవారం జనార్దన్‌రావు వీడియో విడుదల చేశారు. ఈ స్కాంలో తంబళ్లపల్లె టీడీపీ నాయకులకు ఎటువంటి సంబంధమూ లేదని, అనారోగ్య కారణాలతో విదేశాల్లో ఉన్నానని తెలిపారు. అటు జయచంద్రారెడ్డి కూడా.. తాను ఏ తప్పూ చేయలేదని, కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తానని మంగళవారం సాయంత్రం విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. కాగా.. ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందురెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. విజయవాడలోని కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తూ.. మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులకు తరలిస్తున్నా పట్టించుకోకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమెకుముందు సీఐగా పనిచేసిన మాధవి పాత్రపైనా ఆరా తీస్తున్నారు. స్థానిక పోలీసులపైనా చర్యలు తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అదుపులో కొడాలి

నకిలీ మద్యం తయారీ కేసులో ఏ-12గా ఉన్న కొడాలి శ్రీనివాసరావు ఎట్టకేలకు ఎక్సైజ్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల చేతికి చిక్కినట్లు సమాచారం. ఇతడు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వైసీపీ నాయకుడు కావడం, అరెస్టు చేస్తే స్కాం వెనకున్న ఆ పార్టీ పెద్దలు, ముఖ్యమైన నిందితుల గుట్టు రట్టుచేయొచ్చన్న ఉద్దేశంతో ఎక్సైజ్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి గత మూడ్రోజులుగా విస్తృతంగా గాలింపు చేపట్టారు. వారి ప్రయత్నాలు ఫలించి మంగళవారం శ్రీనివాసరావు చిక్కినట్లు తెలిసింది.

చిన్ననాటి మిత్రులు కలసి..

జయచంద్రారెడ్డి, జనార్దన్‌రావు చిన్ననాటి మిత్రులు కాగా.. కొడాలి శ్రీనివాసరావు జనార్దన్‌రావుకు మిత్రుడు. ఈ ఏడాది ఏప్రిల్లో ముగ్గురం తంబళ్లపల్లెలో కలుసుకున్నామని.. పాత డాబాను తన పేరుపై అద్దెకు తీసుకుంటున్నట్లు వారు చెప్పడం వరకు తెలుసని, మిగిలిన వాటితో తనకు సంబంధం లేదని శ్రీనివాసరావు అధికారులకు చెప్పినట్లు సమాచారం. అతడిని ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

ఉపేక్షించం: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ఇప్పటికే ఇద్దరు టీడీపీ నాయకులను సస్పెండ్ చేశామని, ఎంతటి పెద్దవారైనా ఉపేక్షించేది లేదని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం మచిలీపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో నిందితుడు జనార్దన్‌రావు దక్షిణాఫ్రికాలో ఉన్నాడని.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సన్నిహితులైన నాయకులు దక్షిణాఫ్రికా నుంచి వ్యాపార లావాదేవీలు నడుపుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యంలో అనేక అక్రమాలు జరిగాయని, ఒక్క వైసీపీ నాయకుడిపై కూడా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అప్పటి రాకెట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇప్పుడు ఛేదిస్తున్నారన్నారు.

నా పాలనలో కల్తీ మద్యమే లేదు



▸ కూటమి హయాంలో కుటీర పరిశ్రమగా సాగుతోంది: జగన్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): 'నేను అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడా కల్తీ మద్యమే కనిపించలేదు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా ప్రోత్సహిస్తోంది' అని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంటరీ సమన్వయకర్తలతో ఆయన సమావేశమయ్యారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమానికి పిలుపిచ్చారు. 'నేను అధికారంలో ఉండగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టేందుకు అడుగులు వేశా. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టింది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పంచాయతీ నుంచి రాష్ట్ర స్థాయి దాకా నిరసన కార్యక్రమాలను చేపట్టాలి. నేను 9న నర్సీపట్నం వైద్య కళాశాలను సందర్శించి, ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభిస్తా. ప్రైవేటీకరణను నిరసిస్తూ కరపత్రాలను పంచుదాం. ఒక్కో పంచాయతీలో 500 మంది సంతకాలు చొప్పున కోటి సంతకాలు సేకరించాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సమన్వయకర్త 2 గ్రామాలను తప్పనిసరిగా సందర్శించాలి. గ్రామ సభలు నిర్వహించాలి. 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిద్దాం. నవంబరు 24న సేకరించిన సంతకాలను గవర్నర్‌కు అందిద్దాం' అని తెలిపారు.

ఆశపెట్టి.. 1.16 కోట్లు కొల్లగొట్టి..

▸ ట్రేడింగ్ యాప్‌లో అధిక ఆదాయం ఆశ చూపి సొమ్ము కాజేసిన కిలేడీ

కనిగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఓ వ్యాపారికి సోషల్ మీడియాలో ఓ మహిళ పరిచయమైంది. తాను ట్రేడింగ్ యాప్‌లో 'గోల్డ్‌బాక్స్' బిజినెస్ చేస్తానని, పెట్టిన పెట్టుబడికి మంచి ఆదాయం వస్తోందని నమ్మించింది. మీరూ చేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశపెట్టింది. ట్రయల్ కింద రూ.లక్ష పెడితే.. 2రోజులకే రూ.3 లక్షలు ఖాతాలో జమచేసింది. నిజమేనని నమ్మిన ఆ వ్యాపారి విడతల వారీగా రూ.1.16 కోట్లు ఆమె చెప్పిన ఖాతాల్లో వేశారు. ఆ మొత్తం కొట్టేసిన ఆ మహిళ.. మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి వ్యాపారి అత్యాశకు పోయి మొదటిసారి రూ.లక్ష ఆ యువతి చెప్పిన అకౌంట్‌కు వేశారు. అవి రెండు రోజులకు రూ.3 లక్షలు అయ్యాయని చెప్పి.. ఆ మొత్తాన్ని తిరిగి వ్యాపారి అకౌంట్‌కు పంపించింది. నమ్మకం కుదరడంతో ఆ వ్యాపారి 45 రోజులుగా ఆమె చెప్పిన ఏడు ఖాతాల్లో రూ.1.16 కోట్ల వరకూ నగదు జమ చేశాడు. ఆ తర్వాత ఆ యువతి సోషల్ మీడియా నుంచి మాయమైంది. మోసపోయినట్టు గమనించిన వ్యాపారి మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. మొదటి లావాదేవీ జరిగిన ఖాతాను సీజ్ చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.